
Deccan Land




March 2024

Deccan

March

₹ 30

# దక్కన్ ల్యాండ్

సామాజిక రాజకీయ మాసపత్రిక

మార్చి - 2024

DECCAN LAND, HYDERABAD

139

MARCH - 2024



VOL 12వ వసంతంలో

139 ISSUES నూట ముప్పై తొమ్మిదో సంచిక

పూర్తి చేసుకున్న దక్కన్ ల్యాండ్




- శక్తి ఆరాధకులు-బైండ్ల కళాకారులు
- సీతమ్మలొద్దిలో సిత్రాలకోన
- రంగుల ప్రపంచాన్ని ధ్వంసం చేయకండి
- అభివృద్ధి: సుస్థిరత-అస్థిరత్వం-బాధ్యతలు



# చిల్డ్రన్స్ ఎడ్యుకేషనల్ అకాడమీ
హైదరాబాద్ (Regd. 720/1982)

బాల చెలిమి
పిల్లల వికాస పత్రిక

## తెలంగాణ బడి పిల్లల కథలు



**10 పుస్తకాల సెట్ ధర రూ.330 • తగ్గింపు ధర రూ. 300**

పిల్లలకు అత్యంత ఆనందానిచ్చేది ఆట బొమ్మలు, కథల పుస్తకాలే. పాఠ్యపుస్తకాలు అందించే జ్ఞానానికి సమాంతరంగా మరెంతో లోకజ్ఞానాన్ని అందించేది బాల సాహిత్యమే. పుస్తకాలు పిల్లల ఆలోచనా నైపుణ్యాలను పెంచుతాయి. వారి ఊహలకు ప్రాణం పోస్తాయి. వారిలో సృజనాత్మకతను పెంచుతాయి. చరిత్ర, సంస్కృతి, కళలు, సైన్స్, మానవ స్వభావాలు, జంతు స్వభావాలు, ఆరోగ్య సంబంధిత అంశాలు – ఒకటేమిటి ప్రాథమిక విజ్ఞానఖని బాలసాహిత్యం, పిల్లల్లో నైతికతను, ఆధ్యాత్మికతను, సక్రమమైన ప్రవర్తనను, మంచి చెడుల అవగాహనను పెంచే బాధ్యతను బాలసాహిత్యమే నెరవేర్చగలదు.

ఇవి అచ్చంగా మన పిల్లలు రాసిన కథలు, స్వచ్ఛమైన కథలు. 'చిల్డ్రన్స్ ఎడ్యుకేషనల్ అకాడమీ' తెలంగాణలోని ఉమ్మడి 10 జిల్లాల **"బడి పిల్లల కథలు"** సంకలనాలుగా అందమైన బొమ్మలతో గతంలో వెలువరించింది. అవి రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ విశేష ఆదరణ పొందాయి.

అలాగే ఇప్పుడు పిల్లలకోసం తెలంగాణలోని ఉమ్మడి పది జిల్లాల బాల సాహిత్య రచయితలు రాసిన **"పెద్దలు రాసిన పిల్లల కథలు"** పది సంకలనాలను అందమైన బొమ్మలతో వెలువరించింది. చిన్నారులు, పెద్దలు, సాహితీ వేత్తలు ఎప్పటివలె ఈ పుస్తకాలను ఆదరిస్తారని ఆశిస్తున్నాం.

–మణికొండ వేదకుమార్
చైర్మన్, చిల్డ్రన్స్ ఎడ్యుకేషన్ అకాడమీ

## పెద్దలు రాసిన పిల్లల కథలు (ఉమ్మడి పది జిల్లాలు)



**10 పుస్తకాల సెట్ ధర రూ.350 • తగ్గింపు ధర రూ. 300**




**ప్రతులకు**

అన్ని ప్రముఖ పుస్తక కేంద్రాలు. మరియు
'భూపతి సదన్' 3-6-716, స్ట్రీట్ నెం.12,
హిమాయత్‌నగర్, హైదరాబాద్-500029
ఫోన్ : 9030 6262 88
*email: edit.chelimi@gmail.com* *website : www.balachelimi.com*



## చిల్డ్రన్స్ ఎడ్యుకేషనల్ అకాడమీ ప్రచురించిన ఇతర పుస్తకాలు






## లీ కోర్ భూసియర్

### UNESCO చే 2016లో గుర్తింపు

లీ కోర్ భూసియర్ డిజైన్ చేసిన నిర్మాణాలు మొత్తం పదిహేడు సైట్‌లతో కూడుకున్నది. చండీగఢ్ లోని క్యాపిటల్ కాంప్లెక్స్ అనేది లా కార్బ్యుయుసియర్ ఇతర నిర్మాణాల మాదిరిగానే, సమాజం అవసరాలకు ప్రతి స్పందించడానికి ఇరవయ్యవ శతాబ్దంలో ఆధునిక ఉద్యమం వర్తింపజేయడానికి ప్రయత్నించిన నిర్మాణ పరిష్కారాలను ప్రతిబింబిస్తుంది. 1947లో భారతదేశ స్వాతంత్ర్యం, దేశవిభజన తర్వాత లాహెూర్‌ను కోల్పోవడం అనేది పంజాబ్ రాజధాని నగరం చండీగఢ్ నిర్మాణం, కాపిటల్ కాంప్లెక్స్ నిర్మాణాన్ని ప్రేరేపించింది. కొత్తగా స్వతంత్రం పొందిన భారతదేశం ప్రజాస్వామ్యాన్ని వేడుక చేసుకోడానికి, ఆధునికత వైపు దాని కవాతుకు ఈ క్యాపిటల్ ఒక ప్రతీకగా భావించబడింది. దేశప్రతిష్ట యొక్క మాన్యుమెంటల్ ప్లేస్ గా క్యాపిటల్ కాంప్లెక్స్ రూపుదిద్దుకుంది. 2016లో యునెస్కోచే గుర్తించబడింది.

TELANGANA
RESOURCE CENTRE

**"CHANDRAM"** 3-6-712/2, St.No. 12, Himayatnagar, Hyderabad - 500 029.
Fax: 040-27635644Mobile: 9030626288
E-mail: desk.deccan@gmail.com    website : www.deccanland.com







## బహుముఖ ప్రజ్ఞాశాలి పాకాల యశోదారెడ్డి

పాకాల యశోదారెడ్డి 1929 ఆగస్టు 8వ తేదీన తెలంగాణ రాష్ట్రంలోని మహబూబ్‌నగర్ జిల్లాలోని మారుమూల గ్రామం బిజినేపల్లిలో జన్మించి, అక్కడే ప్రాథమిక విద్యాభ్యాసం చేసింది. మారుమూల గ్రామం నుంచి హైద్రాబాదు నగరానికి వచ్చి, విద్యాభ్యాసం చేసి ఒక యూనివర్సిటీలో ప్రొఫెసర్ అవ్వడమనేది ఆనాడు చాలా అసాధారణమైనటువంటి విషయం. ఆమె ఎంత జ్ఞాపక శక్తి కలిగివున్నది అంటే ఒకసారి పాఠశాలకు వెళ్ళినపుడు పుస్తకాలు తేనందుకు ఆమెను క్లాసు బయటే ఉపాధ్యాయుడు వుంచినపుడు క్లాసు బయటినుంచే ఆమె పాఠం విని ఆ పాఠంలో అక్షరం పొల్లుపోకుండా వినిపించినటువంటి అద్భుతమైన ఏక సంథాగ్రాహి యశోదా రెడ్డి. స్వాతంత్ర్యానంతర తెలంగాణ తొలితరం కథకుల్లో ప్రసిద్ధ కథకురాలు యశోధారెడ్డి. రేడియో ధారావాహిక కార్యక్రమం ద్వారా "మహాలక్ష్మి ముచ్చట్లు" అనే పేరుతో తెలంగాణ భాషను తెలుగు ప్రపంచానికి పరిచయం చేసిన తొలి రచయిత్రి యశోదా రెడ్డి. వీరి గురించి సవివరంగా ప్రచురించిన దక్కన్‌ల్యాండ్ యాజమాన్యానికి మరియు రచయిత డా॥ సుంకిరెడ్డి నారాయణరెడ్డి సార్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు.

**– కె. మమత,** హైదరాబాద్

❖ ❖ ❖

## రైతు ఆత్మపై తోలు బొమ్మ లాట

స్ఫూర్తి థియేటర్ – స్టైపార్క్ 'రైతు ఆత్మ – రైతుల ఆత్మ' 'ఫార్మర్స్ సోల్' అనే పేరుతో రూపొందించబడిన లఘు చిత్రం జూమ్ మీట్‌లో జనవరి 30, 2024న అందరి నుండి మంచి ఆదరణ పొందింది. రైతుల ఆత్మహత్యలు, ఎరువులు, పురుగు మందుల విస్తారమైన వినియోగం వల్ల కలిగే దుష్ప్రభావాల ఆధారంగా రూపొందించిన తోలుబొమ్మ చిత్రం రైతులకు ఎంతగానో ఉపయోగకరం.

**– ఎ. రఘు,** మహబూబ్‌నగర్

❖ ❖ ❖

## 'బిల్ పాస్'

శ్రీధర్‌రావ్ దేశపాండే సర్ వ్యాసం దక్కన్ ల్యాండ్‌లో చదివాను. తెలంగాణ బిల్ ఆమోదం పొంది దశాబ్దం గడిచిన సందర్భంగా రాసిన ఆ వ్యాసం చాలా ఉద్వేగంను కలిగించింది. అంతే కాదు తెలంగాణ ఉద్యమం 2009 నవంబర్ 29 నుండి మొదలు పెట్టి 2014 జూన్ 2 వరకు జరిగిన పరిణామాలు కళ్ళకు కట్టినట్టుగా మళ్ళీ ఒకసారి చర్విత చరితం చేసినట్టుగా అనిపించింది. డిసెంబర్ 9 ప్రకటన తరవాత ఆంధ్రవాళ్ళు మొదలు పెట్టిన కృతిమ ఉద్యమాన్ని తట్టుకొని తెలంగాణ నిలిచి గెలిచింది. అయితే తెలంగాణ తొలిదశ ఉద్యమం కంటే రెండో దశ ఉద్యమం విజయవంతం కావడానికి ముఖ్యకారణం తెలంగాణ భావజాల వ్యాప్తి. అంతే కాకుండా తెలంగాణ సమాజం ధూమ్ దాంల రూపం లోను, చిన్న చిన్న సభల ద్వారాను, అలాగే తెలంగాణ రాష్ట్రంగా ఫామ్ కావలసిన అవసరాన్ని గ్రామీణ ప్రాంత ప్రజలకు కూడా అవగతం అయ్యే విధంగా చేసింది. మరోవైపు కాంగ్రెస్‌కి రాజకీయంగా తెలంగాణ రాష్ట్రం ఇవ్వవలసిన అవసరాన్ని కల్పించారు. మొత్తము మీద తెలంగాణ కల సాకారంలో ముచ్చటగా ముగ్గురమ్మల కృషితోను తెలంగాణ యావన్ మంది సమాజము కృషి ఫలితంగాను, స్వరాష్ట్ర సాధనలో తమ ప్రాణాలను సైతం అర్పించిన అమరులకు అందరికి జోహార్లు అర్పిస్తున్నాను.

ఇది రాస్తున్న సమయానికి కృష్ణ వాటర్ గొడవ జరుగుతుంది. విద్యాసాగర్‌రావు గారు ఎప్పుడు ఒక మాట అంటుండే వారు గోదావరి బేసిన్ లొల్లి ఒడిసింది, ఇక కృష్ణ ఒక్కటే ఉన్నది అని. ఆ గొడవ పరిష్కారానికి సమిష్టిగా అఖిలపక్షంతో వెళ్లి ఢిల్లీలో తేల్చుకోవడమే మంచిది. అలాగే ఎస్ఎల్బీసీతో సహా మిగిలిన చిన్న చిన్న ప్రాజెక్ట్సని పూర్తి చేయాలి. ప్రాణహిత చేవెళ్లను కంప్లీట్ చేసేందుకు చొరవ చూపాలి.

దక్కన్ ల్యాండ్ పత్రికలో వచ్చిన ములికి పుట్టుక గురించిన వ్యాసం చదివాను. అందులో ములికి ఉద్యమానికి పుట్టుక పూర్వోత్తరాల గురించి విస్తృతంగా చర్చించారు. కాకతీయుల కాలం నుండి బహమని దక్కనిల వరకు, ఇరాన్ సౌదీ అరేబియా నుండి వచ్చిన అఫాకీల వరకు చాలా చక్కగా వివరించారు.

**– భారత అవినాష్,** సుబేదారి, హనుమకొండ
e : avinashbharatha143@gmail.com

ద

## పరిశోధకులకు శుభవార్త   దక్కన్ ల్యాండ్‌కు ISSN ఆమోదం

**దక్కన్ ల్యాండ్ మాసపత్రిక** ISSN (International Standard Serial Number) **ఆమోదం పొందినదని తెలియజేయడానికి సంతోషిస్తున్నాం. మా** ISSN **2581-3188. ప్రముఖ, ఔత్సాహిక, పరిశోధకులు తమ పరిశోధనాత్మక, విశ్లేషణాత్మక రచనలను ప్రచురింప జేసి వినియోగించుకోవడం ద్వారా ప్రాచుర్యం చేసుకోవడానికి ఈ సదవకాశాన్ని సద్వినియోగపరుచుకోవాలని కోరుతున్నాం.**

**రచయితలు తమ రచనలను పంపవలసిన చిరునామా :**
**"చంద్రం"** 3-6-712/2, St.No. 12, Himayatnagar, Hyderabad - 500 029 Telangana.
**సంప్రదించవల్సిన ఆఫీస్ ఫోన్ : 9030626288**
E-mail: desk.deccan@gmail.com
website: www.deccanland.com

**- ఎడిటర్**

ISSN 2581-3188

విషయసూచిక


# దక్కన్ ల్యాండ్

సామాజిక, రాజకీయ మాసపత్రిక

సంపుటి: 12 సంచిక : 7 పేజీలు : 60

మార్చి - 2024

సంపాదకులు

**మణికొండ వేదకుమార్**

9848044713

edit.deccan@gmail.com

సహాయ సంపాదకులు

**కట్టా ప్రభాకర్**

సర్క్యులేషన్

**హెచ్. మోహన్‌లాల్**

వాణిజ్య ప్రకటనలు

**సయ్యద్ ఖైజర్ భాష**

9030626288

ఫొటోగ్రాఫర్

**టి.స్వామి**

కవర్‌పేజీ

**లీ కోర్‌భూసియర్**

layout & composing @

CHARITHA IMPRESSIONS

printed @ DECCAN PRESS

ఆజామాబాద్, హైదరాబాద్-500 020

కార్యాలయ చిరునామా

TELANGANA RESOURCE CENTRE

DECCAN LAND

"CHANDRAM" 3-6-712/2, St.No. 12,
Himayatnagar, Hyderabad - 500 029
TELANGANA

Mobile: 9030626288

Fax: 040-27635644

E-mail: desk.deccan@gmail.com


website : www.deccanland.com



**కృతజ్ఞతలు**

దక్కన్ ల్యాండ్ మాసపత్రికకు
సలహాలు, సూచనలు అందించిన
వివిధ రంగాల నిపుణులకు మా కృతజ్ఞతలు.


# లోపలి పేజీల్లో...



ప్రొఫెసర్
ఘంటా చక్రపాణి
ఆత్మీయ అభినందన సభ



మనిషి మెదడులో చిప్
@
న్యూరాలింక్ టెక్నాలజీ




పి.వి. నరసింహారావు ........ డా॥ వి.వి.రామారావు ........ 6
మహిళా సాధికారత........ (ఎడిటోరియల్) ........ వేదకుమార్. యం ........ 7
మానవ జాతి తప్పిదాలకు బలైపోతున్న పిచ్చుకలు ........ సత్యప్రసన్న ........ 9
అభివృద్ధి : సుస్థిరత - అస్థిరత్వం - బాధ్యతలు ........ డా॥ ఆర్.సీతారామారావు ........ 11
వాతావరణ మార్పులతో అల్లకల్లోలం ........ ఎసికె. శ్రీహరి ........ 13
మృత్యువుతో ముఖాముఖం ........ పరవస్తు లోకేశ్వర్ ........ 15
సీతమ్మలొద్దిలో సిత్రాలకోన ........ శ్రీరామోజు హరగోపాల్ ........ 17
నాటకం సర్వజనీయం ........ దక్కన్ న్యూస్ ........ 20
మనిషి మెదడులో చిప్ @ న్యూరాలింక్ టెక్నాలజీ ........ పుట్టా పెద్దఓబులేసు ........ 21
ప్రొఫెసర్ ఘంటా చక్రపాణి ఆత్మీయ అభినందన సభ ........ కట్టా ప్రభాకర్ ........ 25
మానవ శ్రేయస్సుకు నీటి అవసరం! ........ దక్కన్ న్యూస్ ........ 28
లీ కోర్‌భూసియర్ ఆర్కిటెక్చరల్ వర్క్ ........ కిరణ్‌జోషి ........ 29
బొంతల చెట్లు - నా యాది మనాది ........ శ్రీధర్‌రావ్ దేశపాండే ........ 33
వజ్రం వజ్రమే ........ చకిలం వేణుగోపాల్‌రావు ........ 37
నా పాత్ర ఇంకా సశేషం, నేను ఇక విశేషం! ........ డా. చెన్నమనేని రమేష్ ........ 41
గుల్జార్ చెప్పిన కథ ........ మంగారి రాజేందర్ (జింబో) ........ 43
శక్తి ఆరాధకులు - బైండ్ల కళాకారులు ........ డా॥ గడ్డం వెంకన్న ........ 45
మా రంగుల ప్రపంచాన్ని ధ్వంసం చేయకండి!! ........ డా॥ లచ్చయ్య గాండ్ల ........ 50
ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా స్థల నామాలు ........ డా॥ మండల స్వామి ........ 53
ఆయిల్ ఫామ్‌పై సందేహాలు - సమాధానాలు ........ బాలారణ్య ........ 55
రాగుల్లో పోషక విలువలు ........ దక్కన్ న్యూస్ ........ 57
నిత్య వసంతం (కథ) ........ సునీత ........ 58



**'దక్కన్ ల్యాండ్'**లో అచ్చవుతున్న రచనలలో వ్యక్తమవుతున్న అభిప్రాయాలన్నింటితో సంపాదకులకు ఏకీభావం ఉండాల్సిన అవసరం లేదు. 'దక్కన్ ల్యాండ్'ను పర్యావరణ, వారసత్వ సంపద, సంస్కృతి, జీవవైవిధ్య అభిప్రాయ వేదికగా, రాజకీయార్థిక, సామాజిక విశ్లేషణావేదికగా తీర్చిదిద్దాలన్నదే మా సంకల్పం. అందుకు అనుగుణంగానే అన్ని రకాల అభిప్రాయాలకు, భిన్నాభిప్రాయాలకూ స్థానం కల్పించాలన్నది మా ఉద్దేశం. వివిధ రంగాల్లో నిపుణుల రచనలను అందించడం ద్వారా ఆయా అంశాలపై, పరిష్కార మార్గాలపై పాఠకుల్లో అవగాహన పెంపొందించడమే **'దక్కన్ ల్యాండ్'** లక్ష్యం.

# పి.వి. నరసింహారావు

*పి.వి.నరసింహారావు!*
*తెలుగు వాడి తేజం!*
*ఒక చైతన్యఝరి!*
*ఒక అద్భుత సాహితీలహరి*
*బహుముఖప్రజ్ఞాశాలి.. బహుభాషావేత్త..*
*అంతేకాదు.. కాలం, సమాజపత్రం మీద చేసిన అందమైన హస్తాక్షరి*

*బీజం నుండి భుజం వరకు ఆయన వ్యక్తిత్వం ఎదిగింది. బిందువు నుండి సింధువు వరకు ఆయన ప్రజ్ఞ బహుముఖీనంగా విస్తరించింది.*

పి.వి. గారి అపురూప వ్యక్తిత్వాన్ని పరిచయం చేయడానికి భాష చాలదు. ఆయన మేధస్సును అంచనా వేయడానికి ఊహ చాలదు. దేశం (రాజకీయ రంగం)లో సమకాలీన సంక్షుభిత రాజకీయాలను మేధావులు కూడా ప్రభావితం చేయగలరని పి.వి. గారి ద్వారా నిరూపితమైనది.



పి.వి. నరసింహారావుగారు 1921లో జూన్ 28వ తేదీన వరంగల్ జిల్లా నర్సంపేట మండలం, లక్నపల్లి గ్రామంలో రుక్మాబాయమ్మ, సీతారామారావు దంపతులకు జన్మించారు. తరువాత కరీంనగర్ జిల్లా భీమదేవరపల్లిలోని వంగర గ్రామానికి చెందిన రంగారావు, రత్న బాయమ్మలకు దత్తుడై, తొలుత వేలేరులో, తదుపరి హన్మకొండలో చదువుకొన్నారు. వందేమాతరం ఉద్యమంలో పాల్గొని ఉన్నత పాఠశాల చదువుల నుండి బహిష్కరణకు గురైనారు. నిజాం రాష్ట్రం వీడి పూనా నగరంలోని ఫర్గూసన్ కాలేజీలో చేరి బిఎస్సీ వరకు చదివారు. ఆ తరువాత నాగపూర్ యూనివర్సిటీలో 'లా' చదివి ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణులై స్వర్ణ పతకం పొందారు.

పి.వి. గారు హైదరాబాద్ తిరిగి వచ్చి శ్రీ రామకృష్ణారావు గారి వద్ద జూనియర్‌గా చేరి న్యాయవాద వృత్తిని ప్రారంభించారు. కాని నిజాం నిరంకుశత్వ విధానాలు, రజాకార్ల ఆగడాలు వారిని స్థిమితంగా ఉంచలేకపోయాయి. స్వామీ రామానందతీర్థగారి పిలుపుతో స్వాతంత్ర్యోద్యమంలో చేరారు. టి.హయగ్రీవాచారి కె.వి.నర్సింగరావు, గోవింద రావు షరాఫ్ ప్రభృతులతో కలిసి మహారాష్ట్రలో చాందా నగరం చేరి అజ్ఞాతవాసం చేస్తూ సమర శంఖారావం చేశారు.

1948లో పోలీసు చర్య వల్ల హైదరాబాద్ సంస్థానం విముక్తి పొంది, భారత్ యూనియన్‌లోకి విలీనమయ్యాక, పి.వి. గారు మార్క్సిస్టు మిత్రుడు పాములపర్తి సదాశివరావు గారితో కలిసి 'కాకతీయ' వారపత్రికను నిర్వహించారు. చిత్రమేమిటంటే ఆర్యసమాజోద్యమంతో ఎదిగి, ప్రజాకవిగా మారిన కాళోజీ నారాయణరావు – కమ్యునిజం వైపు వెలుగు చూపిన పాములపర్తి సదాశివరావులకు ఆప్తమిత్రుడయ్యారు పి.వి.

పి.వి.గారు మౌలికంగా సామ్యవాది. సౌమ్యశీలి. 1951లో అఖిల భారత కాంగ్రెసు కమిటీలో సభ్యునిగా చేరి, 1952లో కరీంనగర్ D.C.C అధ్యక్షుడయ్యారు.

1957లో కరీంనగర్ జిల్లా మంథని నియోజకవర్గం నుంచి అసెంబ్లీకి పోటీ చేసి గెలుపొందిన పి.వి. గారు తమ రాజకీయ ప్రస్థానానికి శ్రీకారం చుట్టారు. ఆ తరువాత 1962, 67, 72 సంవత్స రాల్లో కూడా శాసనసభ్యునిగా గెలుపొంది మంథని ప్రాంతాభివృద్ధికి పాటుపడినారు.

1962లో నీలం సంజీవరెడ్డిగారి మంత్రివర్గంలో మొదటిసారిగా న్యాయశాఖ, జైళ్ళు, సమాచార శాఖ మంత్రిగా చేరారు. 'ఓపెన్ జైలు' ప్రతిపాదన తెచ్చి మొదటి ఓపెన్ జైలును అనంతపురంలో ఏర్పాటు చేయించారు. ఖైదీల సంక్షేమం కోసం పలు చర్యలు తీసుకున్నారు. వరంగల్ జైలు ఖైదీలకు అజంజాహి మిల్లు కార్మికుల ద్వారా తివాచీలు, చద్దర్లు తయారు చేయించడంలో శిక్షణ ఇప్పించారు.

1964-67 మధ్యకాలంలో దేవాదాయ శాఖ మంత్రిగా శిథిలమైన దేవాలయాలను ఉద్ధరించడానికి బడ్జెట్టు మంజూరు చేయించారు.


1967లో పి.వి. గారు వైద్య ఆరోగ్య శాఖామాత్యులయ్యారు. గర్భవతులైన గ్రామీణ పేద స్త్రీలకు సత్వర వైద్యసదుపాయం అందేలా ఏర్పాట్లు చేయించింది పి.వి. గారే.

1968-71లో తనకు అత్యంత ఇష్టమైన విద్యాశాఖ మాత్యులై ఎన్నో సంస్కరణలు చేపట్టారు. తెలుగు అకాడమికి రూపకల్పన చేసింది పి.వి. గారే.

1969లో తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఉద్యమం వువ్వెత్తున ఉబికింది. 1971లో కాంగ్రెస్ పార్టీ అధిష్టాన వర్గం పి.వి. గారిని ముఖ్యమంత్రిగా నియమించింది. ముఖ్యమంత్రిగా చరిత్రాత్మకమైన భూసంస్కరణల చట్టాన్ని ప్రవేశ పెట్టి నూతన ప్రజాస్వామిక విప్లవానికి నాంది పలికినారు. తెలంగాణ రాష్ట్రంలోని భూస్వాములకు పి.వి. గారి సంస్కరణలు నచ్చలేదు. కాంగ్రెస్ అధిష్ఠాన వర్గానికి మొరపెట్టుకున్నారు. రాబోయే ఎలక్షన్లలో పార్టీకి భారీ పరాజయం తథ్యమని పి.వి. సమర్థుడైన నాయకుడు కాదని ఫిర్యాదుల వెల్లువ వెళ్ళింది. దానికి జై ఆంధ్ర ఉద్యమం తోడైంది. రాష్ట్రంలో అనిశ్చిత రాజకీయ పరిస్థితి ఏర్పడిందని నాటి ప్రధాని ఇందిరాగాంధీ పి.వి.

(తరువాయి 8వ పేజీలో)

# మహిళా సాధికారత
# ఒక సమాజపు నిజమైన అభివృద్ధికి గుర్తు




'ఆధునిక స్త్రీ చరిత్రను పునర్లిఖిస్తుంది' అన్నారు గురజాడ.

రాచరికాల నుండి నేటి ఆధునిక ప్రజాస్వామ్య సమాజం వరకు స్త్రీ అనేక అసమానతలకు, వివక్షలకు, స్వేచ్ఛా రాహిత్యానికి గురవుతూనే ఉంది. విద్యకీ, భావప్రకటనా స్వేచ్ఛకీ, నిర్ణయాధికార హక్కులకూ, తన శరీరంపై తన హక్కులకు, పునరుత్పత్తి హక్కులకు, ఉపాధి అవకాశాలకు, ఆర్థిక, రాజకీయ హక్కులకు మొత్తంగా సామాజిక జీవితానికి దూరమవుతూనే ఉంది.

1975లో అంతర్జాతీయ మహిళాదినోత్సవం జరిగిన తర్వాత మన దేశ స్త్రీలలోను అస్తిత్వ చైతన్యం పెరిగింది. అంతర్జాతీయ పరిణామాలు, ప్రపంచ సాహిత్యం మనదేశ స్త్రీలను ప్రభావితం చేసాయి. ప్రతి సంవత్సరం మార్చి 8న ప్రపంచ మహిళలతో కలసి అంతర్జాతీయ మహిళా దినోత్సవాలను జరుపుకుంటున్నారు. సామూహిక ప్రదర్శనలతో పాటు పలు అంశాలపై సభలు, సెమినార్లు నిర్వహించుకుంటున్నారు. సంఘటిత శక్తిని, ఉద్యమ స్ఫూర్తిని సాధించారు. మలిదశ తెలంగాణ ఉద్యమంలో చురుకైన పాత్ర నిర్వహించారు. స్త్రీకి జరుగుతున్న అన్యాయాలకు వ్యతిరేకంగా కలసికట్టుగా కృషి చేస్తున్నారు. భారత రాజ్యాంగం అందించిన అవకాశాలతో విద్య, శాస్త్ర, సాంకేతిక, పారిశ్రామిక రంగాలలో పురోగమిస్తున్నారు. రాజకీయ రంగంలో పంచాయితీ నుండి పార్లమెంటు దాకా ప్రయాణించారు. స్త్రీలకు వచ్చిన ఈ రాజకీయ అవకాశాలు పనిపద్ధతుల్లో స్వయం నిర్ణయాలు తీసుకునే దశ వరకూ చేరలేదు.

స్త్రీలు తమశక్తి సామర్థ్యాలను వివిధ రంగాలలో పూర్తిస్థాయిలో వినియోగించడం సమాజ అభివృద్ధికి ఎంతో అవసరం. చట్ట సభలలో స్త్రీలు అధిక సంఖ్యలో ఉన్నప్పుడే వారికవసరమైన విధానాల రూపకల్పనలో భాగస్వాములు కాగలుగుతారు. స్త్రీలలో వుండే సహజ భావుకతవల్ల విధానాల రూపకల్పనలో నైతికతకు, సున్నితత్వానికి అవకాశం ఏర్పడుతుంది. మహిళలతో పాటు, ట్రాన్స్ ఉమెన్‌కి అన్ని రంగాలలో ప్రాధాన్యత కల్పించాలి. మహిళలకు ఉపాధి భద్రతతోపాటు, రక్షణ కల్పించి వారిలో ఆత్మస్థైర్యం పెరిగేందుకు కృషి చేయాలి.

ఇప్పటికే ఢిల్లీ, తమిళనాడు, పంజాబ్, కర్నాటక, తెలంగాణా రాష్ట్రాల్లో మహిళలకు ఉచిత రవాణా సౌకర్యాలను కల్పించడం ప్రయోజనకరం. చిన్న చిన్న పనిచేసే మహిళలకు, చిరు వ్యాపారులకు, సేవారంగ స్త్రీలకు ఇదొక ఉపశమనం. ఈ స్వతంత్ర ప్రయాణం ఆత్మధైర్యాన్ని, గౌరవాన్ని పెంచుతుంది. నూతన పరిచయాల మెరుగుదలవల్ల విషయ సంపద పరస్పర మారకమవుతుంది. ఆందోళనలేని స్థితి ఉత్పాదక క్రియలో నైపుణ్యంతో కూడిన నాణ్యమైన వస్తూత్పత్తికి కారణమవుతోంది.

రాజ్యాంగం స్త్రీ పురుషులిరువురికీ యిచ్చిన సమాన అవకాశాలు, హక్కుల పట్ల స్ఫూర్తిని పెంచాలి. అందరికీ అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు.

ఈ సందర్భంలో ఇటీవలే ముగిసిన వీరోచిత మహిళలు సమ్మక్క సారక్కల జాతరను స్మరించుకుందాం. ప్రపంచంలోనే అతిపెద్ద గిరిజన పండుగ సమ్మక్క సారక్క జాతర. కుంభమేళా తర్వాత అతి పెద్ద జన సమ్మేళనం దాదాపు పదిమిలియన్ల మంది ప్రజలు తరలివస్తారు. ఈ మేడారం జాతర తెలంగాణా రాష్ట్రానికి మహోన్నత సాంస్కృతిక ప్రతీక. ఇది సాంస్కృతిక వారసత్వ సంపద. యునెస్కో (UNESCO) గుర్తింపుకి అన్ని అర్హతలూ ఉన్నాయి. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు యునెస్కో గుర్తింపు సాధన కోసం తగు ప్రయత్నాలు చేయాలని కోరుతూ...

వేదకుమార్.ఎం

(మణికొండ వేదకుమార్)

ఎడిటర్

(6వ పేజీ తరువాయి)

గారితో రాజీనామా చేయించింది. దాంతో పి.వి. శకం ముగిసిందని నాటి తిరుగుబాటు దారులు సంతోషించారు. కానీ అధిష్ఠాన వర్గం పి.వి. గారిని 1974లో అఖిల భారత కాంగ్రెస్ పార్టీకి ప్రధాన కార్యదర్శిగా నియమించి, రాష్ట్రాని కన్నా దేశానికే పి.వి. గారి సేవలు అవసరమనే సంకేతాన్ని అందించింది.

1977లో కాంగ్రెస్ పార్టీ, దేశ వ్యాప్తంగా ఘోర పరాజయం పొందిన తరుణంలో, పి.వి. గారు హనుమకొండ నియోజకవర్గం నుంచి లోక్‌సభకు ఎన్నికై తొలిసారిగా పార్లమెంటులో అడుగుపెట్టి, ప్రతిపక్షంలో కూర్చొని తన ప్రతిభాపాటవాలు ప్రదర్శించారు. కీలకమైన పబ్లిక్ అకౌంట్స్ కమిటికే చైర్మన్‌గా ఎన్నికై దేశమంతా పర్యటించి, వివిధ ప్రభుత్వరంగ సంస్థలు పనిచేస్తున్న తీరు తెన్నులను నిశితంగా పరిశీలించారు.

1980లో లోక్ సభ ఎన్నికల్లో, తిరిగి హనుమకొండ నియోకజవర్గం నుంచి గెలిచి, శ్రీమతి ఇందిరాగాంధి మంత్రి వర్గంలో, విదేశాంగ మంత్రిగా చేరారు. తన బహుభాషా ప్రావీణ్యంతో అసమాన ప్రతిభతో భారతదేశ విదేశాంగ విధానాన్ని అలీన రాజ్య సిద్ధాంతాన్ని, ఐక్యరాజ్యసమితి, మొదలు అనేక దేశాలలో చాటిచెప్పి విదేశాలకు మనదేశం పట్ల గల గౌరవభావాన్ని అధికం చేశారు.



శ్రీమతి ఇందిరాగాంధీ హత్య అనంతరం, శ్రీ రాజీవ్ గాంధి ప్రధాని కావడంలో కీలకపాత్ర పోషించారు. రాజీవ్ మంత్రివర్గంలో మానవ వనరుల అభివృద్ధి శాఖను జవహర్ నవోదయ విద్యాసంస్థలు, జాతీయ సాక్షరతా మిషన్, నెహ్రూయువకేంద్ర మొదలైన 40 విభాగాలతో ప్రతిపాదించి, ఆ శాఖకు క్యాబినెట్ హోదా మంత్రిగా, 1985 నుండి 1989 వరకు, అమూల్యమైన సేవలందించారు.

1991లో రాజీవ్ గాంధీ దారుణంగా హతుడైన అత్యంత క్లిష్ట పరిస్థితుల్లో పి.వి. గారు దేశప్రధానిగా పదవీ బాధ్యతలను స్వీకరించారు. ఉగ్రవాదం, తీవ్రవాదం బుసలు కొడుతున్న తరుణమది. ఆర్థికవ్యవస్థ ఛిన్నాభిన్నమై మన బంగారం నిల్వలను కూడా విదేశాలకు తాకట్టు పెట్టవలసిన దుస్థితిలో దేశం వున్నది. పి.వి. నేతృత్వం వహించింది మైనారిటీ ప్రభుత్వానికి, గోల్డ్ బాండ్ స్కీం వంటి పలు పథకాలు ప్రవేశపెట్టి 50 సంవత్సరాల్లో సున్నాశాతం అభివృద్ధిరేటును 7% స్థాయికి పెంచి ఆర్థికంగా ఘన విజయం సాధించారు. పాకిస్తాన్, చైనా, అమెరికాలు పర్యటించి ఆయా దేశప్రభుత్వాల వైఖరులనీ భారత్‌కు అనుకూలంగా మార్చారు. తనకంటూ ఓ బలమైన వర్గాన్ని ఏర్పరచుకోలేకపోయిన పి.వి. గారు, నెహ్రూ కుటుంబేతర వ్యక్తిగా దేశానికి నాయకత్వం వహించి అపరచాణక్యునిగా పేరు తెచ్చుకున్నారు.

రాజకీయనాయకులలో సాహితీ సాంస్కృతిక స్పర్శ కనిపించదు. కానీ పి.వి. గారిలో మరో కోణం సాహిత్యం. వారు అష్టభాషా ప్రవీణ్యులు. 28 భాషల్లో ప్రవేశమున్నది. ఎన్నో గ్రంథాలకు పీఠికలు రాశారు. లోపలిమనిషి, అబల జీవితం, గొల్ల రామవ్వ, నీలిరంగుపట్టుచీర, సహస్రఫణ్ మొదలైన రచనలు వారి సాహితీ సృజనకు నిదర్శనాలు. పాశ్చాత్య రచనలెన్నో అధ్యయనం చేసిన మేధావి. సాహిత్యంతో పాటు హిందుస్థానీ సంగీతాన్ని బాగా ఆస్వాదించేవారు.

1975లో కౌలాలంపూర్‌లో జరిగిన ప్రపంచ తెలుగు మహాసభల్లో కీలకపాత్ర వహించారు. 1982లో వరంగల్‌లో జరిగిన పోతన పంచశతి ఉత్సవాలకు మూలపురుషుడు పి.వి. గారే హైద్రాబాద్‌లో ఉర్దూ విశ్వవిద్యాలయానికి కృషి చేశారు. తిరుపతిలో రాష్ట్రీయ సంస్కృత విద్యాపీఠాన్ని, నెలకొల్పారు. ఆకాశవాణిలో సంస్కృతం ఉర్దూ-భాషల్లో వార్తలు చదవటాన్ని ప్రవేశపెట్టింది పి.వి. గారే.

పి.వి. గారికి ఎనమండుగురు సంతానం. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విద్యాశాఖ మంత్రిగా పనిచేసిన కీ॥శే॥ పి.వి. రంగారావు వీరి జ్యేష్ఠపుత్రులు. సికింద్రాబాద్ లోక్‌సభ నియోజకవర్గం ఎంపి, పారిశ్రామికవేత్త కీ॥శే॥ పి.వి. రాజేశ్వరరావు గారు వీరి ద్వితీయ పుత్రులు. మూడోకొడుకు పి.వి. ప్రభాకరరావు గారు వ్యాపారవేత్త, శారద, సరస్వతి, వాణి, జయ, విజయలు కుమార్తెలు. వీరిలో శ్రీమతి సురభివాణీ దేవి అంతర్జాతీయ చిత్రకళా కారిణిగా పేరుతెచ్చుకున్నారు.

1970లో భార్య సత్యమ్మ మరణించినా, 1980లో మాతృవియోగం కలిగినా చలించక, ప్రజాసేవకే తన జీవితాన్ని అంకితమిచ్చిన స్థితప్రజ్ఞుడు శ్రీ పి.వి.

పి.వి. గారు వ్యక్తులకు, అధినేతలకు విధేయుడు కాదు, తను నమ్మిన కాంగ్రెస్ పార్టీకే విధేయుడైనారు. అందుకే వారు ఎన్నడూ పార్టీని వీడలేదు. వెన్నుపోటుకు గురైనారే కానీ వెన్నుపోటు పొడవలేదు.

ఆధునిక భారతచరిత్రలో అరుదైన శకాన్ని సృష్టించి, అభ్యుదయ భావాలతో జీవించిన ఆధ్యాత్మిక వేత్త, రాజకీయ వేదాంతి.

"మనం బతకాలంటే కలిసి బతకడం నేర్చుకోవాలి" అని చెప్పిన పి.వి. గారి జీవన మహా ప్రస్థానం 2004 సంవత్సరం డిసెంబర్ 23వ తేదీన ముగిసింది. జాతి ఓ గొప్ప మేధావిని కోల్పోయిందని ప్రపంచదేశాలు సంతాప సందేశాన్ని ప్రకటించాయి.

పి.వి. గురించి మహాకవి దాశరథి ఏనాడో చెప్పిన కవిత –

"మా పి.వి. మేధావి 'మధుర కళాజీవి'
అతని వంశం వాగ్దేవి – అతని పరం నవ భావి"

ప్రజాకవి కాళోజి అన్నట్లు – పి.వి. ఓ మహాపురుషుడే కాదు ఓ మధురమైన కల.

*(తెలంగాణ ప్రభుత్వం భాషా సాంస్కృతిక శాఖ ప్రచురించిన 'తెలంగాణ తేజోమూర్తులు' నుంచి)*

– డా॥ వి.వి. రామారావు



# మానవ జాతి తప్పిదాలకు బలైపోతున్న పిచ్చుకలు

పర్యావరణాన్ని కాపాడే ఈ పిచ్చుకల జాతిని సంరక్షించు కునేందుకు ప్రత్యేకంగా నడుం బిగించాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. మనిషి తన మనుగడ తాను చూసుకుంటూ మిగతా పరిసరాలను, జీవజాలాన్ని విస్మరిస్తున్నాడు. పిచ్చుకమీద మనం ప్రయోగిస్తున్న బ్రహ్మాస్త్రాలతో పక్షి జాతి నిర్వీర్యమవుతోంది. పిచ్చుకల జాతిని పరిరక్షించడానికి ప్రపంచవ్యాప్తంగా **2010 నుంచి మార్చి 20 తేదీన ప్రపంచ పిచ్చుకల దినోత్సవం నిర్వహిస్తున్నారు.** ప్రతి ఏటా ఒకకొత్త థీమ్‌తో పిచ్చుకల పరిరక్షణపై అవగాహన కల్పిస్తున్నారు, వీటి పరిరక్షణపై విద్యార్థులకు అవగాహన కల్పించేలా పాఠశాలలు, కళాశాలల్లో అవేర్‌నెస్ క్యాంపైన్స్, వ్యాసరచన, సమావేశాలు, ర్యాలీలు నిర్వహిస్తున్నారు.



ఒకప్పుడు మనం నిద్రలేవగానే మన కళ్ల ముందు కనిపించే చిన్ని నేస్తం పిచ్చుక. పెరట్లో చెట్లపై ఎన్నో రకాల పక్షులు కిలకిలా రావాలు చేసినా ఇంటి చూరుల్లో, గోడల నెర్రెల్లో గూడు కట్టుకుని కళ్లు తెరవగానే కనిపించే ఈ జంట చిట్టి గువ్వలు చేసే కిచ కిచలు నేడు కరువయ్యాయి. అరచేతిలో ప్రపంచాన్ని ఇముడ్చు కోవాలనే తాపత్రయంలో ఇబ్బడి ముబ్బడిగా ఏర్పాటు చేస్తున్న సెల్‌టవర్లు ఈ చిన్నారి నేస్తాలకు మరణ శాసనాన్ని రాస్తున్నాయి.

పర్యావరణాన్ని తన శక్తిమేరకు కాపాడే పిచ్చుకలను రక్షించేందుకు పక్షుల ప్రేమికులు ప్రత్యేకంగా వీటికోసం అన్వేషించే పరిస్థితులు ఏర్పడ్డాయంటే ఎంతో బాధాకరం. మన ఇంట్లో మనతో పాటు ఉండే ఈ చిట్టి గువ్వలు ఇంట్లో క్రిమికీటకాలు కనిపించాయంటే గుటుక్కున మింగేసి మనల్ని వీటిబారి నుంచి కాపాడతాయి. గుప్పెడు గింజలు వేస్తే చాలు కలకాలం తోడుంటామని మన చెంతనే ఉంటాయి.

వేకువ జామున కిలకిలారావాలతో మేలుకొలుపు పాడే పిచ్చుకలను చూస్తే మనసుకు కాసింత హాయి.. చూరుకు వేలాడదీసిన వరి కంకులు తింటూ 'కిచ కిచ' మంటూ గోల చేసే చిట్టి పిట్టలు కలిగించే ఉత్సాహం మాటల్లో చెప్పలేం.! ఇసుక, మట్టిలో పొర్లాడే దృశ్యాలు.. అద్దంలో తనను తాను చూసుకుని మురిసిపోతూ పిట్టలు సందడి చేసిన క్షణాలు ఎంతో మందికి తీపి జ్ఞాపకాలు.

మనిషికి దగ్గరగా ఉంటూ మన కుటుంబంలో ఒకరుగా ఉన్న పిచ్చుకలు.. మానవజాతి చేస్తున్న తప్పిదాలకు బలైపోతున్నాయి. ప్రపంచంలో వేగంగా అంతరిస్తున్న పక్షుల జాబితాలో తొలి స్థానంలో ఉన్న పిచ్చుకలను రక్షించుకోకపోతే జీవవైవిధ్యానికి పెనుముప్పుగా పరిణమించే అవకాశాలున్నాయి.

### పిచ్చుకల చరిత్ర

పూర్వం మధ్యదరా ప్రాంతంలో ఆవాసముండే పిచ్చుకలు కాలక్రమంలో ప్రపంచమంతటా విస్తరించాయి. అడవుల్లో కాకుండా మానవులకు దగ్గరగా ఉండేందుకే అవి ఇష్టపడతాయి. గూడుకు ముప్పు వస్తుందనుకుంటే ఇతర జాతుల పక్షులపై దాడి చేసేందుకూ వెనుకాడవు. మగ, ఆడ పిచ్చుకలు అదే వర్గానికి చెందిన పక్షులపై మాత్రమే దాడి చేయడం ఇక్కడ విశేషం.

65 ఏళ్ల క్రితం అంటే 1958లో చైనాలో పంటలు నాశనం చేస్తున్నాయనే నెపంతో లక్షల సంఖ్యలో పిట్టలను కాల్చి చంపారు. పంటల వద్ద పళ్లేలతో చైనీయులు చేసిన శబ్దాల ధాటికి పిచ్చుకలు దూరంగా వెళ్లి తలదాచుకున్నాయి.

ఆ తర్వాత పంటలను చీడపీడలు ఆశించడంతో తిండి గింజలు కరువయ్యాయి. రెండేళ్లలోనే తాము చేసిన తప్పు చైనీయులకు తెలిసొచ్చింది. పిట్టలు బతికుంటేనే పంటకు రక్ష



అని గుర్తించిన చైనీయులు వాటిని సంరక్షించడం మొదలుపెట్టారు. జీవవైవిధ్యానికి పిచ్చుకలు ఎంతలా దోహదపడతాయో తెలిపేందుకు ఇదొక ఉదాహరణ.

**ఖండాలు దాటి వచ్చే చిన్ని పిచ్చుక..**

చూడటానికి పిచ్చుకల్లా ఉండే ఈ పక్షులు ఏటా శీతాకాలంలో పశ్చిమ దేశాల నుంచి నల్లమల అభయారణ్యానికి లక్షల సంఖ్యలో వలస వస్తుంటాయి. వీటితోపాటు వలస వచ్చే హారియర్స్ అనే గద్ద జాతి పక్షులు గ్రేటర్ షార్ట్ టోడ్ లార్క్‌లను వేటాడి తింటాయి.

పిచ్చుకలు అంతరించిపోతుండటానికి కారణాలు అనేకం. భూతాపోన్నతి నుంచి రక్షణ కోసం మానవ జాతి వినియోగిస్తున్న అన్‌లెడెడ్ పెట్రోల్ అందులో ఒకటి. ఈ పెట్రోల్‌ను మండించినప్పుడు విడుదలయ్యే మిథైల్ నైట్రేట్.. చాలారకాల క్రిమికీటకాలకు విషంలా మారుతోందని, ఫలితంగా పిచ్చుకలకు ఆహారం దొరకకుండా పోతోందని ఆర్నితాలజిస్టులు (పక్షి శాస్త్రవేత్తలు) తమ పరిశోధనల ద్వారా గుర్తించారు.

పట్టణాలు, నగరాల్లో భవన నిర్మాణ శైలి మారడంతో పిచ్చుకలకు గూళ్లు కట్టుకునే అవకాశాలు తగ్గాయి. పెరటి తోటలు అంతంతమాత్రంగా ఉండటం, వాహనాల రణగొణధ్వనులు, సెల్ టవర్ల రేడియేషన్, పంటల సాగులో రసాయనాలు అధికంగా వినియోగించడం తదితర కారణాలు పిచ్చుకల జీవనానికి ముప్పుగా పరిణమించాయి.

ప్రపంచంలో ఏటా పిచ్చుకల సంఖ్య తగ్గిపోతుండటంతో ఐక్యరాజ్యసమితి స్పందించింది. ఇంటర్నేషనల్ యూనియన్ ఫర్ కన్సర్వేషన్ ఆఫ్ నేచర్ తయారు చేసిన రెడ్‌లిస్ట్ జాబితాలోకి పిచ్చుకలను చేర్చింది. మన దేశంలోనూ పిచ్చుకల్ని సంరక్షించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కొన్ని స్వచ్ఛంద సంస్థలు తమవంతు ప్రయత్నాలు చేస్తున్నాయి.

- పిచ్చుకల జీవిత కాలం నాలుగు నుంచి ఐదేళ్లు.
- బరువు 35 నుంచి 40 గ్రాములు.
- ఎగిరే వేగం గంటకు 38.5 నుంచి 50 కి.మీ.
- ఐదు నుంచి ఎనిమిది గుడ్లు పెడతాయి. 10 నుంచి 15 రోజుల్లో పొదుగుతాయి.
- ప్రత్యర్థుల నుంచి ప్రాణాలు కాపాడుకునేందుకు నీళ్లలో ఈదగలదు.
- ఆడ పిచ్చుకల్ని ఆకర్షించేందుకు మగ పిచ్చుకలే గూళ్లు కడతాయి.

– సత్యప్రసన్న
m : 9030 6262 88
e: desk.deccan@gmail.com

JBR
ARCHITECTURE COLLEGE
HYDERABAD
(Approved by Council of Architecture, New Delhi - Affiliated to JNA&FAU Hyderabad)
E-mail : jbrarchitecture@jbgroup.org.in, www.jbrachitecture.com



# అభివృద్ధి : సుస్థిరత – అస్థిరత్వం – బాధ్యతలు

మనిషి ప్రకృతికి నిలువెత్తు ఆశ. దుర్బలశత్రువు అని అంటారు. ప్రకృతిని పరిరక్షించగలడు. పాడు చేయగలడు. ఒక విధ్వంసమే సృష్టించగలడు. ఇప్పటికే అది జరిగిపోయింది. ఇప్పుడు ఈ విధ్వంసాన్ని నిలువరించటం ఎంతయినా అవసరం. నిలుపుదల దగ్గరే ఆగిపోకుండా వీలయినంతగా మేలు కలిగించే చర్యలు చేపట్టాలి. సమాజాలు అభివృద్ధి చెందటానికి పరిశ్రమలు అవసరం. పరిశ్రమల వెంట వచ్చే కాలుష్యం తప్పనిసరి. నిజానికి పరిశ్రమలు, కాలుష్యం రెండూ కవల పిల్లల్లాంటివి. ఇవి రెండూ కలిసి పెరుగుతాయి. పరిశ్రమలను దుష్టమైనవి అని అనలేం. అవి సృష్టించి ఇచ్చిన కాలుష్యాన్ని కానుకగా స్వీకరించలేం. ఈ కాలుష్యాలు పలు రకాలుగా మానవ సమాజాలను బాధిస్తుంటాయి.

మనిషి భూమి మీదకు వచ్చిన నాటి నుండే ఆవరణ వ్యవస్థలు కలుషితం కావటం మొదలైందని చెవుతారు. అయితే పర్యావరణాన్ని కాపాడటం, పర్యావరణ నిర్వహణ అన్నవి ఆధునిక కాలంలోనే చర్చకు వచ్చాయి. నేటి సమాజానికి ప్రకృతితో పని చాలా విస్తృతమైనటువంటిది. ప్రకృతితో ముడివడకుండా ఏదీ లేదు. ఆ ముడివడిన బంధాన్ని బాధ్యతగా స్వీకరించకుండా భారంగా భావించి ప్రకృతిపై మరింత భారాన్ని మోపుతూ ఉన్న తీరును ఎప్పటికప్పుడు జాగరూకులమై పరిశీలించుకోకపోతే, తగు చర్యలు చేపట్టకపోతే మూల్యం చెల్లించుకోక తప్పదు.

మానవాళి మొత్తాన్ని ఏదో ఒక మేరకు ప్రభావితం చేస్తున్న పారిశ్రామికీకరణ, పట్టణీకరణ, జనాభావిస్ఫోటనం, దారిద్ర్యం, పేదరికం, వనులు అతివినయోగం, సంప్రదాయ ఇంధన వనరులు తగ్గిపోవటం, నూతన ఇంధన వనరుల కొరకు పరిశోధనలు, ముడిసరుకు కొరకు అన్వేషించే శోధనలు తగ్గిపోవటం మొదలైనవి అన్నీ కలవరపెట్టే అంశాలుగానే మిగలటం లేదు. అవి పర్యావరణ సంక్షోభాలను మరింతగా తీవ్రతరం చేస్తున్నాయి. పర్యావరణం సంక్షోభ, విధ్వంసాలో ప్రపంచ వ్యాప్తంగానే తీవ్రమయ్యాయి.

నిజానికి ఆరోగ్యకరమైన పర్యావరణ వ్యవస్థలో జీవించటం అనేది ప్రతి ఒక్కరి ప్రాథమిక హక్కు. ఇది అందరికీ సరిసమానంగానే వర్తిస్తుంది. అయితే పేదరికంతో, దారిద్ర్యంతో బాధితమవుతున్న దేశాలు వాటిని నిర్మూలించుకునేందుకు అభివృద్ధి క్రమాన్ని వేగవంతం చేసుకోవలసిన పరిస్థితులలోనే ఉంటాయి. అభివృద్ధి చెందటం ద్వారానే పేదరికాన్ని తొలించుకోవటం సాధ్యపడుతుంది. అభివృద్ధిని ఆశించకుండా పేదరికం తొలగింపునో, నిర్మూలననో కోరుకోలేం. అభివృద్ధిని కోరుతూ ఉన్నట్లయితే, అది వెంట తెచ్చే సకల కాలుష్య కారకాలను ఆమోదించక తప్పదు. వాటిలో బాధితులం కాక తప్పదు. ఇదొక సంకటస్థితి. పర్యావరణానికి హాని కలిగిస్తూ ప్రస్తుత తరాన్నే కాకుండా, రాబోయే తరాలకు మనం ఇవ్వబోయే అభివృద్ధి ఏమిటనేది కూడా ఆలోచించాలి. దీనిలోంచే సుస్థిర అభివృద్ధి అనే భావన ఉద్భవించింది. ప్రస్తుత మానవుల అవసరాలను తీర్చడంలో ఎక్కడా రాజీపడకుండా రాబోయే తరాల అవసరాలను కూడా గుర్తెరిగి ప్రవర్తిస్తూ వనరులను వినియోగంలోకి తెచ్చుకోగలటంలోనే సుస్థిరత అభివృద్ధి అనే మాటలకు సార్థకత చేకూరుతుంది. 1970లలోనే పర్యావరణం, అభివృద్ధి అనే విషయంగా కొకొయోక్ డిక్లరేషన్లఓ తొలిసారిగా సుస్థిరాభివృద్ధి అనే పదం వాడబడింది. అంతర్జాతీయ సంస్థలు పర్యావరణానికి విధేయంగా ఉంటూ లాభదాయక అభివృద్ధి లేదా ఫలప్రద అభివృద్ధిని సాధించడానికి కట్టుబడి ఉండటం అవసరమే కాదు. అని వార్యత కూడా. పర్యావరణ హితమూ, అభివృద్ధి దాయకమూ అయిన మార్గంలోనే సుస్థిరత దాగి వుంది. ఆర్థిక స్థిరత్వం పర్యావరణ స్థిరత్వం కలిగినదే సుస్థిరాభివృద్ధి.

సుస్థిరాభివృద్ధి అనేది ఒక విధానం. అదే సమయంలో అదొక వ్యూహం. ఆర్థిక, సామాజిక పురోగతి అనే క్రమంలో పర్యావరణాఇనకి, సహజ వనురులకు ఎక్కడా ఏ చిన్న మెత్తు విఘాతం ఏర్పడకుండా నిరంతరం సాగవలసిన, వృద్ధి చెందుతూ పోవలసిన ఒక పరిక్రమం. ప్రస్తుతాభివృద్ధికి కావలసిన వనరులను వినియోగిస్తూనే ఆగామి కాల అవసరాలను కూడా దృష్టిలో పెట్టుకుని సాధించే అభివృద్ధి ఉభయులకూ లాభకరంగానే కాదు, క్షేమదాయకంగా ఉండేదే సుస్థిరాభివృద్ధి అవుతుంది. అయితే చాలా

సార్లు ప్రస్తుతమే ప్రధానమైపోయి, భవిష్యత్తును విస్మరించడం జరుగుతూ ఉంటుంది. మనం, మన వర్తమానం బాగుంటే చాలనుకోకూడదు. మన ప్రస్తుతం అనేది ఎంత సమృద్ధితోనో, పుష్కలత్వంతోనో ప్రకాశిస్తున్నా ఈ వెలుగంతా రేపటికి అంధకారంగా మారకూడనిదై ఉండాలి. కనుకనే అభివృద్ధి వాదానికి, పర్యావరణ హితానికి మధ్య ఎప్పుడు ఒక ఘర్షణ, విబేధం లేదా కొన్నిసార్లు వైషమ్యం కూడా తలెత్తుతూ ఉంటుంది.

భవిష్యత్ తరాల వారికోసం నేను లేదా మనమెందుకు ఆలోచించాలి అనే ప్రశ్న తలెత్తుంది. ఇది మానవాళి ధర్మం, విధి, బాధ్యత కూడా. ఒక కుటుంబంలో ముందు తరాలవారు కూడా సుఖంగా, క్షేమంగా, సమృద్ధంగా జీవించాలని ఎట్లా కోరుకుంటున్నామో, మానవాళి మొత్తంగానే ఒక విశాలమైన కుటుంబం అని భావించే పెద్ద మనసు మనకుండటం అవసరం. దీనికి గొప్ప త్యాగాలు కూడా చేయ పనిలేదు. వ్యక్తిగత స్వార్థ సాధనలో కొంత సడలింపు, ఉదారత చాలు. ఐక్యరాజ్యసమితి 1967లో జరిపిన మాల్తీస్ ప్రతిపాదనలు ఏమి సూచిస్తున్నాయంటే భవిష్యత్ తరాల మేలుకోసం ప్రస్తుత తరం సహజ వనరుల వినియోగంలో అతిశయం, ఆడంబరం లేకుండా, వాటిని ప్రదర్శించకుండా ఉంటే చాలు. ఇవ్వాళి మనకు అందుబాటులో ఉన్న వనరులకు, నేటికి మనం సృష్టికర్తలం కాము. కనుక వాటికి శాశ్వత యజమానులమూ కాకూడదు. వనరుల లభ్యత ప్రకృతి ప్రసాదించింది. కాకపోతే మానవ మేధశాస్త్ర సాంకేతిక ప్రగతిని సాధించడం ద్వారా కేవలం వనరుల మీదనే కాకుండా ఆసాంతం ప్రకృతిపైనేనిర్నిరోధక ఆధిపత్యాన్ని ప్రకటించగలిగింది. ఆధిక్యత చాటగలిగింది. ఈ వనరుల వినయోగంలో తగినంత వివేచన కలిగి ఉండటం ముఖ్యమైంది. ఆ వివేచన ఏమంటే ఈ వనరులపై మనకే కాదు రాబోయే తరాలకు కూడా హక్కులున్నాయని గుర్తించటం, గుర్తింపుతో సరిపెట్టకుండా అంగీకరించటంతోనే పని అయిపోయిందని భావించకుండా ఆచరణలో పెట్టడం.

1972లో ఐక్యరాజ్యసమితి మానవ పర్యావరణంపై జరిపిన శిఖరాగ్ర సదస్సులో 'స్టాక్‌హోమ్ డిక్లరేషన్ ఆన్ హ్యూమన్ ఎన్విరాన్‌మెంట్'లో సుస్థిరాభివృద్ధి అనే భావనకు ఒకింత ప్రేరణ, ప్రోత్సాహం దొరికింది. దాని నుంచి పొందాల్సిన అవగాహన, చైతన్యాలను మనం పొందే ఉన్నాం. 1972 నుంచి 1987లో వచ్చిన మాంట్రిమేల్ ప్రొటోకాల్ (ఓజోన్ ఒప్పందం), 1992లో రియోడిజనరియోలో జరిగిన 'ధరిత్రి సదస్సు'లు మనకు చాలా అంశాల పట్ల సరైన ఆలోచనకు దృక్పథాన్నిచ్చాయి. జీవవైవిద్యం



వాతావరణ మార్పులు, గ్లోబల్ వార్మింగ్, గ్రీన్‌హౌస్ వాయువుల దుష్పరిణామాలు వీటి పట్ల కూడా కావలసనింతా ఆలోచన, అవగాహనలే ఆచరణ దాకా రాలేదు. దేశాలు, దేశాధినేతలు, ప్రభుత్వాలు వారు చేయాల్సింది చేస్తారు. బాధితమవుతున్న మనుషులుగా మనం చేయాల్సిందేమిటి? పర్యావరణాన్ని కబళించి, ఆపై మానవాళిని అంతం చేసే అభివృద్ధా? ఆలోచనాపరులైన మానవులు ఎప్పుడూ అవసరమైన అనివార్యమైన సమయాల్లో సరైన నిర్ణయాలే తీసుకుంటారు. మరి మీ నిర్ణయమేంటి? అస్థిరాభివృద్ధా? సుస్థిరాభివృద్ధా!!

– డా॥ ఆర్. సీతారామారావు
m : 9866563519
e: sitametaphor@gmail.com



గుడి లేదు, గోపురం లేదు
అర్చన లేదు, అభిషేకం అంత కన్నాలేదు,
తీర్థం లేదు, తీయని లడ్డూ లేదు, మడి లేదు,
మంగళహారతి లేదు
కొలవడానికి ఓ రూపం లేదు
కలవడానికి ప్రత్యేక దారుల్లేవు
ఉన్నదొక్కటే నమ్మకం
అమ్మా" అంటే నేనున్నా బిడ్డా అనే నమ్మకం
ఆ నమ్మకమే అడవిబిడ్డల ఆరాధ్య దైవం
మహాజనుల జాతర "సమ్మక్క సారక్క"
మహోన్నత ఆచరణీయాత్మక సంప్రదాయం!
మేడారం ఆదివాసీ గిరిజన మహాజాతర శుభాకాంక్షలు.

– టి. శ్యాంసుందర్‌రావు



# వాతావరణ మార్పులతో అల్లకల్లోలం

ప్రపంచ వాతావరణ శాస్త్ర దినోత్సవం ప్రతి సంవత్సరం **మార్చి 23న** నిర్వహించబడుతుంది. ప్రకృతి సహజ ఆవసాలపై వాతావరణ మార్పులు చూపే ప్రభావం గురించి ప్రజలకు అవగాహన కలిగించడంకోసం ఈ దినోత్సవం జరుపుకుంటారు. సమాజపు భద్రత, శ్రేయస్సు కోసం జాతీయ వాతావరణ, జల సేవలు అందించే సహకారం గురించి ఈరోజు గుర్తుచేసుకుంటారు.

వాతావరణంలో చోటుచేసుకుంటున్న మార్పులకు సంబంధించి వాతావరణంపై అధ్యయనం చేసేందుకు 1950, మార్చి 23న 180 దేశాల సభ్యత్వంతో ప్రపంచ వాతావరణ సంస్థ ప్రారంభించబడింది. ఆ సంస్థ ఏర్పడిన రోజును ప్రపంచ వాతావరణ శాస్త్ర దినోత్సవంగా నిర్ణయించబడింది. ఐక్యరాజ్య సమితి ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం ఈ దినోత్సవం జరుపబడుతుంది.

### కార్యక్రమాలు

వాతావరణ శాఖ నిపుణుల ఆధ్వర్యంలో ప్రజలకోసం అవగాహన సమావేశాలు, ఛాయాచిత్ర ప్రదర్శనలు జరుగుతాయి.

వాతావరణ పరిశోధన చేసిన వాళ్ళకు ఈ దినోత్సవం సందర్భంగా అంతర్జాతీయ వాతావరణ సంస్థ బహుమతి, ప్రొఫెసర్ డాక్టర్ విల్హో వైసెల్ అవార్డు, ది నార్బర్ట్ గెర్బియర్-మమ్ అంతర్జాతీయ అవార్డులు అందజేయబడుతాయి.

ఈ దినోత్సవాన్ని జరుపుకోవడానికి చాలా దేశాలు తపాలా బిళ్ళలను, ప్రత్యేక తపాలా స్టాంపు గుర్తులను విడుదల చేస్తాయి.

### వాతావరణ మార్పులతో... అల్లకల్లోలం

వాతావరణ మార్పుల ప్రభావం ఆసియా దేశాలను అల్లకల్లోలం చేస్తోంది. అయితే ఠారెత్తించే ఎండలు లేదంటే కుండపోత వర్షాలతో కేవలం భారత్ మాత్రమే కాకుండా ఇతర ఆసియా దేశాలు సతమతమవుతున్నాయి. 2023 సంవత్సరంలో అనేక విపత్తులు ఆసియా దేశాలను వణికించాయి. అందులో అత్యధిక భాగం వరదలు తుపాన్లే ఉన్నాయి. కరువు కాటకాలతో కొన్ని దేశాలకు కంటి మీద కునుకు లేకుండా పోతే మరికొన్ని దేశాలు వరదలతో విలవిలలాడాయి.

ఈ పరిస్థితులతో ఆసియాలో ఆహార భద్రత సమస్య తలెత్తుతుందని ప్రపంచ వాతావరణ సంస్థ (డబ్ల్యుఎంఒ) ఆందోళన వ్యక్తం చేస్తోంది. ఇవి ఇలాగే కొనసాగితే భవిష్యత్‌లో సామాజికంగా ఆర్థికంగా ఈ దేశాలు మరింత విచ్ఛిన్నమవుతాయని డబ్ల్యుఎంఒ తాజా నివేదిక హెచ్చరించింది. ప్రపంచంలోనే ఆసియా ఖండం అత్యంత వేగంగా వేడెక్కుతోంది. 1961-1990 మధ్య సగటు వేడి కంటే 1991-2023 మధ్య కాలంలో ఆసియా ఖండంలో వేడిమి రెట్టింపు అయింది. వరదలు, తుపాన్లతో పాటుగా పశ్చిమాసియా దేశాలు ఇసుక తుపాన్లతో విలవిలలాడాయి.

"2023లో వాతావరణ మార్పుల ప్రభావం ఆసియా దేశాలపై విపరీతమైన ప్రభావం చూపించింది. సాధారణం కంటే అధిక వేడి, పొడి వాతావరణంతో చైనా కరువు పరిస్థితుల్ని ఎదుర్కొంది. దీని వల్ల నీటి లభ్యత తగ్గిపోవడమే కాకుండా విద్యుత్ రంగంపై కూడా ప్రభావం పడింది. కేవలం కరువు కారణంగా చైనాలో ఒక్క ఏడాది 706 కోట్ల డాలర్ల ఆర్థిక నష్టం వచ్చింది. దీనికి విరుద్ధంగా పాకిస్తాన్, భారత్‌లు వరదలు, తుపాన్లతో అల్లాడిపోయాయి" అని డబ్ల్యుఎంఒ ప్రధానకార్యదర్శి ప్రొఫెసర్ పెట్రి టాలస్ వెల్లడించారు. ఈ అతివృష్టి, అనావృష్టి పరిస్థితుల వల్ల వ్యవసాయం, ఆహార భద్రతపై అత్యధిక ప్రభావం

చూపిస్తుందని, ఆసియా దేశాల్లో ప్రభుత్వాలు ఆహార భద్రత సవాల్ని ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉండాలని అన్నారు.

**నివేదిక ఏం చెప్పిందంటే..!**

ఆసియా ఖండంలో ఉష్ణోగ్రతలు అంతకంతకూ పెరిగిపోతున్నాయి. 2023 రెండో అత్యంత వేడి సంవత్సరంగా రికార్డులకెక్కింది. 1991-2020 సగటు కంటే ఎక్కువగా 0.72 డిగ్రీల సెల్సియస్ అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

- కరువుతో ఎన్నో ప్రాంతాలు అల్లాడిపోయాయి. నీటి వనరులు తరిగిపోయాయి. ఒక్క చైనాలో కరువు కారణంగా 706 కోట్ల అమెరికా డాలర్ల నష్టం వచ్చింది.
- భారీ వర్షాలు, వరదలు పాకిస్తాన్ను అతలాకుతలం చేశాయి. కేవలం మూడు వారాల్లో ఏడాది మొత్తంగా కురవాల్సిన వానలో 60% కురిసింది. పాక్ జనాభాలో 14% మందిపై వరదలు ప్రభావం చూపించాయి.
- ఆసియాలోని పర్వత ప్రాంతాల్లో హిమానీనదాలు వేగంగా కరిగిపోతున్నాయి. గత 40 ఏళ్లలో హిమానీనదాలు పరిమాణం భారీగా తగ్గిపోయింది. గత కొంతకాలంగా మరింత వేగంగా క్షీణిస్తోంది. 2023లో అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఫలితంగా చాలా హిమానీనదాలు వేగంగా కరిగిపోవడం మొదలైంది. తూర్పు తియెన్ షాన్లో ఉరుమ్కీ గ్లేసియర్ ఉపరితలం నుంచి 1.25 మీటర్ల మేర క్షీణించింది.
- ఆసియా ఖండంలో సముద్ర ఉపరితలాలు వేడెక్కిపోతున్నాయి. 1982 నుంచి సముద్రాలు వేడెక్కడం మొదలైంది. వాయవ్య అరేబియన్ సముద్రం, ఫిలిప్పైన్స్ సముద్రం, తూర్పు జపాన్లో సముద్రం మొదలైనవి ప్రపంచంలో సముద్రాలు వేడెక్కే సగటు రేటు కంటే మూడు రెట్లు అధికంగా వేడెక్కుతున్నాయి. గత దశాబ్దంలో 0.5డిగ్రీల సెల్సియస్ అత్యధిక వేడిమి నమోదైంది.

**ఈ ఏడాది ఇంతే**

ఆసియాలో ఈ ఏడాది కూడా వివిధ దేశాలను విపత్తులు వణికిస్తున్నాయి. ఇండోనేసియా సముద్రాల్లో కొండచరియలు విరిగిపడి 15 వేల ఇళ్లు ధ్వంసమైతే లక్ష మందికి పైగా నిరాశ్రయులయ్యారు. చైనాను గత ఏడాది కరువు కాటేస్తే, ఈ ఏడాది వరదలతో అతలాకుతలమవుతోంది. మన దేశంలో హిమాచల్ ప్రదేశ్లో కురిసిన భారీ వర్షాలు ఉత్తరాఖండ్, ఢిల్లీ, పంజాబ్, హరియాణాలను కూడా వణికించాయి. ఉత్తరాది రాష్ట్రాల్లో వర్షాలకి 100 మందికిపైగా ప్రాణాలు కోల్పోయారు. లక్షలాది ఎకరాల్లో పంటనష్టం జరిగింది. ఇక పాకిస్తాన్లోనూ వరదలకి 150 మందికి పైగా మరణించారు. ఇలా వాతావరణ మార్పుల ప్రభావం అన్ని దేశాలకు సవాల్ విసురుతోంది.

– ఎసికె. శ్రీహరి
m : 9849930145
e : ackvs08@gmail.com

**FORM IV** (See Rule 8)

Statement about ownership and other particulars of periodical Deccan Land as required to be published in the first issue every year after the last day of February.

| | | |
|---|---|---|
| 1. Place of publication | : | Hyderabad |
| 2. Periodicity of its publication | : | Monthly |
| 3. Printer's Name | : | M.Veda Kumar |
| Nationality | : | Indian |
| Address | : | "CHANDRAM" 3-6-712/2, Street No.11, Himayatnagar, Hyderabad-500029. |
| 4. Publisher's Name | : | M. Veda Kumar |
| Nationality | : | Indian |
| Address | : | "CHANDRAM" 3-6-712/2, Street No.11, Himayatnagar, Hyderabad-500029. |
| 5. Editor's Name | : | M. Veda Kumar |
| Nationality | : | Indian |
| Address | : | "CHANDRAM" 3-6-712/2, Street No.11, Himayatnagar, Hyderabad-500029. |
| 6. Names and addresses of individuals who own the periodical and partners or shareholders holding More than one per cent of the total capital. | : | M. Veda Kumar |

I, M. Veda Kumar, hereby declare that the particulars given above are true to the best of my knowledge and belief.

Sd/-
(M. Veda Kumar)
Date : 1st March, 2024 Signature of Publisher

# "మృత్యువుతో ముఖాముఖం"


***'చావు ద్వారం వద్ద నిలబడి పిలుస్తుంటే
గేలి చేస్తూ పగలబడి నవ్వేవారెవరు?
కబళించిన చావును తిరిగి, విసిరి
గోడకు దిగ్గొట్టిన వారెవరు?***

**–సముద్రుడు** *(అజ్ఞాత విప్లవ కవి)*

ఈసారి సరదాగా మనం కొన్ని చావు కబుర్లు చల్లగా చెప్పుకుందామా?

మృత్యువు ముందు ముఖాముఖంగా నిలబడి దాని కళ్లల్లోకి సూటిగా చూస్తూ కాసేపు పరిహాసాలాడుకుందామా?

నేనూ, నా సతీమణి – మా ఇద్దరికీ ఏమీ పని పాటా లేనపుడు ఏమీ పొద్దుపోనపుడు మృత్యువును మజాక్ చేస్తూ కాలక్షేపం కోసం దానిమీద కొన్ని జోకులేసుకుంటూ ఉంటాం. మచ్చుకు మా చావు ముచ్చట్లు కొన్ని మీతో ముచ్చటగా పంచుకుంటాను.



మా ఇద్దరికీ పచ్చిమిరపకాయలు బాగా దట్టించి చేసిన వేడివేడి పెసరగారెలంటే మహా ఇష్టం. మేం చనిపోయాక నరకానికో లేదా స్వర్గానికో ఎక్కడికో అక్కడికి వెళ్తాం కదా! అక్కడి మెస్‌లో గరం గరం పెసర గారెలు దొరుకుతాయో లేదో అని ఇవ్వట్నించే బెంగపెట్టుకుంటూ ఉంటాం. ఇక పోతే మా ఇద్దరికీ గాలి వెలుతురూ ధారాళంగా ఉండాలి. గాలి ఆడకపోతే మాకు చచ్చేచావు. మేం బొందలోకి వెళ్లిన తర్వాత దానికి తలుపులు కిటికీలు ఉండవు కదా గాలి ఎట్లా వస్తుందని నేను పరేషాన్ అవుతుంటా. "ఏం పరవాలేదు. మనం మన బొందలో ఒక ఉషా ఫ్యాన్ ఏర్పాటు చేసుకుందాం" అని నా శ్రీమతి నన్ను ఓదారుస్తుంది. బొందలో పడుకున్న తర్వాత కాలక్షేపం ఎలా అవుతుంది. విసుగ్గా ఉంటదేమో అని నేను మళ్లీ కొత్తగా "కిరికిరి" పెడుతుంటే "అయ్యో అదేమంత ప్రాబ్లెమ్? బొందలోకి కొన్ని లావు లావు పుస్తకాలు తీసుకపోతే సరి" అని నా అర్ధాంగి ఆ సమస్యను చిటికెలో పరిష్కరిస్తుంది. నాకు మరో కోరిక కూడా ఉంది. నేను పై లోకాలకు వెళ్లాక అక్కడ సృష్టికర్త కనబడితే "నువ్వు సృష్టించిన ఈ లోకం ఇంత అస్తవ్యస్తంగా ఎందుకుంది? ఈ కష్టాలు కన్నీళ్లకు ఈ దుర్మార్గాలకు, దౌర్జన్యాలకు కారణాలేమిటి? నువ్వు చిత్రించిన ఈ చిత్రం ఇంత చెత్తగా ఎందుకుంది? You are very bad Artist" అని నిలదీసి క్లాసు పీకాలని నా ఆఖరి కోరిక.

× × ×

రవీంద్రనాథ్‌ఠాగూర్ తన కవితలో ఒక చోట ఇలా అంటాడు. ***"నేను పుట్టినప్పట్నుండి నన్ను నీడలా వెంబడిస్తూనే వున్నావు. నన్ను వెనక నుండి హఠాత్తుగా దొంగదెబ్బ తీయాలని. అయినా నువ్వంటే నాకు భయం లేదు. మరణించినా మళ్లీ మళ్లీ జన్మిస్తూనే ఉంటాను. పునరపి జననం – పునరపి మరణం".***

పెద్ద కాళోజీ "షాద్" రామేశ్వరరావుగారు మృత్యువును హుందాగా ఆహ్వానించాడు.

***"ఆకుపచ్చ ఆకులు చెట్టుకు అలంకారాలు.
పసుపుపచ్చ పండుటాకులు మోతబరువు
కొమ్మకు అతుక్కుని ఎంతకాలం వేలాడుతావు
ఆకురాలు కాలం వచ్చింది ఇక
రాలిపోరాదా".***

చాలా సంవత్సరాల క్రితం నేను కాకినాడలో "బ్రహ్మసమాజం" ప్రాంగణానికి వెళ్లాను. అక్కడ ఒక మూలలో సర్ రఘుపతి వెంకటరత్నం నాయుడు సమాధిపై రాసి ఉన్న "ఎపిటాఫ్" నన్ను ఆకర్షించింది.

***"ఇతను జీవించనూ లేదు. మరణించనూ లేదు. ఆది మధ్యాంత రహిత విశ్వవినువీధులలో సంచరిస్తూ రవంత సేపు విశ్రమించటానికి ఈ పుడమి మీద ఆగినారు".***

బన్సీలాల్‌పేట స్మశానంలోని గోపాల్‌దాస్ మఠం "కబీర్ పంత్" సభ్యులు పాడే ఒక భజన నాకు యాదికొస్తుంది.

***"దునియామే ఆయా మనుష్య బన్‌కే
యహాఁ ఫిర్‌తాహై మూరఖ్ పశూ బన్‌కే"
"సమల్ కర్ చలో మేరే మనువా
ఏ ఖిలోనా టూట్ జానే వాలీ హై
సమజ్‌కర్ దేఖో మేరే మనువా
ఏ దునియా ఛూట్ జానే వాలీ హై"***

× × ×

మృత్యువుకు ముందు రాసుకునే వీలునామాలు కూడా చాలా అందంగా ఉంటాయి. నెహ్రూ వీలునామా నాకు చాలా ఇష్టం. ఆయన నాస్తికుడు కదా! తన అంత్యక్రియలలో మతప్రమేయం, బ్రాహ్మణ పద్ధతులు ఉండకూడదని ఆయన వీలునామాలో రాశాడు. కాని క్యా ఫాయిదా? అప్పటికి ఆయన కూతురు ఒక "గూంగీ గుడియా", అమాయిక. ఆపద్ధర్మ ప్రధాని గుల్జారీలాల్ నందా పుణ్యమా అని కాశీబ్రాహ్మణ పండితుల ఆధ్వర్యంలో ఆయన కర్మకాండ ప్రయాగ సంగమంలో శాస్త్ర ప్రకారం జరిగింది. నెహ్రూ రాసిన 'డిస్కవరీ ఆఫ్ ఇండియా' ప్రభావంతో నేను కూడా 1976లో మా బాపు అంత్యక్రియలను హిందూమత పద్ధతులకు వ్యతిరేకంగా చేసి మా పెద్దల ఆగ్రహానికి గురైనాను.

కామ్రేడ్ చండ్ర రాజేశ్వరరావుగారి వీలునామా నాకు కన్నీళ్లను తెప్పించింది. ***"నేను నా జీవితాన్ని సంపూర్ణంగా వినియోగించుకున్నాను. నాకు ఆస్తులు లేవు. అప్పులు లేవు. నా తదనంతరం నా దుస్తులు పేదప్రజలకు, నా పుస్తకాలు ఏదైనా లైబ్రరీకి ఇవ్వగలరు".*** సంక్షిప్తంగా ఇదీ ఆ కమ్యూనిస్టు యోధుడి వీలునామా.

యస్.వి.ఘాటే కూడా కమ్యూనిస్టు నాయకుడు. "***'నా మృత్యువు అంత ముఖ్యమైనదేమీ కాదు. మీరెవరూ మీ పనులను వదులుకుని అమూల్యమైన మీ కాలాన్ని వృథా చేసుకుని నా అంత్యక్రియలకు రావద్దని నా విజ్ఞప్తి".*** ఇదీ ఆయన రాసిన వీలునామా.

"చివరకు మిగిలేది" నవల రాసిన బుచ్చిబాబు చనిపోయినపుడు ఒక కవి "ఆంధ్రదేశం నిలువుటద్దం భళ్లున బ్రద్దలయి పోయింది అన్నాడు. కృష్ణశాస్త్రి మరణవార్త విని శ్రీశ్రీ "షెల్లీ మళ్లీ మరణించాడు" అన్నాడు. నెహ్రూ హఠాన్మరణ వార్త కె.ఏ. అబ్బాస్‌కు అందింది. అప్పుడు ఆయన బ్లిట్జ్ వారపత్రికలో పనిచేస్తున్నాడు. అప్పటికే పేపరు డెడ్‌లైన్ దగ్గరి కొచ్చింది. మంచి టైటిల్ రెండు పదాలలోనే ఉండాలని పత్రికాధిపతి కరంజియా తొందర పెట్టసాగాడు. అబ్బాస్ ఆలోచించి Nehru Died అని కాక Nehru Lives అని టైటిల్ పెట్టాడు.

గొప్పవాళ్లు చనిపోయాక వారి గురించి రాసే జ్ఞాపకాలను "ఎలిజీలు" అంటారు. స్మృతిగీతాలు, స్మృతి వాక్యాలే ఈ ఎలిజీలు.

కొంపెల్ల జనార్ధనరావు చనిపోగా శ్రీశ్రీ ***"దొంగలంజ కొడుకులసలే మెసలే ధూర్త లోకంలో నుండి వెళ్లిపోయావా నేస్తం"*** అని కవిత రాసి అంగలార్చాడు.

లోకనాయక్ జయప్రకాశ్ నారాయణ్ మృతి వార్త విని చిన్న కాళోజీ:

***"పుటక నీది చావు నీది***
***బ్రతుకంతా దేశానిది"*** అన్నాడు.

"చివరకు మిగిలేది" నవల రాసిన బుచ్చిబాబు చనిపోయినపుడు ఒక కవి "ఆంధ్రదేశం నిలువుటద్దం భళ్లున బ్రద్దలయి పోయింది అన్నాడు. కృష్ణశాస్త్రి మరణవార్త విని శ్రీశ్రీ "షెల్లీ మళ్లీ మరణించాడు" అన్నాడు. నెహ్రూ హఠాన్మరణ వార్త కె.ఏ. అబ్బాస్‌కు అందింది. అప్పుడు ఆయన బ్లిట్జ్ వారపత్రికలో పనిచేస్తున్నాడు. అప్పటికే పేపరు డెడ్‌లైన్ దగ్గరి కొచ్చింది. మంచి టైటిల్ రెండు పదాలలోనే ఉండాలని పత్రికాధిపతి కరంజియా తొందర పెట్టసాగాడు. అబ్బాస్ ఆలోచించి Nehru Died అని కాక Nehru Lives అని టైటిల్ పెట్టాడు. అంటే ఆయన మరణించినా ఆయన ఆశయాలు కొనసాగుతూనే ఉంటాయని చెప్పటం. ఇవన్నీ ఎలిజీలే.

చంద్రశేఖర్ ఒకప్పుడు నా ప్రియ మిత్రుడు. పక్కా సోలానా తెలంగాణా వాది. సంస్కృతం చదివిన వాడు. కవిత్వం రాసేవాడు. ఇద్దరం కలిసి తెలంగాణా రచయితల సంఘంలోనూ, తెలంగాణా ఉద్యోగుల సంఘంలోనూ చురుకుగా పని చేసాం. ఆఫీసు పనుల మీద ఉత్తర భారతదేశంలోని అనేక ప్రాంతాలు పర్యటించాం. తెలంగాణా రాకముందే కుటుంబ సమేతంగా తిరుపతికి వెళ్లుతూ కడప దగ్గర రోడ్డు ప్రమాదంలో మరణించాడు. "సార్ ఎక్కువగా చదివి తక్కువగా రాయాలి" అని నాతో అనేవాడు. నేను అతని గురించి ఒక ఎలిజీ రాస్తూ: "చంద్రశేఖర్ నువ్వు చూడలేని తెలంగాణాను మేము చూస్తాం. తెలంగాణా రాగానే నేను ముందు నిన్నే జ్ఞాపకం చేసుకుంటా" అన్నాను.


అన్నట్లే తెలంగాణా సిద్ధించగానే నేను, నా సహచరి కల్పి నాంపల్లిలోని అమరవీరుల స్థూపం దగ్గరికి వెళ్లి చంద్రశేఖర్‌ను గుర్తు చేసుకుంటూ పుష్పగుచ్ఛం సమర్పించాం.

మరో మిత్రుడు కాతోజు వెంకటేశ్వర్లు హఠాత్తుగా జరిగిపోయాడు. అతను నిరంతరం కళ్లద్దాలు ధరించేవాడు. ఆయన రంగస్థల నటుడు కూడా. నేను ఆయనపై రాసిన స్మృతిగీతం ఇలా ఉంది.

***"కాతోజూ ఇదేమైనా న్యాయంగా ఉందా?***
***నాటకం నడుస్తుండగానే మధ్యలో***
***హఠాత్తుగా మాయం అయ్యావ్.***
***మళ్లీ వస్తాననైనా చెప్పలేదు.***
***రంగస్థలం ఖాళీగా ఉంది కాతోజూ***
***కాలేజీలో అటెండెన్స్ రిజిస్టర్ ఖాళీగా ఉంది***
***ప్లీజ్ ఒకసారి వచ్చి సంతకం చేసి వెళ్లరాదా?***
***అన్నట్టు కాతోజూ నీ స్కూటర్ ఇక్కడే ఉంది.***
***మరి దేవలోకంలో నువ్వు ఎలా తిరుగుతావు?***
***దోస్తులందర్నీ నువ్వు దిల్‌సుఖ్‌నగర్ చౌరాస్తాలో వదిలేసి***
***మంచుపల్లకీ ఎక్కి మౌనంగా నిష్క్రమించావు***
***కాతోజూ ఇదేమైనా న్యాయంగా ఉందా?***

*(తరువాయి వచ్చే సంచికలో)*

**–పరవస్తు లోకేశ్వర్,**
m: 91606 80847
e : lokeshwar.hyderabadi@gmail.com



సీతమ్మలొద్ది సిత్రాలకోన

# సీతమ్మలొద్దిలో సిత్రాలకోన

పెద్దపల్లి జిల్లా గట్టుసింగారం గ్రామం అడివిలో సీతమ్మలొద్దిలో అబ్బురపరిచే రాతిచిత్రాలకోన ఆవిష్కారమైంది. ఈ రాతిచిత్రాల నెలవులో వందలాది రాతిచిత్రాలున్నాయి.

ఈ చిత్రాలతావును కనిపెట్టింది ప్రఖ్యాత ఫోటో జర్నలిస్టు శ్రీ దుగ్గెంపూడి రవీందర్ రెడ్డి(రవి స్టుడియోస్, సోమాజిగూడ, హైద్రాబాద్). పెద్దపల్లి గ్రామస్థుడైన రవీందర్ రెడ్డి గారి భూములు గుట్టల మీద ఎద్దుగుట్ట, సీతమ్మ లొద్దిల దగ్గరున్నాయి. గతంలో పురావస్తుశాఖవారితో పనిచేసిన అనుభవంవల్ల కుతూహలంతో ఆ ప్రదేశాల పరిశీలనలో ఈ కొత్త రాతిచిత్రాల తావును కనుగొన్నారు రవీందర్ రెడ్డిగారు. తనకు బంధువు, రాతిచిత్రాల నిపుణుడు, కొత్త తెలంగాణ చరిత్ర బృందం సలహాదారుడు డా. బండి మురళీధర్ రెడ్డిగారిని, చరిత్రబృందం కన్వీనర్ నైన నన్ను ఈ అపూర్వమైన చరిత్రపూర్వ యుగపు తావును చూడరమ్మని ఆహ్వానించాడు.

ఊరికే రమ్మనడం కాదు. హైదరాబాద్ నుంచి స్వయంగా తన కార్లో మమ్మల్ని తోడ్కొని వెళ్ళాడు. శనివారం రాత్రి పెద్దపల్లిలో మకాం చేయించాడు. ఆదివారం పొద్దున్నే బ్రేక్ ఫాస్టులు, కార్లో తనపొలాలవద్ద ఉన్న ఫార్మ్ హౌస్ కు, అక్కణ్ణుంచి ట్రాక్టర్ కు అమర్చిన సోఫావంటి ఆసనం మీద మమ్మల్ని కూర్చోబెట్టించాడు. ట్రాక్టర్ డ్రైవర్ శంకర్ ఆ పొలాల నుంచి, అడివితొవ్వల్లో నిదానంగా నడిపించుకుంటు సీతమ్మలొద్ది వద్దకు తీసుకుని వెళ్ళాడు. అక్కణ్ణుంచి మా వెంట రవీందర్ రెడ్డిగారి అసిస్టెంట్ యాదగిరి, సతీశ్, గణేశ్ లు రాతిచిత్రాలకోనకు ట్రెక్కింగ్ చేయించి తోడ్కొని పోయారు.

దారంతా ఎత్తులు, వంపులు రాళ్ళతొవ్వ. అడివికదా అందంగా ఉంది. పట్నవాసం కాదు, శిశిర రుతువులో పాత ఆకులన్నీ రాల్చి కొత్త ఆశలన్నట్లు, ననలు తొడుగుకొంటున్న చెట్లు, నీటి బాటలు, అంతెత్తున సిబ్బితం జలపాతానికి జలనిధైన మామిడికుంట దాటినంక, ఎద్దుగుట్టకు తూర్పున సీతమ్మలొద్దికదా. గుట్ట ఎక్కే ముందర కింద వున్న సెలయేటి ఒడ్డుననే డా.బండి మురళీధర్ రెడ్డి సార్ కు తొలి పాతరాతియుగం పరికరం రాతి గొడ్డలి (సుమారుగా లక్ష సం.ల కిందటిది) లభించింది.

గుట్టెక్కి చూడగానే ఎక్కడా చూడనంత పొడవైన, ఎత్తైన ఈ చిత్రిత శిలాశ్రయాన్ని చూడబోతున్నందుకు మనసు పులకరించి పోయింది. ఈ తావు 200 అడుగుల ఎత్తైన గుట్టమీద, పశ్చిమాభిముఖంగా ఉంది. 50 అడుగుల ఎత్తు, 200 అడుగులు (6 చిన్నరాతిగుహల పొడవు) 1000 అడుగుల పొడవున్న ఈ అఖండ శిలాశ్రయం, నెలవంక వంపుతో ఉంది. ఈ రాతిచిత్రాల తావును ఉత్తరం దిశనుంచి దక్షిణం వైపుకు చూసన్తూ వెళ్ళాలనుకున్నాం.



డి. రవీందర్ రెడ్డి, డా. బి. మురళీధర్‌రెడ్డి, ఎస్. హరగోపాల్, సహాయకులు

మాతోపాటు వచ్చిన యాదగిరి మొత్తం మా ప్రయాణాన్ని, శిలాశ్రయంలో మా పరిశీలనలను కెమెరాలో రికార్డు చేసాడు. సతీశ్, గణేశ్ లిద్దరు స్థావరం కొలతలు తీసుకోవడానికి, మాకు మా పనిలో చేదోడు, వాదోడుగా ఉన్నారు. అక్కడికి ఉదయం 11గం.లలోపే చేరుకున్నాం. రెండుగంటలపాటు రాతిచిత్రాలను పరిశీలించడం, అబ్బురపోవడం మావంతైంది. ఒంటిగంట దాటిన



తొలిపాతరాతి యుగం చేతిగొడ్డలి



సూక్ష్మ రాతిపనిముట్లు



నత్తగుల్ల శిలాజం


తర్వాత సద్దిమూటల్ని విప్పి అందరం తిన్నాం. అడివిలో, చెట్ల కింద, ఇట్లా కొండనెలవుల్లో తినడం బాగుంటది. రోజువారీ దినచర్యల నుంచి మార్పు. వాతావరణమే మారిపోయిందికదా. ఆకలి తీరగానే మళ్ళీ ఈ చిత్రిత శిలాశ్రయంలో బొమ్మలవేట. నేను బొమ్మలతో పాటు అక్కడనేల మీద పరిశీలించినపుడు గుప్పిళ్ళకొద్ది సూక్ష్మరాతిపనిముట్ల (మైక్రోలిథిక్)చిప్స్ అగుపించాయి. వాటిలోంచి రాతిపనిముట్లను ఏరుకున్నాను. శిలాశ్రయం పొడుగునా సూక్ష్మరాతిపనిముట్లు దొరుకుతూనే వున్నాయి. పొద్దుతిరిగేలోగా రాతిచిత్రాల పరిశీలన పూర్తి చేయాలనే ఆలోచనవల్ల, ఎక్కువసేపు రాతిపరికరాల సేకరణకు సమయం పెట్టలేకపోయాను. అయిననేమి? అద్భుతమైన నత్తగుల్ల శిలాజం, గుప్పెడు రాతిపనిముట్లు దొరికాయి. సంతోషమనిపించింది.

మధ్యప్రదేశ్ రాష్ట్రంలో మాండ్సర్ జిల్లాలోని చతుర్భుజ నాలాలో ప్రపంచంలోనే పొడవైన రాతిచిత్రాల నెలవుంది. 5కి.మీ.ల పొడవైన రాతినెలవులలో 700 మీ.ల పొడవున్న చిత్రిత శిలాశ్రయం సందర్శకులకు అనువైనది. ఈ సీతమ్మలొద్దిలో రాతిచిత్రాలకోన పొడవు 365మీ.లు. ఇపుడీ రాతిచిత్రాల నెలవే చతుర్భుజనాలా తర్వాత రెండవ స్థానంలో ఉంటుంది.

ఇక్కడున్న రాతిచిత్రాలలో ఎక్కువగా ఎరుపురంగు చిత్రాలే. కొన్ని తెలుపు, చాలా తక్కువగా పసుపురంగులో కూడా దొరికాయి. ఈ రాతిచిత్రాలు మధ్యరాతియుగానికి (ప్రస్తుతానికి 12వేల సం.ల క్రితం), కొన్ని తొలి చారిత్రకయుగానికి (సా.శ. 1 నుంచి 6 శతాబ్దాలు) చెందినవి పురావస్తుశాస్త్రరీత్యా ఇక్కడ కనిపించిన చిత్రాల నమూనాలు ఇంతవరకు మరెక్కడా అగుపించలేదు.

రాతిచిత్రాలను పరిశీలిస్తూ, ఫోటోలు తీసుకుంటూపోయాం నేను, మురళీధర్ రెడ్డిసార్. కొత్త బొమ్మను గమనించినపుడల్లా ఆశ్చర్యానందాలు. ఎపుడో వేలయేండ్ల పురామానవులు ఇక్కడ ఈ నెలవులో ఎంతకాలం ఉన్నారో కాని, ఎంత అద్భుతమైన జీవన చిత్రాలను గీసారు. తమ జీవన సంస్కృతిని ఈ రంగులబొమ్మల్లో నిక్షిప్తం చేసారు. వారు తిరిగిన ఈ అడవిలో ఏయే జంతువులను చూసారో, వేటాడారో వాటిని చిత్రించారు. ఎందరిక్కడ ఉన్నారని తెలియడానికా, లేక కూడలి పండుగల వంటి సందర్భాల్లోనా, వారి కుడి, ఎడమచేతుల గుర్తులను ఈ రాతిగోడల మీద వారి సంతకాలుగా ముద్రించారు. ఆనందాతిశయంతో వారు నాట్యం చేసిన నాట్యదృశ్యాలను చిత్రీకరించారు. ప్రపంచమంతా లభించే రాతిచిత్రాలలో చేతిగుర్తులది ప్రత్యేకత. వాటిలో ఒకేచోట కుడి, ఎడమచేతుల గుర్తులు కనిపించడం అరుదైన సందర్భం. ఈ చేతిగుర్తులను ఇప్పటివారుకూడా గుడిగోడల మీద, ఇండ్లమీద ఎరుపురంగుతో వేయడం ఆచారంగా ఉంది.

ఈ రాతిచిత్రాలలో స్త్రీ, పురుషులు చేతులు పట్టుకుని వలయాకారంలో, వరుసలో సామూహికనృత్యాలు చేస్తున్న దృశ్యాలున్నాయి. వాళ్ళు వేసుకొన్న మడిమెలపైకి ఉన్న పాదరక్షలు ప్రత్యేకంగా కనిపించాయి. రక,రకాల జంతువులబొమ్మలు. నాట్యం చేస్తున్న మనుషుల గుంపు వెనక గీతలలో కనిపిస్తున్న ఒక బొమ్మ అడివిపిల్లిని పోలివుంది. మరొక బొమ్మ 'మాంసాహార జంతువు (కార్నివోరస్) తోకెత్తుకుని నిల్చున్నట్టు అగుపించింది. అందంగా గీసిన ఒక పెద్దతాబేలు చిత్రం. ఈ రాతిచిత్రాలలో ఎరుపు రంగునింపి వేసిన పొడవైన తోకలతో అడివిబల్లులబొమ్మలు




ఇఱ్ఱి (ఎరుపు రంగులో)



తాబేటి బొమ్మపై చేతిగుర్తు




మాంసాహారి జంతువు



నాట్యం చేస్తున్న మనుషుల గుంపు



రాతి చిత్రాలు



ఇఱ్ఱి (ఎరుపు తెలుగు)

ప్రత్యేకం. ఒకచోట వరుసగా వేసిన మూడు కోతులబొమ్మలు. వాటి పక్కన విల్లమ్ములతో ఒక మనిషి. పెద్దవి, చిన్నవి పాదాల ముద్రలు ఎరుపురంగు నింపినవి, గీతలలో ఉన్నవి కనిపించాయి.

ఈ రాతిచిత్రాలలో ఎన్నో ఎరుపురంగునింపిన అందమైన ఇఱ్ఱుల బొమ్మలు వేర్వేరు సైజుల్లో, వాటిలో ఒక ఎరుపురంగు గీతలలో గీసిన రెండు పెద్దకొమ్ములతో, వింతైన పూవువంటి కుచ్చుతోకలతో అగుపించాయి. అరుదుగా కనిపించే ఎన్నో కుడి, ఎడమచేతుల గుర్తులు కొన్ని ఎరుపు, తెలుపు, అరుదుగా పసుపు రంగునింపినవి, గీతలలో కొన్ని గుర్తించాము. ఒకచోట తొక్కుడు గీతలలో (పెట్రోగ్లైఫ్స్) జింకలబొమ్మలు, ఒక కంకణవృత్తం, ఎదురెదురుగా నిల్చున్న ఇఱ్ఱుల తెల్లరంగుబొమ్మలు ముఖ్యమైనవి. నిల్చున్న మనుషులబొమ్మలు ఎరుపురంగులోనేకాదు ఇక్కడ తెలుపురంగులో ఉన్నాయి.

ఈ సీతమ్మకోనలో రాతిచిత్రాలే కాదు, చారిత్రకంగా ప్రాధాన్యతగల నామక (లేబుల్)శాసనాలు చెక్కినవి ఆరు, ఎరుపు రంగులో రాసినవి రెండు లభించడం విశేషం. వీటిలో ప్రాకృత భాషలో, బ్రాహ్మీలిపిలో లిఖించిన సాతవాహనకాలాని(1వ శతాబ్దాని)కి చెందినవి ఆరు, విష్ణుకుండినుల కాలానివి (6వ శతాబ్దానివి) రెండు ఉన్నాయి.

వీటిలో సాతవాహన సాతకర్ణి, నాగానికల పుత్రులలో ఒకడైన హకుసిరి పేరున్న నామక శాసనం లభించడం తెలంగాణాలో ఇది రెండవసారి. మొదటిది జగిత్యాల జిల్లా మొక్కట్రావుపేటలో 12 సం.రాల క్రితం గుర్తించిన 4 పంక్తుల కుమార హకుసిరి శాసనం. ఈ రెండవ శాసనంలో 'సిద హారీతిపుత్ర కుమార అకుసిరి మితస' (హారీతిపుత్రుడు కుమార హకుసిరి మిత్రుడు) అని ఉంది. మరొకచోట ఎరుపురంగులో రాసిన నామకశాసనం 'నగకావో(ఱ)/సిద హారీతి పుతస' అని వుంది. తొలి సాతవాహనుల పేర్లలో హారీతీపుత్ర అనే సంబోధన కొత్తది. ఈ శాసనాలవల్ల సాతవాహనుల చరిత్రలోనికి 1వ శతాబ్దంలోనే 'హారీతిపుత్ర' అనే పేరు చేర్చబడింది. ఆగ్నేయదక్కన్‌లో సా.శ.3వ శతాబ్దపు ప్రాంతీయ సాతవాహన పాలకులలో హారీతీపుత్ర సాతకర్ణి అనే పేరు ఒక్కటే కనిపిస్తున్నది. ఈ శాసనాల క్రమంలో మరొక లేబుల్ శాసనం 'కుమారస సకసిరి పుతస' అనేది కూడా చారిత్రక ప్రాధాన్యత కలిగినదే. కొత్తపేరును సాతవాహనయుగంలో వెతకవలసివుంది.

మరికొన్ని రంగుతో రాసిన లేబుల్ శాసనాలు చెదిరిపోయి, అక్షరాలు అగుపించడం లేదు. వాటి జాడలు మాత్రం మిగిలాయి.


ఈ పురాచిత్రాలశాలలో నేలమీద ఎన్నో మధ్యరాతియుగపు సూక్ష్మరాతి పనిముట్లు (మైక్రోలిథ్స్) దొరకడంతో ఈ చిత్రాలు మీసోలిథిక్ పీరియడ్ కు చెందినవేనని నిర్ధారించవచ్చు. ఈ రాతిపనిముట్లను తయారుచేసేందుకు వాడుకున్న ఎన్నో ఛెర్ట్, ఫ్లింట్ కండశిలలు (కోర్ మెటీరియల్) లభించాయి. వాటిలో ఒకటిన్నర కోట్ల సం.రాల కిందటి నత్తగుల్ల శిలాజం ఉంది. మరొకటి బోరో ఫాసిల్ కూడా.

ఈ శిలాశ్రయంలో దక్షిణంవైపు రాళ్ళతో నిర్మించిన తొలియుగాల నాటి రక్షణకుడ్యం ఉన్నది. లోపలివైపు తొలిచారిత్రక యుగపు గదివంటి కట్టడం కనిపిస్తున్నది.

ధన్యవాదాలు:

వరల్డ్ రికార్డుల్లో చేర్చదగ్గ రాతిచిత్రాల నెలవును గుర్తించిన చారిత్రక యాత్ర స్ఫూర్తిదాత: శ్రీ దుగ్గెంపూడి రవీందర్ రెడ్డి, ఫోటో జర్నలిస్టు (రవి స్టుడియోస్) గారికి, సహయాత్రికులు, రాతిచిత్రాల నిపుణులు, కొత్త తెలంగాణ చరిత్ర బృందం సలహాదారులు, ఈ వ్యాసరచనకు మూలద్రవ్యాన్నందించిన డా. బండి మురళీధర్ రెడ్డిగారికి.

– శ్రీరామోజు హరగోపాల్,
m : 99494 98698
e: akshara25@gmail.com



అడివి పిల్లి ఇంకా



ఐం దఖమితం నామక శాసనం

# నాటకం సర్వజనీయం

ప్రపంచ రంగస్థల దినోత్సవం ప్రతి ఏట మార్చి 27న ప్రపంచవ్యాప్తంగా రంగస్థల కళాకారులచే జరుపబడుతున్న ఉత్సవం. ఇది 1961లో ఇంటర్నేషనల్ థియేటర్ ఇనిస్టిట్యూట్ వారిచే ప్రారంభించబడింది.

నాటకం సర్వజనీయం, సర్వకాలీనం. ప్రాముఖ్యత కలిగిన ప్రాచీన కళల్లో నాటక కళ ఒకటి. ఒక దేశం ప్రేరణా, ప్రమేయం లేకుండా ఈ నాటక కళ వివిధ దేశాల్లో విడివిడిగా ఎదిగింది. దాదాపుగా ఒకే కాలంలో పాశ్చాత్య దేశాల్లోనూ, భారతదేశంలోనూ నాటక ప్రక్రియ మొదలయ్యింది. కాలాన్ని బట్టీ, ప్రదేశాన్ని బట్టీ, సంస్కృతిని బట్టి నాటకం రూపం మారుతుందేగానీ అంతర్లీనంగా దాని మూల సూత్రం మాత్రం అందరికీ ఒక్కటే ఉంటుంది. అందువల్లే నాటకం బహుళాదరణ పొందిన రంగస్థల ప్రక్రియగావిలసిల్లుతుంది. ప్రస్తుతమున్న నాటకం కాలక్రమేణా రూపం మార్చుకుంటూ విశ్వజనీయమయ్యింది. దాని గుర్తుగానే ప్రపంచ రంగస్థల దినోత్సవం పుట్టింది.

ప్రాచీన కళల్లో నాటక కళ ఒకటి. దాదాపు ఒకే కాలంలో పాశ్చాత్య దేశాల్లోనూ, భారతదేశంలోనూ నాటక ప్రక్రియ మొదలైంది. కాలాన్ని బట్టీ, ప్రదేశాన్ని బట్టీ, సంస్కృతిని బట్టీ నాటక రూపం మారుతుందే కానీ అంతర్లీనంగా దాని మూల సూత్రం






మాత్రం అందరికీ ఒక్కటే ఉంటుంది. అందువల్లే నాటకం బహుళ ప్రజాదరణ పొంది రంగస్థల ప్రక్రియగా విరాజిల్లుతుంది.

1961లో వియన్నాలో ఇంటర్నేషనల్ థియేటర్ ఇనిస్టిట్యూట్ వారు నిర్వహించిన 9వ ప్రపంచ కాంగ్రెస్‌లో ఆనాటి అధ్యక్షుడు 'ఆర్వికివియా' ప్రపంచ రంగస్థల దినోత్సవ ప్రతిపాదన చేశాడు. సభ్యులందరూ ప్రతిపాదనను అంగీకరించారు. ఆ తరువాత ఏడాది పారిస్‌లో జరిగిన రంగస్థల సమాఖ్యలో పూర్తి స్థాయిలో మొదలయ్యింది. రంగస్థల దినోత్సవం ప్రపంచమంతా విస్తరించి ఐక్యరాజ్య సమితి, యునెస్కోలచే ప్రాధాన్యత పొందింది. ఈ వేడుకలలో భాగంగా అన్ని దేశాల్లో జరుగుతున్న నాటకాలు, ప్రదర్శనలు, ప్రక్రియల ప్రమాణాలపై పరిశీలకులు, నాటక ప్రియులు వచ్చి సమీక్షించుకుంటారు. ప్రతి సంవత్సరం నాటకరంగంలో నిష్ణాతులైన ఒకరిని సమన్వయకర్తగా ఎంచుకొని, ప్రముఖుల మాటగా వారి మనోగత సారాన్ని ఆ సంవత్సరపు సందేశంగా రంగస్థల ప్రపంచానికి అందిస్తారు. 1962లో మొదటి ప్రపంచ రంగస్థల దినోత్సవ సందేశాన్ని జీన్ కాక్టే (ఫ్రాన్స్) అందించాడు.

### లక్ష్యాలు

ప్రపంచవ్యాప్తంగా అనేక రూపాలలో నాటకాన్ని ప్రోత్సహించడం. ప్రజలకు నాటకం యొక్క ప్రాముఖ్యతపై అవగాహన కలిపించడం. విస్తృత స్థాయిలో నాటక సంస్థలకు ప్రోత్సహించడంలో ప్రభుత్వాలు, ప్రజా ప్రతినిధులకు అవగాహన కలిపించి వారి ద్వారా నాటకరంగాన్ని అభివృద్ధి చేయడం.

మానసిక ఉల్లాసంకోసం నాటకాన్ని ఆస్వాదింపజేయడం. నాటకం ద్వారా పొందుతున్న మానసిక ఉల్లాసాన్ని ఇతరులతో పంచుకోవడం.

– దక్కన్‌న్యూస్
m : 9030 6262 88
e: desk.deccan@gmail.com

# మనిషి మెదడులో చిప్... @ న్యూరాలింక్ టెక్నాలజీ!!!

చందమామ కథలో చదివా... రెక్కల గుర్రాలుంటాయని, నమ్మడానికి ఎంత బాగుందో...!! బాల మిత్ర కథలో చదివా... పగడపు దీవులు ఉంటాయని నమ్మడానికి ఎంత బాగుందో..!! అంటూ ఓ సినీ గేయ రచయిత, ఓ తెలుగు సినిమాలో, ప్రేమికులైన నాయక, నాయికలను కాసేపు ఊహలలోకంలో విహరింపజేస్తారు.


మనం కూడా రాత్రి నిద్రపోయే టప్పుడు ఎన్నో మధురమైన కలలు కంటూ ఊహల్లో తేలుతూ ఉంటాం. కళ్ళు తెరిస్తే అవేవి మనకు కనిపించవు. కానీ కంప్యూటర్ డేటా తరహాలో అలాంటి మధురమైన కలలకు సంబంధించిన జ్ఞాపకాలను మనం డౌన్‌లోడ్ చేసుకొని భద్రపరచు కోగలిగితే, అవసరమైనపుడు వాటిని "రీప్లే" చేసుకోగలిగితే, మనసులో అనుకున్న వెంటనే హైదరాబాద్ బిర్యానీ వచ్చి, మన ఇంటి ముంగిట వాలితే, మనం జపాన్ వెళ్ళినపుడు, జపనీస్ భాష మనకు మాట్లాడడం రాదు, అయితే జపనీస్ భాషను మన మెదడులోకి డౌన్‌లోడ్ చేసుకొని, జపనీస్ భాషను మనం అవలీలగా మాట్లాడితే... ఇవన్నీ చూడడానికి వింతగా, విడ్డూరంగా కనిపిస్తున్నప్పటికీ, తను ప్రతిపాదించిన న్యూరాలింక్ టెక్నాలజీ ద్వారా సాకారం కావడానికి మరెంతో కాలం పట్టదనీ ప్రముఖ వ్యాపార దిగ్గజం ఎలన్‌మస్క్ ఘంటాపథంగా చెబుతున్నారు. దీనికోసం తాము మనిషి మెదడులో చిప్‌ను విజయవంతగా అమర్చామని, ఆ మనిషి సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకుంటున్నాడని ఇటీవల ట్వీట్ చేశారు. ఈ నేపథ్యంలో న్యూరాలింక్ టెక్నాలజీ గురించి మనమూ తెలుసుకుందామా!!



న్యూరాలింక్ టెక్నాలజీకి ఆద్యుడు ఎలన్‌మస్క్

### అసలు న్యూరాలింక్ అంటే!!

న్యూరాలింక్‌లో న్యూరా అంటే నాడులు, లింక్ అంటే అనుసంధానం, న్యూరాలింక్ అంటే నాడుల అనుసంధానం అని చెప్పవచ్చు. న్యూరాలింక్ అనునది ఒక అంకుర సంస్థ (Startup). దీనిని ఎలన్‌మస్క్ 2017లో ఏర్పాటు చేశారు. ఈ సంస్థ మానవ మెదడుని, కంప్యూటర్‌తో అనుసంధానం చేసే ఒక సరికొత్త సాంకేతిక పరిజ్ఞానాన్ని అభివృద్ధి చేసింది. దీనినే బ్రెయిన్ మిషన్ ఇంటర్ ఫేస్ (బీఎంఐ) అని పిలుస్తారు. వ్యవహారికంగా న్యూరాలింక్ టెక్నాలజీ అంటారు. బీఎంఐ సాంకేతిక పరిజ్ఞానం ద్వారా మానవ శరీరంలో అత్యంత సంక్లిష్ట అవయవమైన మెదడులో, వైర్‌లెస్ బ్రెయిన్ కంప్యూటర్ ఇంటర్ ఫేస్‌ను ఏర్పాటు చేయడం న్యూరాలింక్ ప్రాజెక్ట్ ముఖ్య ఉద్దేశ్యం. బీఎంఐ సాంకేతికత ద్వారా ఫోన్ లాంటి ఎటువంటి పరికరం లేకుండా, కేవలం మన ఆలోచనలతో ప్రపంచంలో ఎక్కడో ఉన్న వేరొక మనిషితో డైరెక్ట్‌గా సమాచారం ఇచ్చిపుచుకునేలా అనుసంధానం కావడాన్ని **టెలీపతి** అని పిలుస్తారు. ఈ టెలీపతిని సాకారం చేయడం న్యూరాలింక్ ప్రధానలక్ష్యం. మానవ మెదడులో అమర్చే చిప్‌ను **టెలీపతి చిప్** అని అంటారు. అందుకే ఈ ప్రక్రియనంతటినీ న్యూరాలింక్ టెలీపతి అని వ్యవహరిస్తారు.




### మెదడులో చిప్ ఎలా అమరుస్తారు

మనావ మెదడులో అమర్చడానికి 8 మిల్లీమీటర్ల వ్యాసం కలిగిన 'ఎన్'1 అనే ఇంప్లాంట్‌ను ఎంపిక చేసుకుంటారు. ఎన్1 ఇంప్లాంట్ ఒక నాణెం పరిమాణంలో ఉంటుంది. దానిలో ఒక చిప్, ఒక బ్యాటరీ, చిప్‌కు అనుసంధానంగా 1024 ఎలక్ట్రోడ్లను కలిగిన, 64 అత్యంత సన్నటి పోచల్లాంటి నిర్మాణాలుంటాయి. వెంట్రుకతో పోలిస్తే, ఈ పోచల మందం 20వ వంతు మాత్రమే ఉంటుంది. ఈ చిప్ చెవిపై ఉండే ఒక సాధనంతో వైర్‌లెస్

పద్ధతిలో అనుసంధానమై ఉంటుంది. అది బ్లూటూత్ సహాయంతో సమీపంలోని స్మార్ట్‌ఫోన్‌తో అనుసంధానం కాగలదు. చిప్‌కు ఉండే పోచలు ఎంత పలుచగా ఉంటే అంత సులువుగా మెదడులోని రక్తనాళాలకు ఎలాంటి హాని కలగకుండా చిప్‌ను మెదడులో అమర్చవచ్చు. చిప్‌ను అమర్చేటప్పుడు ఏ మాత్రం పొరపాటు జరిగినా, దాని వల్ల మెదడులోని రక్తనాళాలకు చిన్న పాటి గాయమైనా, అది బ్రెయిన్ స్ట్రోక్‌కు దారితీసి, వ్యక్తి కోమాలోకి వెళ్ళే ప్రమాదం ఉంది. ఇలాంటి సంక్లిష్టమైన ప్రక్రియను, అత్యంత ఖచ్చితత్వంతో నిర్వహించడం మానవ మాత్రులకు సాధ్యం కాదు. అందుకే న్యూరాలింక్ కంపెనీ ఈ ప్రక్రియనంతా సక్రమంగా నిర్వహించడం కోసం 'ఆర్'1 అనే ఆటోమేటిక్ రోబోట్‌ను తయారు చేసింది. ఇది 8 అడుగుల ఎత్తు ఉంటుంది. ఈ రోబో తలలో పెద్ద గాయం లేకుండా కేవలం 8 మిల్లీమీటర్ల పరిమాణం (1 సె.మీ. కన్నా తక్కువ)తో ఒక చిన్న రంధ్రం చేసి పుర్రెకు, మెదడుకు మధ్య ఈ ఎన్1 ఇంప్లాంట్‌ను అమరుస్తుంది. ఈ ఇంప్లాంట్ నందలి చిప్‌కు ఉండే ఎలక్ట్రోడ్లను కలిగిన సన్నటి పోచల్లాంటి నిర్మాణాలను మెదడులోనికి చొప్పిస్తారు. వీటిని మెదడులోని ముఖ్యమైన భాగాలకు చేరువగా ప్రవేశపెడతారు. ముందే చెప్పుకున్నట్లు అవి సుతిమెత్తగా, ఎటువడితే అటు వంగేలా ఉంటాయి. అందువల్ల సమీప కణజాలానికి ఎలాంటి నష్టం ఉండదు. ఈ చిప్‌లోని బ్యాటరీ వైర్‌లెస్ పద్ధతిలో చార్జింగ్ అవుతుంది. అందువల్ల దీన్ని ధరించిన వారు సాధారణంగానే కనిపిస్తారు. అంతేకాకుండా ఈ ప్రక్రియ అంతా రివర్సబుల్. అంటే ఈ చిప్ వద్దనుకుంటే, ఎప్పుడైనా తొలగించు కోవచ్చు. ఈ పరికరాన్ని మెదడుకు దూరంగా పెడితే సంకేతాలను ఖచ్చి తత్వంతో గుర్తించడం సాధ్యం కాదు. అందువల్లే పుర్రెలో అమర్చుతారు. అంతేగాకుండా కొన్ని సం॥రాల తరువాత ఈ చిప్‌లో అప్డేట్స్ వస్తే, తదనుగుణంగా వాటిని అప్డేట్ చేసు కోవచ్చు.



ఎన్1 ఇంప్లాంట్



మానవ మెదడులో ఎన్1 ఇంప్లాంట్‌ను ఇలా అమరుస్తారు

### ఎలా పని చేస్తుంది

మన బ్రెయిన్లో కోట్ల సంఖ్యలో న్యూరాన్లు (నాడీకణాలు) ఉంటాయి. మనం చూడాలన్నా, మాట్లాడాలన్నా, కదలాలన్నా, ఇలా ఏ పని చేయాలన్నా మన మెదడులో ఎలక్ట్రిక్ సిగ్నల్స్ అనేవి ఒక న్యూరాన్ నుండి మరొక న్యూరాన్‌కు నిరంతరం ప్రసారమవుతూ ఉంటాయి. ఇలా న్యూరాన్ల మధ్య ఎలక్ట్రిక్ సంకేతాలు ఏర్పడినప్పుడు అక్కడ స్వల్పస్థాయిలో ఎలక్ట్రో మ్యాగ్నటిక్ ఫీల్డ్ (విద్యుదయస్కాంత క్షేత్రం) ఏర్పడుతుంది. ఈ సమయంలో మెదడులో అమర్చిన చిప్ యొక్క ఎలక్ట్రోడ్లు, ఈ విద్యుదయస్కాంత క్షేత్రం ఆధారంగా ఈ ఎలక్ట్రిక్ సిగ్నల్స్‌ని స్వీకరించి, చిప్‌కి పంపిస్తే, ఆ చిప్ వాటిని 0,1 లుగా కంప్యూటర్లు అర్థం చేసుకొనే బైనరీ కోడ్‌లోకి మారుస్తుంది. అలాగే బయటి నుండి మనం ఏదైనా సమాచారాన్ని అందిస్తే దానిని బైనరీ కోడ్ నుండి ఎలక్ట్రిక్ సిగ్నల్స్ రూపంలోకి మార్చి, బ్రెయిన్‌లోని న్యూరాన్లకు అందిస్తుంది. ఇలా ఈ సమాచారమంతా బ్లూటూత్ ద్వారా అందజేయబడుతుంది. ఎందుకంటే మెదడులోని చిప్‌కి ఎలాంటి వైర్లు ఉండవు. ఒకవేళ ఏవైనా వైర్లు ఉంటే, ఆ వైర్ల యొక్క రంధ్రాల గుండా బ్యాక్టీరియా మెదడులోకి ప్రవేశించి, బ్రెయిన్‌కి ఇన్‌ఫెక్షన్ సోకే ప్రమాదం ఉంది. అలాగే ఛార్జింగ్ కూడా వైర్‌లెస్ మాగ్నటిక్ ఇండక్షన్ ద్వారా వైర్‌లెస్ విధానంలో అవుతుంది.

### స్వల్పకాలిక, దీర్ఘకాలిక లక్ష్యాలు

మానవ మెదడు చాలకవిధులు (Motor Functions), మరియు గ్రాహక విధులు (Sensors Functions) అన్న రెండు రకాల విధులను నిర్వహిస్తుంది. నడవడం, మాట్లాడడం, తినడం లాంటివి చాలక విధులు కాగా, రుచి (Taste), వాసన (Smell), స్పర్శ (Touch) లాంటి వాటిని గ్రాహక విధులు అంటారు. ప్రస్తుతం న్యూరాలింక్ టెక్నాలజీ ద్వారా అభివృద్ధి పరిచిన సాంకేతికత మెదడు యొక్క చాలక విధుల (Motor Functions)ను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు తోడ్పడుతుంది.

న్యూరాలింక్ సాంకేతికత స్వల్ప కాలిక లక్ష్యం, వివిధ కారణాల వల్ల అవయవాలు కోల్పోయిన వారి యొక్క అవయవాలు సవ్యంగా పనిచేసేందుకు వినియోగించడమని, కాగా సాధారణ మనిషిని, సూపర్ హ్యూమన్‌గా తీర్చి దిద్దడం న్యూరాలింక్ టెక్నాలజీ దీర్ఘకాలిక లక్ష్యమని ఎలన్ మస్క్ తెలిపారు.

**ప్రయోజనాలు:**


**నాడీ సమస్యలకు శాశ్వత పరిష్కారం**

నాడీ సమస్యలు, వెన్నుపూసకు గాయాలు, పక్షవాతం వంటివాటివల్ల కాళ్ళు,చేతులు పూర్తిగా లేదా పాక్షికంగా చచ్చుబడ్డ రోగుల్లో స్పర్శ, కదలికలను మెరుగుపరిచే వీలుంది. వీరు సులువుగా ఉపకర ణాలను ఉపయోగించ గలుగుతారు. దీర్ఘకాలంలో వీరి అవయ వాలను పూర్తిస్థాయిలో పునరుద్ధరించగలిగే వీలుంది.



ఆర్1 రోబోట్

ఉదా॥కు మోటార్ న్యూరాన్ డిసీజ్ కారణంగా వీల్‌ఛైర్‌కే పరిమితమై, ఇటీవల మరణించిన ప్రపంచ ప్రఖ్యాత భౌతికశాస్త్రవేత్త, కాస్మాలజిస్ట్ స్టీఫెన్‌హాకింగ్, కండరాల కదలికలు సరిగాలేక శరీరమంతా చచ్చుబడిపోయినా, వీల్‌ఛైర్‌లో కూర్చుని తన బుగ్గ కండరాన్ని కదలించడం ద్వారా, ఎన్నో అద్భుతమైన, ప్రతి పాదనలను, సిద్ధాంతాలను ప్రపంచానికి అందించారు. కానీ అది చాలా క్లిష్టమైన ప్రక్రియ. ఆయన వీల్‌ఛైర్‌కి అమర్చిన కంప్యూటర్ తెరపై పదాలు వరుసగా వెళ్తుంటే, తాను అనుకున్న పదం వచ్చినపుడు బుగ్గ కండరాన్ని కదల్చడం ద్వారా తాను చెప్పాలనుకున్న విషయాన్ని ఆయన చెప్పేవారు.



ఆర్1 రోబోట్‌తో తలలో ఇలా రంధ్రం చేసి అమరుస్తారు

అంత కష్టం లేకుండా న్యూరాలింక్ సాంకేతికత ద్వారా ఆయన మెదడులో ఒక ఇంప్లాంట్‌ను అమర్చి, అది వైర్‌లెస్‌గా ఏ కంప్యూటర్‌కో, ఫోన్‌కో అనుసంధానమై పోయి, ఆయన మెదడులో వచ్చిన ఆలోచనలను అక్షరరూపంలోకి మార్చవచ్చు.

**మానసిక వ్యాధుల నియంత్రణ**

పార్కిన్‌సన్స్, డిమెన్షియా, అల్జీమర్స్ లాంటి మానసిక వ్యాధుల చికిత్స కోసం ఈ సాంకేతికతను వినియోగించవచ్చు.

**ఆలోచనాశక్తితో వస్తువుల నియంత్రణ**

ఆలోచనశక్తి సహాయంతో టెక్స్ట్ లేదా స్వర సందేశాలతో కమ్యూనికేషన్ సాగించడానికి, బొమ్మలు గీయడానికి ఈ సాంకేతికత ఉపయోగపడుతుంది.

**జ్ఞాపకశక్తిని స్థిరంగా ఉంచడం**

కొత్త సమాచారాన్ని నేర్చుకునే మరియు గుర్తుంచుకొనే సామర్థ్యాన్ని మెరుగుపరచవచ్చు. క్లౌడ్ సర్వర్‌లో నిల్వచేయబడిన ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ సిస్టమ్‌లోకి వారి జ్ఞాపకాలను అప్‌లోడ్ చేయడానికి వారిని అనుమతించడం ద్వారా వయసుపెరిగినప్పటికీ జ్ఞాపకశక్తిని కోల్పోయే అవకాశం ఉండదు.

**హార్మోన్ల నియంత్రణ**

ఈ చిప్ సాయంతో హార్మోన్ స్థాయిని కూడా నియంత్రించొచ్చు. కుంగుబాటును దూరం చేసుకోవచ్చు.

**నైపుణ్యాల మెరుగుదల**

అవసరమైన నైపుణ్యాలను మెదడులోకి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. కంటిచూపును, వినికిడి పరిధిని పెంచుకోవచ్చు.

**టెలీపతి:** ముందే చెప్పుకున్నట్లు మన ఆలోచనలతో, ప్రపంచంలో ఎక్కడో ఉన్న వేరొక మనిషితో నేరుగా సమాచారం ఇచ్చిపుచుకునేలా అనుసంధానం కావడాన్ని టెలీపతి అంటారు. న్యూరాలింక్ సాంకేతికతతో టెలీపతి సౌకర్యం సాకారమయ్యే అవకశం ఉంది.

**సూపర్ హ్యూమన్ కాగ్నిషన్**

ఎలన్‌మస్క్‌కు కృత్రిమ మేధ (ఏఐ)పై తీవ్ర వ్యతిరేకత ఉంది. అది మానవుడి కన్నా తెలివైందని, భవిష్యత్‌లో మానవాళిపై పై చేయి సాధిస్తుందని తరచూ చెబుతున్నారు. ఈ ఏఐని అధిగమించడానికి మానవునికి ప్రస్తుతమున్న సామర్థ్యాలు సరిపోవని మనిషి సూపర్ హ్యూమన్‌గా మారాలని మస్క్ చెబుతున్నారు.

కాబట్టి సుదీర్ఘ భవిష్యత్‌లో న్యూరాలింక్ సాంకేతికత ద్వారా మానవాతీత విషయ గ్రహణ సామర్థ్యం (సూపర్ హ్యూమన్ కాగ్నిషన్) సాధించవచ్చు. కృత్రిమ మేధపై పోరాటానికి ఈ సామర్థ్యం చాలా అవసరం. మానవుడు సూపర్ హ్యూమన్‌గా మారితే 'ఏ ఐ'తో సురక్షిత సహజీవనం కూడా చేయవచ్చు.

**సవాళ్ళు :**

**గోప్యతకు చిక్కులు**

మన మెదడు ఇంటర్నెట్‌తో కనెక్ట్ అయి ఉంటుంది. మన ఆలోచనలకీ, మన మెదడులో నిక్షిప్తమై ఉన్న సమాచారానికి ప్రైవసీ అవసరం. ఎవరైనా మన బ్రెయిన్‌కి కనెక్ట్ అయి ఉన్న చిప్‌ని హ్యాక్ చేసి మన అకౌంట్స్ సంబంధించిన పాస్‌వర్డ్స్ వంటి డేటాను తస్కరించడం లేదా తొలగించే ప్రమాదం ఉంది.

**వాణిజ్య రంగంలో గుత్తాధిపత్యం**

వాణిజ్య కంపెనీలు ప్రకటనల ద్వారా మన మెదడులోని చిప్‌లను నియంత్రణలోకి తెచ్చుకొని ఆయా కంపెనీల బ్రాండ్లను చూసిన వెంటనే, మెదడులో డోపమైన్ విడుదల చేయించడం ద్వారా, ఆ బ్రాండ్లపైన సానుకూల భావాన్ని కలిగించి తమ ప్రొడక్ట్‌లను మాత్రమే కొనేలా చేసి వాణిజ్య రంగంలో ఏక ఛత్రాధిపత్యం సాధించే

అవకాశం ఉంది. అంటే వాణిజ్య ప్రకటనలు ప్రస్తుతం పెద్ద పెద్ద హోర్డింగులు, వెబ్‌సైట్స్, టీవీల్లో కనిపిస్తున్నాయి. రాబోయే రోజుల్లో ఇవి మన ఆలోచనల మధ్య కూడా వచ్చే అవకాశం ఉంది.

**భద్రత మరియు విశ్వసనీయత**

న్యూరాలింక్ సాంకేతికత విరివిగా మానవాళికి అందుబాటులోకి వచ్చే ముందుగా మన మెదడులోని ఆలోచనలకు సంబంధించిన సమాచారం తస్కరించబడకుండా చూడాలి. అప్పుడే ఆ సమాచారానికి విశ్వసనీయత ఉంటుంది. ఇందుకొరకు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు ఉండాలి.



న్యూరా లింక్ టెక్నాలజీతో ఇలా అవయవ లోపం గల వారి అవయవాలు సక్రమంగా పనిచేయించవచ్చు




మనిషి మెదడులో అమర్చిన చిప్ ఇలా హ్యాకింగ్‌కు అయ్యే అవకాశం ఉంది

**బగ్స్‌తో ప్రమాదం**

సమీప భవిష్యత్‌లో మానవ మెదడులో అమర్చిన చిప్‌లో కూడా అప్‌డేట్లు వస్తాయని, తద్వారా కాలానుగుణంగా ఆ చిప్‌ను అప్‌డేట్ చేసుకోవచ్చని సాంకేతిక నిపుణులు చెబుతున్నారు. అయితే ఆ అప్‌డేట్లలో బగ్స్ ఉంటే ఎదురయ్యే విపరిణామాలను ఎలా ఎదుర్కోవాలన్న ప్రశ్నకు ఎవరిదగ్గరా సమాధానం లేదు. దీనికి పరిష్కారం కనుగొనాల్సిన అవసరం ఉంది.

**సామాజిక అసమానతలు**

బాగాడబ్బున్న వాళ్ళు ఇప్పుడు ఖరీదైన ఫోన్‌లు కొనుక్కున్నట్లే భవిష్యత్‌లో తమ బ్రెయిన్ ఇంప్లాంట్లకు, అత్యంత ఖరీదైన అప్‌గ్రేడ్‌లు చేయించుకొని తెలివితేటలు పెంచేసుకుంటే బాగా తెలివైన వాళ్ళు, తెలివితక్కువగా ఉన్నవారు అనే వర్గాలుగా విడిపోయి మానవాళి మధ్య సామాజిక అసమానతలు తలెత్తుతాయన్న ఆందోళనలో అతిశయోక్తిలేదు.

**ఖరీదైనది**

న్యూరాలింక్ సాంకేతికతలో వినియోగించే చిప్‌లు అత్యంత అధునాతనమైనవి. కాబట్టి వాటిధర సామాన్యులకు అందనంత ఎక్కువగా ఉంటుందన్న వాదన ఉంది.

**వ్యసనం, ఆందోళన, నిరాశ వంటి ప్రతికూల పరిణామాలకు అవకాశం**

న్యూరాలింక్ టెక్నాలజీ ద్వారా మానవులు సూపర్ హ్యూమన్ సామర్థ్యాలను పొందితే, వారు దానికి బానిసలౌతారు. తద్వారా వారు నిజ జీవిత అనుభవాలపై ఆసక్తిని కోల్పోతారు. తద్వారా వారిలో ఆందోళన, నిరాశలు పెరిగే అవకాశం ఉంది.

**మరిన్ని పరిశోధనలు అవసరం :**

న్యూరాలింక్ సాంకేతికత మానవాళిపై కలిగించే సానుకూల మరియు ప్రతికూల ప్రభావాలపై మరిన్ని పరిశోధనలు జరగాల్సిన అవసరం ఉందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

**ఇదే మొదటిది కాదు**

మానవ మెదడులో చిప్‌ను అమర్చే సాంకేతికతలో న్యూరాలింక్ మాత్రమే మొదటికాదు. బ్లాక్‌రాక్ న్యూరోటెక్ అనే సంస్థ రెండు దశాబ్దాల క్రితమే 'యూటాయారే' అనే పేరుతో ఒక ఇంప్లాంట్‌ను అభివృద్ధి చేసింది. సింక్రాన్ అనే మరో సంస్థ కూడా ఇలా బ్రెయిన్ ఇంప్లాంట్లను మనుషులకు అమర్చింది. స్విట్జర్లాండ్ చెందిన ఈపీఎఫ్ఎల్ (ఎకోల్ పాలిటెక్నిక్ ఫెడరల్ ఇన్ లాసాన్) గత ఏడాది మే నెలలో గెర్ట్ జాన్ ఆస్కామ్ అనే ఒక పక్షవాత బాధితుడి మెదడులో ఇంప్లాంట్‌ను అమర్చి, అతడు నడవగలిగేలా చేసింది. కాకపోతే సాధారణ ఆరోగ్యవంతుల్లాగా నడవలేకపోయినా, అప్పుడే బుడిబుడి అడుగులు వేస్తున్న చిన్న పిల్లల్లా నడవగలుగుతున్నాడు. ప్రపంచవ్యాప్తంగా కనీసం 42 మంది తమ మెదళ్లలో ఇలాంటి ఇంప్లాంట్లను కలిగి ఉన్నారని వాషింగ్టన్ పోస్ట్ వార్తా సంస్థ తెలిపింది. అయితే పైన తెలిపిన సాంకేతికతల కన్నా న్యూరాలింక్ సాంకేతికత సరళమైనది, సురక్షితమైనది, ప్రభావవంతమైనదని నిపుణులు వ్యాఖ్యానిస్తున్నారు.

**చివరగా**

సాంకేతిక రంగంలో దినదిన ప్రవర్ధమానమై వర్ధిల్లుతున్న ఈ ప్రగతిశీల పయనంలో ప్రతి సాంకేతికత వల్ల అపార ప్రయోజనాలతో పాటు, అపాయకర ప్రతికూలతలు కూడా ఉంటాయన్నది వాస్తవం. న్యూరాలిక్ సాంకేతికత కూడా ఇందుకు మినహాయింపు కాదు. కాబట్టి న్యూరాలింక్ సాంకేతికత వల్ల కలిగే ప్రయోజనాలతో పాటు, ప్రతికూలతలను కూడా గుర్తెరిగి, వాటిని పరిష్కరించే దిశగా మరిన్ని పరిశోధనలు జరగాలి. తద్వారా ఈ సాంకేతికత ద్వారా మానవాళికి మహోపకారం జరగాలని ఆశిద్దాం.

-పుట్టా పెద్ద ఓబులేసు,
స్కూల్ అసిస్టెంట్, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల
రావులకొలను, సింహాద్రిపురం, కడప
m : 9550290047
e : obu.jmd@gmail.com

ద





## ప్రొఫెసర్ ఘంటా చక్రపాణి గారి

# పదవీ ఉద్యోగ విరమణ-ఆత్మీయ అభినందన సభ

ప్రొఫెసర్ ఘంటా చక్రపాణి గారి పదవీ ఉద్యోగ విరమణ ఆత్మీయ అభినందన సభ జనవరి 31 కనీ వినీ ఎరుగని రీతిలో డాక్టర్ బిఆర్. అంబేద్కర్ విశ్వవిద్యాలయం ఆడిటోరియంలో ఘనంగా జరిగింది. 1994లో డా. బి.ఆర్. అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ సోషియాలజీ విభాగంలో సహాయ ఆచార్యుడిగా చేరి అంచెలంచెలుగా ఎదిగి డైరెక్టర్ అయ్యారు. 1997 నుంచి 2014 వరకు తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో భాగ మయ్యారు. వారు సీనియర్ ప్రొఫెసర్ హోదాలో పదవీ విరమణ పొందారు. ఆచార్యులు, వర్సిటీ సిబ్బంది ఘనంగా వీడ్కోలు పలికారు.



సభకు విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షుడు ప్రొఫెసర్ కె.సీతారామారావు గారు అధ్యక్షత వహించారు. విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఏ.వి.ఎన్.రెడ్డి, విశ్వవిద్యాలయం అధ్యాపకులు, మాజీ అధ్యాపకులు, బోధన, బోధనేతర పాలన, పాలనేతర సిబ్బంది, విశ్వవిద్యాలయంలోని అన్ని విభాగాల, అన్ని తరగతుల ఉద్యోగులు- వారి సంఘాలు, విద్యార్థులు, పరిశోధక విద్యార్థులు ఆయనను పుష్పగుచ్ఛాలు, పూలదండలు, పట్టు శాలువాలతో, బహుమానాలతో ఘనంగా సత్కరించారు.

తెలంగాణ రాష్ట్ర శాసన పరిషత్తు వైస్ చైర్మన్ బండ ప్రకాష్, ప్రొఫెసర్ జి. హరగోపాల్, ప్రొఫెసర్ గట్టు సత్యనారాయణ (గురువు - ఓ.యు), ఆంధ్రజ్యోతి సంపాదకుడు డాక్టర్ కె.శ్రీనివాస్, ప్రొఫెసర్ నాగేశ్వర్, తెలంగాణ ప్రెస్ అకాడమీ మాజీ చైర్మన్ అల్లం నారాయణ, తెలంగాణ సాహిత్య అకాడమీ మాజీ అధ్యక్షుడు డాక్టర్ జూలూరు గౌరీ శంకర్, శ్రీ జ్వాలా నరసింహారావు, ప్రొఫెసర్ దామోదరం (మాజీ వీసీ ఎస్వి. యూనివర్సిటీ), ప్రొఫెసర్ సూర్యనారాయణ రెడ్డి (గురువు), దక్కన్ అకాడమీ చైర్మన్ మణికొండ వేదకుమార్, డా. రామమోహన్ రెడ్డి (మాజీ మెంబర్ టీఎస్‌పిఎస్సీ), ప్రొఫెసర్ రాజశేఖర్ (హెచ్‌సియు, హైదరాబాద్), ప్రొఫెసర్ వేణుగోపాల్‌రెడ్డి, రాష్ట్రంలోని వివిధ విశ్వ విద్యాలయాల అధ్యాపకులు - ఇంకా అనేకమంది ప్రముఖ మేధావులు, కవులు, రచయితలు, పాత్రికేయులు, పుర ప్రముఖులు హాజరై చక్రపాణి గారికి పదవీ విరమణ సందర్భంగా అభినందనలు, శుభాకాంక్షలు తెలియజేశారు. ఆయన మిత్రులు, ఆత్మీయులు, శ్రేయోభిలాషులు కుటుంబ, సభ్యులందరూ సత్కార సభలో పాల్గొన్నారు.

మధ్యాహ్నం నుంచి రాత్రి 10 గంటల 30 నిమిషాల వరకు దాదాపు 8 గంటలపాటు జరిగిన సభా కార్యక్రమంలో వక్తలు చక్రపాణి గారు విశ్వవిద్యాలయానికి చేసిన సేవలను కొనియాడారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఉద్యమానికి, విశ్వవిద్యాలయం వెలుపల ప్రజా జీవన రంగంలో రాష్ట్రానికి, సాంఘిక, సాహిత్య రంగాలలో చేసిన సేవలను ప్రస్తుతించారు. తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ తొలి చైర్మన్‌గా, నిర్వహించిన విధులను, ఏ సమస్యలు లేకుండా, సాఫీగా నిర్వహించి అందరి మన్ననలు అందుకున్నారని కొనియాడారు. విశ్వవిద్యాలయ వికాసానికి, అభివృద్ధికి వివిధ హోదాలలో బోధన, పరిపాలన రంగాలలో, పాలసీ విధానాలలో చక్రపాణి గారు చేసిన కృషిని ప్రశంసించారు. ప్రొఫెసర్ సీతారామారావు గారు మాట్లాడుతూ విశ్వవిద్యాలయం ఆవిర్భావం నుంచి ఇప్పటివరకు జరిగిన అభివృద్ధి

## పదవీ విరమణ























చరిత్రను గ్రంథస్తం చేసే బాధ్యతను చక్రపాణి గారికి అప్పగిస్తున్నట్లు ప్రకటించారు. ఈ సభ న భూతో నా భవిష్యతి అని అన్నారు. ఇది పదవీ విరమణ మాత్రమే, కానీ విరామం కాదని సమాజానికి, విద్యారంగానికి మరిన్ని సేవలు అందిస్తారని వక్తలు తమ ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. తన రచనల ద్వారా, ప్రసంగాల ద్వారా, పత్రికా రచనల ద్వారా తెలంగాణ సమాజాన్ని జాగృత పరిచారని విశ్లేషించారు. చక్రపాణి గారు తన స్పందన ప్రసంగంలో తాను పల్లెటూరు నుంచి ఇంత దాకా ఎదిగి వచ్చిన జీవన క్రమాన్ని వివరించారు. తన జీవనయానంలో వెన్నుదన్నుగా నిలిచిన తల్లిదండ్రులను, సహనంతో త్యాగనిరతితో ప్రోత్సహించిన,



కుటుంబ బాధ్యతలు మోసిన తన జీవన సహచరి ప్రొఫెసర్ పుష్పా చక్రపాణి గారిని, ఇతర కుటుంబ సభ్యులను చెమ్మగిల్లిన కళ్ళతో కృతజ్ఞతలు సమర్పించుకున్నారు. విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ బషీరుద్దీన్ నుంచి ప్రస్తుత వైస్ ఛాన్సలర్ వరకు, అనేక విషయాల్లో, ప్రత్యక్షంగా పరోక్షంగా తన సలహాలు, సూచనలు తీసుకున్నారని, అందుకు గర్వపడుతున్నానని, తనను వారు ప్రోత్సహించారని తెలియజేశారు. సభ ఆద్యంతమూ ఆసక్తికరంగా కొనసాగింది. సభా కార్యక్రమానికి ముందు సభికులందరికీ పసందైన భోజనం ఏర్పాటు చేశారు.

– కట్టా ప్రభాకర్, m : 8106721111
e: akumarkatta@gmail.com






# మానవ శ్రేయస్సుకు నీటి అవసరం!

ప్రపంచ నీటి దినోత్సవం ఐరాస జరిపే వార్షిక దినోత్సవం. దీన్ని ఏటా మార్చి 22న జరుపుతారు. ఇది మంచినీటి ప్రాముఖ్యతను తెలియజేస్తుంది. మంచినీటి వనరుల స్థిరమైన నిర్వహణ గురించి చెప్పేందుకు ఈ రోజును ఉపయోగిస్తారు. 1992 బ్రెజిల్ లోని రియో డి జనీరోలో పర్యావరణం, అభివృద్ధిపై ఐక్యరాజ్యసమితి ఏర్పాటు చేసిన సమావేశం (UNCED) ఎజెండా 21లో ఈ దినోత్సవాన్ని మొదట ప్రతిపాదించారు. తొలి ప్రపంచ నీటి దినోత్సవం 1993లో జరిగింది.

సామాజిక ఆర్థిక వృద్ధి ఎక్కువగా నీటిపైనే ఆధారపడి ఉంటుంది. త్రాగునీరు మానవ ఆరోగ్యానికి, శ్రేయస్సుకు చాలా అవసరం, పోషకాహారం, గాలి, మానవ జాతికి ప్రాథమిక జీవనోపాధిని అందిస్తుంది, ఇవి లేకుండా మనిషి జీవించడం అసాధ్యం. మంచినీటి విషయానికి వస్తే, గ్రహం మొత్తం వైశాల్యంలో కొద్ది భాగం మాత్రమే మానవ ఉపయోగానికి అనుకూలంగా ఉంటుంది.




అత్యంత విలువైన వనరులలో నీరు ఒకటి. ప్రతిరోజూ, ప్రజలు తాగడానికి, వ్యవసాయం, పరిశ్రమలు, వినోదం, పరిశుభ్రత, పారిశుధ్యం, ఆరోగ్య సంరక్షణ కోసం నీటిని ఉపయోగిస్తారు. నీటి వనరులు అమూల్యమైనవి, పరిమితమైనవి. అధిక ఉష్ణోగ్రతలు, వాతావరణ మార్పిడులు, ఇతర సహజ, మానవ నిర్మిత ఒత్తిళ్లు మన నీటి పరిమాణం, నాణ్యతను ప్రభావితం చేస్తాయి.

సురక్షితమైన నీరు, తగినంత పారిశుధ్యం, పరిశుభ్రత వనరులకు ప్రపంచములో వచ్చే వివిధరకాల అంటువ్యాదుల నుండి కాపాడు కోవడం వల్ల ప్రజలలో అనారోగ్యం, మరణాన్ని తగ్గిస్తుంది. మెరుగైన ఆరోగ్యం, పేదరిక తగ్గింపు, సామాజిక-ఆర్థిక అభివృద్ధికి దారితీస్తుంది. కోవిడ్-19 మహమ్మారి సురక్షితమైన నీటికి సార్వత్రిక ప్రాప్యత తక్షణ అవసరాన్ని ప్రపంచ ప్రజలకు మరింత తెలిపింది. ప్రపంచవ్యాప్తంగా, 2.2 బిలియన్ల మందికి సురక్షితమైన తాగునీరు లేదు. 3.6 బిలియన్ల మందికి సురక్షితమైన పారిశుద్ధ్య సేవలు లేవు. 2.3 బిలియన్ల మందికి సబ్బు నీటితో చేతులు కడుక్కునే సదుపాయం అందుబాటులో లేదు.

టైఫాయిడ్ జ్వరం, కలరా వంటి అనేక డయేరియా వ్యాధులు రావడానికి కలుషిత నీటి పారిశుధ్యం ద్వారా వ్యాపిస్తాయి. యునైటెడ్ స్టేట్స్‌లో తక్కువగా ఉన్నప్పటికీ, టైఫాయిడ్, కలరా వ్యాప్తి ఇతర దేశాలలో సంభవిస్తూనే ఉంది. ఈ వ్యాధులు కలిసి లక్షలాది మందిని అనారోగ్యానికి గురి చేయటం, ఫలితంగా ప్రతి సంవత్సరం 257,400 మంది మరణిస్తున్నారని అంచనా.

అతిసార వ్యాధులను నివారించడానికి నీటి వనరులను రక్షించడం, మానవ వ్యర్థాల నీరు, పర్యావరణం నుండి దూరంగా ఉంచడానికి నూతన వ్యవస్థలను అభివృద్ధి చేయడం, నిర్వహించడం అత్యవసరం. క్రమం తప్పకుండా చేతులు కడుక్కోవడం, సూక్ష్మక్రిములు వ్యాప్తి చెందకుండా నిరోధించడానికి ముఖ్యమైన చర్యలలో ఒకటి. అనేక ఇతర డయేరియా వ్యాధులకు ముఖ్యమైన చికిత్స అయిన నోటి రీహైడ్రేషన్ థెరపీలో సురక్షితమైన నీరు కూడా ఒక ముఖ్యమైన భాగం.

### ఇజ్రాయెల్ నమూనా

నీటి ఎద్దడి సమస్యను పరిష్కరించే దేశాలు ప్రపంచవ్యాప్తంగా చాలా లేవు. అయితే 70 ఏళ్ల క్రితం పుట్టిన ఇజ్రాయెల్ 60 శాతం ఎడారితో ఏర్పడి నీటి వనరుల కొరతతో సతమత మవుతోంది. ఒకప్పుడు సొంత నీటి అవసరాలను తీర్చుకోవడం కష్టంగా ఉన్న ఈ దేశం ఇప్పుడు నీటి నిర్వహణలో విజయవంతమైన ఇజ్రాయెల్‌ని సాధించింది. ఇజ్రాయెల్ లో దాదాపు 80 శాతం మురుగునీటిని రీసైకిల్ చేసి పునర్వినియోగం చేస్తున్నారు. ఇజ్రాయిల్ 60 శాతం ఎడారిగా ఉన్న ప్పటికీ, శాశ్వత నీటి వనరులు లేనప్పటికీ, ఆ దేశం నీటి సంక్షోభాన్ని అధిగమించింది, 150కి పైగా దేశాలు ఇప్పుడు నీటి నిర్వహణ రంగాలలో ఇజ్రాయిల్ ను ఒక నమూనాగా చేసుకొని వారి దేశాలలో నీటి సమస్యనుంచి శాశ్వత విముక్తికి ప్రణాళికలను చేసుకుంటున్నాయి.

### భారతదేశం

భారత ప్రభుత్వం ఆధ్వర్యంలోని జల్ శక్తి మంత్రిత్వ శాఖ 2019లో జల్ శక్తి అభియాన్ ప్రారంభించింది. క్షేత్రస్థాయిలో నీటి సంరక్షణను ప్రోత్సహించడానికి ప్రజల భాగస్వామ్యాన్ని ప్రోత్సహించడానికి, ఉద్దేశించింది. దీనిని 2019 జూలై 1 నుంచి 2019 సెప్టెంబరు 30 వరకు, 2019 అక్టోబరు 1 నుంచి 2019 నవంబరు 30 వరకు రెండు దశల్లో ఈ ప్రాజెక్టును ప్రారంభించారు. నీటి సంరక్షణ, వర్షపునీటి సంరక్షణ నిర్మాణాల నిర్మాణం, నిర్వహణ, వివిధ సంప్రదాయ జలవనరుల చెరువుల పునరుద్ధరణ, బోరుబావుల పునర్వినియోగం, రీచార్జి, వాటర్ షెడ్ అభివృద్ధి, ముమ్మర అడవుల పెంపకంపై ప్రభుత్వం దృష్టి పెట్టింది.

భారతదేశంలో నీటి సంరక్షణ పద్ధతులను అవలంబించకపోతే, రాబోయే కొన్నేళ్లలో బెంగళూరు, ఢిల్లీ, హైదరాబాద్ సహా మరో 20 నగరాల్లో భూగర్భ జలాలు అడుగంటిపోతాయని నీతి ఆయోగ్ నివేదిక తెలిపింది. ఈ విపత్కర పరిస్థితిని నివారించడానికి ఏకైక పరిష్కారం నీటి సంరక్షణ ఉన్న అన్ని పద్ధతులను అవలంభించడం. గృహముల నుంచి అడవుల వరకు నీటి సంరక్షణ చేయడానికి ప్రతి ఒక్కరు వ్యక్తిగత స్థాయిలో కృషి చేయాలి.

- దక్కన్‌న్యూస్
m : 9030 6262 88
e: desk.deccan@gmail.com



*CHANDIGHAR, INDIA, UNESCO INSCRIPTION : 2016, CULTURAL*

# ఆధునికతకు అత్యుత్తమ తోడ్పాటు

# లీ కొర్‌భూసియర్ ఆర్కిటెక్చరల్ వర్క్

**ఉనికి:** చండీగఢ్, భారతదేశం (సీరియల్ ట్రాన్స్ నేషనల్ సైట్)

**ప్రకటన తేదీ:** 2016

**వర్గం:** సాంస్కృతికం (సీరియల్ ట్రాన్స్ నేషనల్ సైట్) (Serial Transmational Site - Cultural)

### అత్యుత్తమ సార్వత్రిక విలువ

లీ కొరిభూసియర్ డిజైన్ చేసిన నిర్మాణాల నుంచి ఎంపిక చేయబడిన, ఈ ట్రాన్స్ నేషనల్ సీరియల్ ప్రాపర్టీ మొత్తం పదిహేడు సైట్‌లతో కూడుకున్నది. గతకాలంలో ఓ సంచలనాన్ని సృష్టించిన కొత్త నిర్మాణ భాష యొక్క వినూత్నతకు నిదర్శనం. చండీగఢ్ లోని క్యాపిటల్ కాంప్లెక్స్ అనేది లా కార్బియుసియర్ ఇతర నిర్మాణాల మాదిరిగానే, సమాజం




అవసరాలకు ప్రతి స్పందించడానికి ఇరవయ్యవ శతాబ్దంలో ఆధునిక ఉద్యమం వర్తింపజేయడానికి ప్రయత్నించిన నిర్మాణ పరిష్కారాలను ప్రతిబింబిస్తుంది.

### ప్రాధాన్యాలు:

(i): గత శతాబ్దానికి చెందిన కొన్ని ప్రాథమిక ఆర్కిటెక్చరల్, సామాజిక సవాళ్లకు అత్యుత్తమ ప్రతిస్పందనను అందిస్తూ, ఈ కట్టడాలు మానవ సృజనాత్మకతకు, మేధస్సుకు పట్టం కట్టే కళాఖండాలు.

(ii): ఈ కట్టడాలు యాభై సంవత్సరాలలో ప్రపంచవ్యాప్తంగా మానవ విలువల యొక్క అపూర్వమైన పరస్పర మార్పిడిని ప్రదర్శిస్తాయి. ఆధునిక వాస్తు శిల్పంలో మూడు ప్రధాన పోకడల పుట్టుకను







కూడా సూచిస్తాయి: ప్యూరిజం, బ్రూటలిజం మరియు స్కల్ప్చరల్ ఆర్కిటెక్చర్

(vi): అవి ఇరవయ్యవ శతాబ్దంలో అత్యుత్తమ సార్వత్రిక ప్రాముఖ్యతను కలిగి ఉన్న ఆధునిక ఉద్యమం ఆలోచనలతో ప్రత్యక్షంగా, భౌతికంగా సంబంధం కలిగి ఉన్నాయి.



1947లో భారతదేశ స్వాతంత్ర్యం, దేశవిభజన తర్వాత లాహోర్‌ను కోల్పోవడం అనేది పంజాబ్ రాజధాని నగరం చండీగఢ్ నిర్మాణం, కాపిటల్ కాంప్లెక్స్ నిర్మాణాన్ని ప్రేరేపించింది. కొత్తగా స్వతంత్రం పొందిన భారతదేశం ప్రజాస్వామ్యాన్ని వేడుక చేసుకోడానికి, ఆధునికత వైపు దాని కవాతుకు ఈ క్యాపిటల్ ఒక ప్రతీకగా భావించబడింది. దేశప్రతిష్ట యొక్క మాన్యుమెంటల్ ప్లేస్ గా క్యాపిటల్ కాంప్లెక్స్ రూపుదిద్దుకుంది.

నార్మా ఈవెన్సన్ పేర్కొన్నట్లుగా, "అప్పటికే ఉన్న శైలికి కట్టుబడి ఉండని మంచి ఆధునిక ఆర్కిటెక్ట్ కోసం అన్వేషణ ప్రారంభమైంది. ప్రాజెక్ట్ ఆవశ్యకత నుండి ఉద్భవించేది, భారతీయ వాతావరణానికి సరిపోయేది, అందుబాటులో ఉన్న వస్తువులతో నిర్మించేది, కొత్త రాజధాని విధులకు సరిపోయే కొత్త భావనను అభివృద్ధి చేయగల సామర్థ్యం కలిగి ఉండే వారికోసం ఆ అన్వేషణ". అమెరికన్ ప్లానర్ ఆల్బర్ట్ మేయర్, పోలిష్ ఆర్కిటెక్ట్ మాథ్యూ నోవికీల బృందంతో ప్రారంభించి, ఈ ప్రయత్నాలు చివరకు విప్లవాత్మక స్విస్-ఫ్రెంచ్ ఆర్కిటెక్ట్ లీ కోర్‌భూసియర్ మరియు అతని ముగ్గురు సహచరుల వద్దకు దారి తీశాయి.










యావత్ నిర్మాణాలకు లా కార్బ్యుసియర్ 'మార్గదర్శకుడి'గా ఉన్నప్పటికీ, నగరానికి ఆయన అందించిన శాశ్వత తోడ్పాటు కాపిటల్ కాంప్లెక్స్. ఇది యావత్ నగరానికి 'తల' లాంటిది. శివాలిక్ పర్వతాల బ్యాక్ డ్రాప్‌లో అనువైన స్థలంలో నెలకొంది. ఇది నాలుగు భవనాలు, ఆరు మాన్యుమెంట్స్ సమ్మిళిత సమూహంగా రూపొందించబడింది. అన్నీ పార్క్ లాంటి వాతావరణంలో ఏర్పాటు చేయబడ్డాయి, ఇంటర్ లాకింగ్ స్క్వేర్‌ల యొక్క అదృశ్య జ్యామితి ద్వారా దృశ్యమానంగా అనుసంధానం చేయబడ్డాయి.



స్వదేశీ నిర్మాణ పద్ధతులు, యాంత్రిక రహిత వ్యవస్థలను ఉపయోగించారు. మూడు భవనాలు, అంటే హైకోర్టు, శాసనసభ, సెక్రటేరియట్ రూపుదిద్దుకున్నాయి. ఈ భవనాలు ప్రజాస్వామ్యం యొక్క ప్రధాన విధులను కలిగి ఉంటాయి- చట్టాలు చేయడం, అమలు చేయడం, న్యాయం అందించడం.

హైకోర్టుతో నిర్మాణం ప్రారంభమైంది. 1955 నాటికి పూర్తి చేయబడింది, ఇది వెంటనే ఆధునిక నిర్మాణ చిహ్నంగా మారింది, దాని అసాధారణ సౌందర్యం, శిల్పకళానైపుణ్యంతో కూడిన పైకప్పులు, భారీ సన్ బ్రేకర్లతో అందరినీ అలరించింది. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న ఆర్కిటెక్ట్‌లు దానిని సందర్శించారు. కాశ్మీర్‌లో ప్రత్యేకంగా వర్క్ షాప్‌లో అల్లిన తొమ్మిది పెద్ద టేప్ స్ట్రైస్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. పూర్తి ఇంటీరియర్‌లకు, వాటి శక్తివంతమైన రంగులకు మానవ ఆసక్తిని జోడించారు. న్యాయాన్ని, స్థానిక ప్రకృతి దృశ్యాలను సూచించే శైలి అనుసరించబడింది.

తొమ్మిది అంతస్తుల సెక్రటేరియట్ అప్పట్లో చండీగఢ్‌లోని ఎత్తైన నిర్మాణం. ఎలివేటర్లు లేకుండానే పైకి వెళ్లడాన్ని సులభతరం చేయడానికి కొట్టొచ్చేలా కనిపించే ర్యాంప్‌ల ఆలోచన అప్పట్లో మార్గదర్శకంగా నిలిచింది. భవనాలను సహజంగా చల్లబరచడానికి విస్తృతంగా షేడెడ్ ఫకేడ్ రూపొందించబడింది. అంతర్గత ప్రదేశాలను అది సహజంగా చల్లబరిచేది. రూఫ్ టాప్ కెఫెటేరియా, టెర్రెన్ గార్డెన్ కార్యాలయ విరామ సమయంలో సిబ్బంది అంతా ఒకరినొకరు కలుసుకునేందుకు వీలు కల్పిస్తాయి.

లెజిస్లేటివ్ అసెంబ్లీ సమూహం అత్యంత విస్తృతమైన నిర్మాణం. తన అద్భుతమైన అవాంట్-గార్డ్ టాప్-లైట్ ఫోరమ్, కొడవలి ఆకారపు పోర్టికో, సన్నని హైపర్ బోలాయిడ్ షెల్, స్తంభాలు లేని వృత్తాకార అసెంబ్లీ హాల్ లాంటి వాటితో సందర్శకులను అలరిస్తుంటుంది. లోపలి ప్రదేశాలలో వెలుగు, రంగు దోబూచు లాడు తుంటాయి. వాటి సమ్మేళనం అద్భుతంగా ఉంటుంది. భారీ ఉన్ని టేప్ స్ట్రైస్ ప్రకాశవంతమైన రంగులు, అలాగే లే కార్బుసియర్ వ్యక్తిగతంగా చిత్రించిన మాన్యుమెంటల్ సెరెమోనియల్ ఎనామెల్ తలుపు, ఇవన్నీ లీ కోర్‌భూసియర్ యొక్క అసమానమైన సృజనాత్మక మేధస్సుకు సాక్ష్యంగా ఉన్నాయి. ఇక నాలుగవ భవనం, గవర్నర్ ప్యాలెస్. తరువాత కాలంలో ఇది మ్యూజియం ఆఫ్ నాలెడ్జ్ గా మారింది. భవనాలు పాదచారుల నడక మార్గాల ద్వారా కూడా అనుసంధానించబడి ఉన్నాయి, వీటిలో



హైకోర్టు, అసెంబ్లీ మధ్య విస్తారమైన మార్గం ఉంది. మరో ఆరు కట్టడాలు కూడా ఇక్కడ ఉన్నాయి.

కట్టడాలు, బయటి శిల్పాలు లీ కోర్‌భూసియర్ డిజైన్ సూత్రాలను వ్యక్తపరుస్తాయి. నూతన గణతంత్ర రా జ్యం ఆత్మగా కూడా ఉ ంటాయి. వీటిలో అత్యంత ప్రసిద్ధమైనది ఓపెన్ హ్యాండ్ కట్టడం. నగరం యొక్క భావ జాలాన్ని ప్రకటించ డానికి "ట్రెంచ్ ఆఫ్ కన్సిడరేషన్"కు పై భాగంలో నిలుస్తుంది: "సృష్టించిన సంపద లను స్వీకరించడానికి తెరువండి... వాటిని దాని ప్రజలకు పంపిణీ చేయడానికి తెరువండి" అనే సందేశాన్ని ఇది అందిస్తుంది. లే కార్బూసియర్ రూపుదిద్దలేక పోయిన మాడ్యులర్ "మాడ్యులర్ మ్యాన్" "మానవ స్థాయికి శ్రావ్యమైన కొలత" అనేది చండీగఢ్ విస్తృత దృశ్య క్రమాన్ని వివరిస్తుంది. అమరవీరుల మెమోరియల్ తో కూడిన శిల్పాలు బ్రిటిష్ సామ్రాజ్యం పతనానికి ప్రతీక, భారతీయ ప్రజల ఆత్మ




పునర్జన్మ. మిగిలినవి మూడు, 24 సోలార్ అవర్స్, టవర్ ఆఫ్ షాడోస్, కోర్స్ ఆఫ్ ది సన్. ఇవన్నీ కలిసి ప్రజల రోజువారీ జీవితంలో సూర్యుని ప్రభావాన్ని, చండీగఢ్ సంక్లిష్ట వాతావరణం అందించిన సవాళ్లను నొక్కి చెబుతాయి.

చండీగఢ్ క్యాపిటల్ కాంప్లెక్స్ పూర్తిగా వాడుకలో ఉన్న హెరిటేజ్ సైట్. ఎంతో మంది ప్రజలకు తన సేవలను అందిస్తోంది. కట్టడాలు, స్మారక చిహ్నాలను ల్యాండ్ స్కేప్ తో వాటి అనుబంధంతో సహా పరిరక్షించాల్సిన అవసరం నెరవేరుస్తూనే, ప్రస్తుతం ఉన్న సౌకర్యాల ఆధునీకరణ కోసం పెరిగిపోతున్న అవసరాలను సమన్వయం చేయడమే ప్రధాన సమస్యగా ఉంటోంది.

– కిరణ్ జోషి

అనువాదం : ఎస్. వంశీ





# బొంతల చెట్లు - నా యాది మనాది

చెట్లు మనుషుల లాంటివే. మనకు ఉన్నట్టే వాటికి కూడా పేర్లు ఉంటాయి. మనకన్నా ముందు నుంచి ఉంటాయి. మన తర్వాత కూడా ఉంటాయి. వాటికీ మనలాగే జనన మరణాలు ఉ ంటాయి. కొన్ని మన కండ్ల ముందే కనుమరుగు అవుతాయి. అవి బతికినన్ని రోజులు మనకు అందించే సేవలు వెలకట్టలేనివి. అవి మనలను అలరిస్తాయి. సేద దీరుస్తాయి. మన ఆటలకు, మన ముచ్చట్లకు వేదికలవుతాయి. మనకు ఎన్నెన్నో అనుభూతులను మిగులుస్తాయి. మన కుటుంబ అస్తిత్వాలలో లేదా మన ఊరి అస్తిత్వాలలో అనివార్యంగా భాగమౌతాయి. నాకు బోధ్ లో చాలా మంది బాల్య స్నేహితులు ఉన్నట్టే నాకు అత్యంత ప్రియమైన చెట్లు కూడా ఉన్నాయి. అవి నా స్నేహితుల లెక్క జీవితంలో నాకు గొప్ప మధురానుభూతులను మిగిల్చినాయి. వాటి గురించి కొన్ని ముచ్చట్లు.



కూలిపోక ముందు మా ఇంటి ముందర హుందాగా నిలబడి ఉన్న యాప చెట్టు

**మా ఇంటి ముందు యాప చెట్టు :**

మా ఇంటి ముందు ఒక యాప చెట్టు ఉండేది. అది ఎప్పటి నుంచి ఉన్నదో కానీ నేను నడక మొదలుపెట్టినప్పటి నుంచి ఆ యాప చెట్టును చూస్తూనే గడిపాను. అది మా ఇంటి అస్తిత్వానికి చిహ్నంగా ఉండేది. మా ఇంటి జాడ చెప్పే వాళ్ళు యాప చెట్టు గుర్తు తప్పక చెపుతారు. అట్లా మా అస్తిత్వంలో విడదీయ లేని భాగం అయిపోయింది. ఒకటిన్నర మీటరు వ్యాసంతో నాలుగైదు మీటర్ల ఎత్తు వరకు బలమైన కాండం ఉండేది. ఆ తర్వాత శాఖోప శాఖలుగా విస్తరించింది. చెట్లు ఎక్కే ఉద్దండ పిండాలకు కూడా దాన్ని ఎక్కడం సాధ్యం కాకపోయేది. ఎన్ని పక్షులకు అది ఆశ్రయం ఇచ్చిందో లెక్క లేదు. మా ఇంటి ముందు మగవాళ్ళు, ఆడవాళ్ళు చెప్పుకునే ముచ్చట్లకు అది మౌన సాక్షిగా ఉండేది. ఎండాకాలం డాబా మీద రాత్రి అదిచ్చే చల్లని గాలి మమ్ములను సుఖ నిద్రలోకి తీసుకుపోయేవి. వానాకాలం వర్షం వచ్చే ముందు వీచే హోరు గాలికి శివమెత్తి ఊగిపోయేది. అప్పుడు అది విరిగి మీద పడతుందేమో అని భయం కలిగేది. అయితే అది దిట్టంగా నిలబడి ఉండేది. పిల్లల ఆటలకు అది నెలవుగా ఉండేది. మా క్రికెట్ ఆటకు దాని కాండమే స్టంపులుగా ఉపయోగపడేది. మా పుస్తకాల చిరుగులను అంటించుకోవడానికి, మా పుస్తకాలకు అట్టలు అతికించుకోవడానికి మాకు అద్భుతమైన బంకను ప్రసాదించేది. ఆ వందేళ్ల పైబడిన చెట్టు, అన్నిటినీ తట్టుకొని నిలబడిన చెట్టు ఒకనాడు.. ఎండాకాలం వీచిన హోరుగాలికి వేళ్ళతో సహా నిలువునా కూలిపోయి మా ఇంటి మీదనే వాలిపోయింది. దాని వేర్లు చెదలు పట్టి బలహీనమై పోయిన కారణంగా నిలువలేక కూలిపోయింది. మా కుటుంబ అస్తిత్వంలో భాగమైన యాప చెట్టు అట్లా ఎక్ దం మాయం అయ్యింది. అది కూలిపోయిన్నాడు నా సన్నిహిత బంధువు పోయినంత విషాదాన్ని అనుభవించాను. ఇప్పుడు అదే జాగాలో మరో యాప చెట్టు.. దాని విత్తనమే కావచ్చు.. ఊపిరి పోసుకున్నది. ఇప్పుడు యుక్త వయస్సులో ఉన్న ఆ పిల్ల యాప చెట్టు మెల్ల మెల్లగా ఆకాశంలోకి విస్తరిస్తున్నది. ఇంటి ముందు ఉన్న యాపచెట్టుకు తోడుగా ఇంటి పెరట్లో నైరుతి మూలలో కూడా ఒక యాప చెట్టు ఉండేది. ఈ రెండు యాప చెట్లు ఏమి ఊసులాడుకునేవో ఏమో కానీ గాలి వీచినప్పుడు మాత్రం వీటి జుగల్ బందీ పిల్లలం మమ్ములను భయపెట్టేవి. నైరుతి దిక్కున ఇంటి కాంపౌండ్ గోడ దీని కారణంగా కూలిపోతున్నదున మా తండ్రి పెరట్లోని యాపచెట్టుని కొట్టి వేయించాడు. ఈ నరికివేత కార్యక్రమాన్ని నేను చూసిన జ్ఞాపకం ఉన్నది. మొదట ఒక్కొక్క కొమ్మను నరుకుతూ తాళ్లతో వాటిని నేలకు రాల్చి చివరకు కాండం నరికి వేశారు. ఇదంతా ఒక నాలుగైదు గంటల పని. చెట్టుని నరికిన వారి ఓర్పు, నేర్పు నన్ను ఆకట్టుకున్నది. అయ్యో చెట్టుని ఎందుకు నరికేస్తున్నారు అని అనిపించినా పెద్దగా బాధపడలేదు. అప్పుడు నాకు 12, 13 ఎండ్లు ఉంటాయేమో. ఇంటి ముందరి చెట్టు కూలిపోయినప్పుడు మాత్రం 50 ఏళ్ల వయసులో వేదన అనుభవించాను.

**మా ఇంటి పెరటి చెట్లు :**

మా ఇంటి పెరట్లో మామిడి చెట్టు తప్ప అన్ని చెట్లు ఉ ండేవి. దానిమ్మ, కల్యమాకు, సీతాఫలం, నిమ్మ, తెల్ల గన్నేరు, బావి పక్కన చామ బొంద, కుంకుడు, జామ, మునగ, మైదాకు చెట్లు, గులాబీ, కనకాంబరం, మల్లే, బంతి, చామంతి తదితర పూల మొక్కలు, బెండ, దొండ, వంకాయ మొక్కలను కూడా శ్రద్ధగా పెంచేది మా అయి. వీటికి నీళ్ళు పోయడంలో అప్పుడప్పుడు నేను కూడా పాలు పంచుకునేది. మా కాక కిషన్ రావు గారి పెరట్లో రేణ(రేగు)వండ్ల చెట్టు ఉండేది. దాని రుచి (తీపి ం వగరు) మొఖాబులా ఎక్కడా కూడా రేగు పండ్లను తినలేదు. అద్భుతమైన రుచి కలిగిన ఆ చెట్టు మాకందరికి ప్రియమైన చెట్టు. సంక్రాంతికు ముందు రోజున భోగినాడు సాయంత్రం మా తలల మీద బుడుబుక్కలుగా (భోగి పండ్లు) మారేవి ఈ చెట్టు రేగు పండ్లే. ఆ చెట్టు కూడా కూలిపోయింది. ఆ చెట్టు సంతానం కూడా లేకుండా పోవడం ఒక విషాదం.

**బుక్కోల్ల యాప చెట్టు :**

మరో యాప చెట్టు .. బుక్కోల్ల యాప చెట్టు. బుక్క గులాలు, కుంకుమ తయారు చేసి ఇంటింటికీ తిరిగి మారకం పద్ధతిలో వాటికి బదులు బియ్యమో, పప్పులో తీసుకుపోయేది బుక్కోల్ల పెద్దవ్వ. మా ఇంటికి కూడా వారానికి ఒకసారి వచ్చి పోయేది. మా ఆయికి మంచి దోస్తు కూడా. బుక్క గులాల్ మారకమే కాదు అక్కడ ఒక పది నిమిషాలు ముచ్చట్ల మారకం కూడా జరిగేది. బుక్కోల్ల యాప చెట్టు బహుజన కులాల వారు నివసించే ఇండ్లకు ఒక కూడలి లాంటి ప్రదేశంలో ఉండేది. ఆ యాప చెట్టు చుట్టూ గద్దె కూడా ఉండేది. వ్యవసాయదారుల సాయంత్రపు ముచ్చట్లకు, యాంగ్రీ యంగ్ మెన్ లకు కూడా వారి ఆలోచనలు పంచుకునే కూడలిగా ఉండేది. మా కుటుంబానికి యాప చెట్టు ఎట్లా అస్తిత్వ ప్రతీక అయ్యిందో అట్లనే ఈ యాప చెట్టు కూడా బుక్కోల్ల కుటుంబానికి అస్తిత్వ ప్రతీక అయ్యింది. 1989 లో చెన్నారెడ్డి ప్రభుత్వం ఏర్పాటు అయిన తర్వాత విప్లవోద్యమ సంఘాలకు కొద్ది కాలం స్వేచ్ఛ లభించింది. ఆ స్వేచ్ఛాకాలంలో బోథ్ ప్రాంతం ఒక అగ్ని పర్వతంలా రగులుతూనే ఉండేది. బోథ్ లో ఈ అగ్ని పర్వతాన్ని రగిలిస్తున్న యాంగ్రీ యంగ్ మెన్ బుక్కోల్ల యాప చెట్టు కూడలిలో భగత్ సింగ్ విగ్రహాన్ని నెలకొల్పడానికి సంకల్పించారు. కూడలి నడిమిట్ల ఉన్న యాప చెట్టును తొలగించక తప్పలేదు. అట్లా బుక్కోల్ల యాప చెట్టు కనుమరుగు అయ్యింది. బుక్కోల్ల పెద్దవ్వ కూచమ్మ యాప చెట్టును కొట్టేవేయద్దని ఎంత విలపించినా భగత్ సింగ్ విగ్రహ స్థాపన కోసం చెట్టును త్యాగం చేయవలసి వచ్చింది. ఇప్పుడు బుక్కోల్ల యాప చెట్టు కూడలి భగత్ సింగ్ చౌరస్తాగా పేరు మార్చుకున్నది. అయితే నా లాంటి పాత తరం వారికి మాత్రం బుక్కోల్ల యాప చెట్టు ఒక పురా జ్ఞాపకంగా మిగిలిపోయింది. వారు ఇప్పటికీ బుక్కోల్ల యాప చెట్టు చౌరస్తా అనే పిలుస్తున్నారని మిత్రుడు రావుల శంకర్ చెప్పాడు.


కూలిపోయిన యాప చెట్టు

**హనుమాండ్ల రావి చెట్టు :**

హనుమాన్ గుడిలో రావి చెట్టును ఎన్నటికీ మరువలేను. గుడి లోపల ఎత్తైన ఈ రావి చెట్టు బజారు వీధిలో మధుకర్ సేటు దుకాణం దాకా కనిపించేది. ప్రతీ శని వారం హనుమాన్ దర్శనానికి వెళ్ళేవాడిని. అది పిల్లల ఆటలకు కూడా కేంద్రంగా ఉండేది. హనుమాన్ విగ్రహం పక్కనే ఈ రావి చెట్టు వెళ్ళూనుకొని ఆకాశంలోకి విస్తరించింది. దాని వేర్లు చుట్టూ పక్కల చాలా దూరం వరకు ఇండ్లలోని బావుల్లోకి కూడా నీటి జాడ వెతుకుకుంటూ చొరబడినాయి. గుడి చుట్టూ ప్రదక్షిణాలు చేసే భక్తులు విగ్రహం వెనుక వైపున చెట్టును కౌగలించుకునేవారు. అట్లా ఎందుకు చేసేవారో అప్పుడు తెలియదు. "శనివారం రోజున రావి చెట్టును కౌగలించుకుంటే మనను అంటిపెట్టుకొని ఉన్న జ్యేష్ఠాదేవి వదిలిపెట్టి పోతుందని, శని మన దరికి రాదని ఒక నమ్మకం" అని ఉపాధ్యాయుడిగా రిటైర్ అయిన తర్వాత పౌరోహిత్యం స్వీకరించి హనుమాన్ గుడి పూజారిగా మారిన నా బాల్యపు దోస్త్ అరవింద్ వివరణ ఇచ్చాడు. పెద్దవారిని అనుకరిస్తూ నా లాంటి పిల్లలు కూడా కౌగలించుకునేవారు. బొంతల ఊరి వయసు ఎంతో హనుమాన్ గుడి రావి చెట్టు వయసు కూడా అంతే ఉంటుందని అరవింద్ అభిప్రాయపడినాడు. ఊరును పొందిచ్చిన నాడే హనుమాన్ గుడి, పక్కనే రావి చెట్టును నాటి ఉంటారు. రావి చెట్టు వయసు సుమారు 200 ఏండ్లకు పైబడే ఉండవచ్చునని ఊహించవచ్చు. హనుమాన్ జయంతి రోజున సుభాష్ రావి చెట్టు ఎక్కు చిటారు కొమ్మన ఎర్ర రంగు జెండా కట్టేవాడు. ఈ ఫీట్ మాలో చాలా ఉత్సుకత కలిగించేది. ఆయన తప్ప ఆ చెట్టు ఎక్కిన వారిని నేను చూడలేదు. ఆయన కూడా హనుమాన్ జయంతి నాడు మాత్రమే ఈ ఫీట్ చేసేవాడు. ఒక రెండు మూడు నెలల వరకు రావి చెట్టు చిటారు కొమ్మ ఎర్ర జెండా రెపరెపలాడుతూ చాలా దూరం వరకు కనిపించేది. ఇది కమ్యూనిస్టుల ఎర్ర జెండా కాదు. హనుమంతుని ఎర్ర జెండా. ఇటీవలి కాలంలో దేవాదాయ ధర్మాదాయ శాఖ వారిచే హనుమాన్ మందిరం పునర్నిర్మాణం జరిగింది. పాత విగ్రహాన్ని మార్చి పంచముఖ హనుమాన్ విగ్రహాన్ని నెలకొల్పినారు. మందిరానికి గోపురం నిర్మించడానికి అడ్డం వస్తున్నదని పురాతన రావి చెట్టును తొలగించినారు. ఇప్పుడీ రావి చెట్టు లేని పంచముఖ హనుమాన్ దేవాలయం ఉన్నప్పటికీ రావి చెట్టు సహిత హనుమాన్ మందిరాన్నే నేను ఊహించుకోగలను. అదే నా హృదయంలో చిత్రితమైంది. అయితే మందిరం ముందు మరొక రావి చెట్టును నాటినారని, అదిప్పుడు ఎదిగి నిలదొక్కుకున్నదని గుడి పూజారి అరవింద్ చెపితే సంతోషించాను.

**బస్టాండ్ జువ్వి చెట్టు :**

బోథ్ బస్టాండ్ లో ఉండే జువ్వి చెట్టు ఒక అద్భుతమైన చెట్టు. పిల్లలకు ఎంతో ఇష్టమైన చెట్టు. పెద్ద చెట్టు అయినా కాండం చిన్నగా వాలు కలిగి ఉండేది. దాని కుడి వైపున ఒక కొమ్మ నేలకు సమాంతరంగా పెరిగి ఉండేది. పిల్లలం ఎటువంటి సహాయం లేకుండానే ఉరుక్కుంటూ వచ్చి చాలా ఎత్తు వరకు చెట్టుని ఎక్కే సౌకర్యం ఉండేది. అట్లా ఈ చెట్టుని ఎన్ని సార్లు ఎక్కి వేలాడుతూ కిందకు దూకామో లెక్క లేదు. కాల క్రమేణా అభివృద్ధికి అడ్డం వచ్చిందని జువ్వి చెట్టును తొలగించారు. ఈ జువ్వి చెట్టు కిందనే 1969 ప్రత్యేక తెలంగాణ ఉద్యమ శిభిరాన్ని ఏర్పాటు చేశారు

బొంతల విద్యార్థులు. ఇప్పుడు ఈ జువ్వి చెట్టు స్థానంలో మడిగెలు వచ్చాయి. దుకాణాలు వెలసినాయి. బస్టాండ్ జువ్వి చెట్టు మాత్రం ఇప్పటికీ కండ్ల ముందర మెదులుతున్నది.

**బస్టాండ్ యాప చెట్టు :**

బస్టాండ్ లో ఒక యాప చెట్టు కూడా ఉంది. దాని చుట్టూ గద్దె. అది ఇప్పుడు కూడా ఉన్నది. కొత్త బస్టాండ్ కట్టక మునుపు బస్సులు గిర్రున యాప చెట్టు గద్దె చుట్టూ తిరిగి యాప చెట్టు నీడలో ఆగేవి. బస్సు గిర్రున తిగినదంటే బోథ్ వచ్చేసినట్టు బస్సులో నిద్ర పోయిన వాళ్ళకు కూడా తెలిసపోయేది. ఇప్పుడీ యాప చెట్టు ఉన్నా జువ్వి చెట్టు లేని బోథ్ బస్టాండ్ ను ఊహించుకోవడం కష్టమే.

**పెద్ద బడి తొవ్వలో ఎలికి చెట్టు :**

బస్టాండ్ నుంచి పెద్ద బడికి, కచేర్లకు పోయే దారి వంపులో, ధన్నూరుకు పోయే కాలిబాట / బండి బాట మొదలౌతుంది. అక్కడ ఒక ఎలికి చెట్టు ఉ ఒడేది. దానికి గుత్తులు గుత్తులుగా ఎలికి కాయలు వచ్చేవి. ఎలికి చెట్టు బడి పిల్లలకు ఎంతో ఇష్టమైన చెట్టు. చెట్టు ఎక్కగలిగె మగ పిల్లలు ఎలికి చెట్టు ఎక్కి కాయలు, పండ్లు తెంపి కిందకు వేస్తే ఎవరికి అందింది వారు తీసుకొని పోయేవారు. అమ్మాయిలు ఈ ఎలికి వండ్ల కోసం మగ పిల్లలను వేడుకునేవారు. చెట్టు ఎక్కిన పిల్లలు అందరికీ న్యాయం చేసేవారు. అవి తిని పండ్లు కోరలు పోయేది. మాగిన ఎలికి పండు మాత్రం కొంచెం తియ్యగా, కొంచెం వగరుగా ఉ ఒడేది.. చింత పండు లాగా. ఈ ఎలికి చెట్టు కూడా వయసు మీద పడి ప్రకృతి ప్రకోపానికి గురి అయి కూలిపోయింది. ఇప్పుడు ఇట్లా ఎలికి చెట్టును యాదికి చేసుకుంటున్నాను.


అంబారావు మర్రి ముందు

**పక్కిరోని చేను సందులో ఎలికి చెట్టు :**

ఇటువంటి ఎలికి చెట్టే పక్కిరోని చేను (ఇప్పుడు మార్కెట్ యార్డు) సందులో కూడా ఉండేది. ఆ చెట్టు మీద దయ్యాలు తిష్ట వేసుకొని ఉన్నాయని ఒక కథనం కూడా ప్రచారంలో ఉండేది. ఆ సందులో నుంచి ఒంటరిగా పోవడానికి పిల్లలు భయపడేది. పక్కిరోని చేనుని మార్కెట్ యార్డ్ కొసం సేకరించిన తర్వాత మార్కెట్ యార్డ్ పక్క నుంచి ఒక సిమెంట్ రోడ్డు వేసింది గ్రామ పంచాయతీ. ఆ రోడ్ కు ఇరువైపులా ఇప్పుడు ఇండ్లు మడిగెలు లేచాయి. ఈ అభివృద్ధిలో భాగంగా ఎలికి చెట్టూ పోయింది.

**అంజుమన్ మర్రి చెట్టు :**

ఊరి పాత బజారు వీధికి ఎడమ వైపున అంజుమన్ (కోపరేటివ్ సొసైటీ) కు ఎదురుగా ఒక పెద్ద ఊడలు వేసిన మర్రి చెట్టు ఉండేది. అది కూడా వందేళ్ల పైబడిన చెట్టే. దాని కింద అంజుమన్ కు వచ్చిన వారు, రేషన్ కోసం వచ్చిన వారు, అంజుమన్ హమాలీలు సేద దీరేవారు. దాని చుట్టూ చిన్నఅ వ్యాపారస్తుల మడిగెలు ఉండేవి. పక్కన డా. దాసరి వెంకన్న గారి క్లినిక్ ఉండేది. మంగళవారం అంగడి రోజున మర్రి చెట్టు ఎందరికో ఆశ్రయం కల్పించేది. ఇప్పుడు ఈ మర్రి చెట్టు లేదు. బహుశా కాల గమనంలో వయసు మీరి పోయి కూలిపోయి ఉంటుంది. లేదా కొట్టేసి ఉంటారు.

**పెద్ద మసీదులో దూది నిమ్మ చెట్టు :**

బొంతల పెద్ద మసీదులో ఉత్తరం వైపు మూలన ఒక దూది నిమ్మ చెట్టు ఉండేది. దూది నిమ్మకాయలు బయటకు కనిపించేవి. మసీదు ముందు నుంచి పోయినప్పుడు నా దృష్టి తప్పక ఆ చెట్టు మీదకు పోయేది. అట్లా చిన్నప్పటి నుంచి పెద్ద మసీదులోని దూది నిమ్మ చెట్టు మనసులో స్థిరపడిపోయింది. దూది నిమ్మ చెట్టు అక్కడ తప్ప బోథ్ లో మరెక్కడా కనిపించలేదు. పెద్ద మసీదు అభివృద్ధిలో భాగంగా దూది నిమ్మ చెట్టును తొలగించినట్టు మిత్రులు చెప్పారు.

**అంబారావు మర్రి :**

ఇది కూడా మా ఇంటి చెట్టు లాంటిదే. కాకపోతే ఊరికి దూరంగా పిప్పల్ దరి ఊరి శివారులో ఉన్న మా పట్టా భూమిలో ఉన్నదీ మర్రి చెట్టు. మా తండ్రి పేరు అంబారావు కనుక అది అంబారావు మర్రిగా పేరు గాంచింది. దాని పక్కనే ఒక వొర్రె కూడా పారుతుంది. వొర్రె ఎప్పుడు ఎండిపోదు. కొద్దో గొప్పో నీళ్ళు పారుతూనే ఉంటాయి. కాబట్టి అంబారావు మర్రి అనేక జీవాలకు, గొర్లు బర్లు కాసే పిల్లలకు దప్పిక తీర్చి సేద దీరే తావుగా మారింది. ఆ దారి వెంట పోతే రైతులు అక్కడ కొద్ది సేపైనా సేద దీరి బీడీ తాగి గాని పోరు. ఆ మర్రికి ఉన్న ఆకర్షణ శక్తి అటువంటిది. ఆ మర్రి మూడు చెట్లుగా కనిపిస్తాయి. మధ్యలో ఉండే పెద్ద చెట్టు రాముడు, ఎడమ వైపున కొంచె చిన్నగా ఉన్న చెట్టు లక్ష్మణుడు, కుడి వైపున ఉన్న ఇంకాస్త చిన్న చెట్టు సీతగా అక్కడి ప్రజలు నోళ్లలో ప్రచారంలో ఉన్న మాట. ఈ రెండు చిన్న చెట్లు మధ్యలో పెద్ద చెట్టు ఊడల నుంచి చెట్లుగా ఎదిగినవే. ఇంకా మరెన్నో ఊడలు నేలకు దిగుతున్నాయి. మేము దోస్తులం పిస్కుళ్లు (లేత జొన్న కంకులు కుంపట్లో కాల్చి వొలిచి తినేవే పిస్కుళ్లు) తినడానికి సెప్టెంబర్ అక్టోబర్ నెలలో వచ్చినప్పుడు ఈ చెట్టు కిందనే మా మకాం. ఆ చెట్లు ఎక్కి దిగుతూ ఎన్నో ఆటలు. ఒర్రెలో తానాలు. ఇట్లా ఒక రోజు పిస్కుళ్ల పిక్నిక్ ఆనందంగా గడిచిపోయేది. ఈ చెట్టు కింద ఒక చేదు అనుభవం కూడా ఉ న్నది. మా ఎద్దుపాలు పాలేరు అడెల్లు చేనులో బోరు బావి కొట్టించాడు. బోరు యంత్రంతో కాకుండా వడ్డెరలతో కొట్టించాడు. పక్కనే ఒర్రె ఉన్నందున 30 అడుగుల లోతులోనే నీళ్ళు పడినాయి.





పాత హనుమాండ్ల గుడిలో రావి చెట్టు, పునర్ నిర్మించిన హనుమాండ్ల గుడి ముందు పెరుగుతున్న రావి చెట్టు



బుక్కోల్ల యాప చెట్టు జాగాలో ప్రతిష్టించిన భగత్ సింగ్ విగ్రహం

ఇది 25 ఏండ్ల కిందటి ముచ్చట. ఆ బోరు ఇప్పటికీ నీళ్ళు పోస్తున్నది. బోరులో నీళ్ళు పడినందుకు యాట కోద్దామని అడెల్లు అంటే ఒకే చెప్పాను. నేను నా దోస్తులు, అడెల్లు కుటుంబ సభ్యులు వచ్చారు. అన్ని ఏర్పాట్లు ఈ మఱ్ఱి కిందనే చేశాడు అడెల్లు. బోరు బావి వద్ద మ్యాకను కోసి మాంసం ముక్కలు తెచ్చి మఱ్ఱి చెట్టు కింద రాళ్ళ పొయ్యిలు రెండు పేర్చి ఒకదాని మీద అన్నం ఎక్కించాడు. రెండో బగోనలో మటన్ కూర వండడానికి సిద్ధం అయ్యాడు. రెండు పొయిల నుండి లేచిన పొగకు చెట్టు మీద ఉన్నపెత్తెర ఈగలు (పెద్ద ఈగల తేనె తుట్టె) లేచి కిందకి దూసుకు వచ్చి దాడి మొదలు పెట్టినాయి. మేమంతా ఒకే ఒకటే ఉరుకులు పరుగులు. తలో దిక్కున చెల్లాచెదురయ్యాము. ఒక గంట తర్వాత అడెల్లు వొంటి నిండా గొంగడి కప్పుకొని చెట్టు వద్దకు వెళ్ళే సాహసం చేసినాడు. అప్పటికి ఈగల ఉధృతి తగ్గింది. ఎందుకైనా మంచిదని కొత్త జాగల పొయిలు పేర్చి వంటలు పూర్తి కానిచ్చి మా అందరికి బోరు దావత్ తినిపించాడు. ఇట్లా అంబారావు మఱ్ఱితో అనేక అనుభూతులు అనుబంధాలు ఉన్నాయి.

**దోరోళ్ళ యాప చెట్లు :**

బోథ్ బస్టాండ్ లో బస్సు దిగి ఊరిలోకి పోయే దారిలో ఎడమ వైపున వరుసగా ఒక పదో పన్నెండో యాప చెట్లు ఉండేవి. వాటిని ఆనుకొని దోరోళ్ళ ఇండ్లు ఉంటాయి. కాబట్టి ఈ యాప చెట్లకు దోరోళ్ళ యాప చెట్లు అనే పేరు. ఇవి కూడా మా బొంతల అస్తిత్వంలో భాగం అయినాయి. ఈ చెట్లను చూడగానే ఊర్లోకి ప్రవేశించామన్న తృప్తి కలుగుతుంది. మనకు ఈ చెట్లే ఊరిలోకి స్వాగతం పలుకుతాయి. ఇప్పుడు ఊరి మార్కెట్ అంతా ఇటువైపు మారింది. మంగళవారం జరిగే అంగడిలో ఈ చెట్ల కింద దుకాణాలు వెలుస్తాయి. 1980 వ దశకంలో పి డి ఎస్ యు కి రాష్ట్ర అధ్యక్షుడిగా ఉన్న వి శంకర్ అన్న మా ఊరివాడే. ఆయనే తీసుకున్న చొరవ కారణంగా దోరోళ్ళ ఇండ్ల రూపు రేఖలు మారిపోయినాయి. ముంబాయిలో బిచ్చగాళ్ల సహకార సంఘం నుంచి లోన్ తెచ్చి పాత ఇండ్ల ముందు కొత్త మడిగెలు కట్టించి ఇచ్చాడని మిత్రులు చెప్పారు. తెలంగాణ ఉద్యమ కాలంలో బాగ్ లింగంపల్లిలో శంకరన్ననిర్వహిస్తున్న సహచర బుక్ షాప్ కు దాదాపు రోజు వెళ్ళే వాడిని. కానీ ఆయన ఊరి సంగతులు ఏవీ నాతో చర్చించేవాడు కాదు. మడిగెల నిర్మాణంతో వారి కుటుంబాల ఆర్థిక స్థితిగతులు అనూహ్యంగా మారిపోయినాయి. ఈ మడిగెల కారణంగా ఈ రోడ్డు ఊరి ప్రధాన బజారు వీధిగా మారిపోయింది. పాత బజారు వీధి కళ కోల్పోయింది. ఈ అభివృద్ది కారణంగా ఒకటి రెండు యాప చెట్లు పోయాయేమో కానీ చాలా చెట్లు ఇంకా ఉన్నాయి. బొంతల అస్తిత్వానికి ప్రతీకగా ఇంకా నిలచి ఉన్నాయి.

**మరికొన్ని చెట్లు :**

ఈ సందర్భంగా మరికొన్ని చెట్లను గుర్తు చేసుకుంటాను. మా బొంతల పెద్ద వాగు అవుతల వాగు పొంటి ఐదారు కిలోమీటర్ల పొడవున ఉండే మాముళ్ల (ఊరుమ్మడి మామిడి తోపు) గురించి ఇది వరకే నా ముచ్చట్లలో చెప్పి ఉన్నాను. వేలాది మామిడి చెట్లు ఉండే ఈ మామిడి తోపు మనిషి స్వార్థానికి కనుమరుగు అయ్యింది. పెద్దవాగుకు ఊరి వైపున తురక రేవు ఒడ్డున ఒక చింతల తోపు కూడా ఉండేది. ఇవి బొంతల పర్యావరణాన్ని సమతౌల్యాన్ని, కరువు కాటకాలు దరి చేరకుండా దశాబ్దాల పాటు కాపాడినాయి. ఈ మామిడి తోపు మధ్యన ఊడలు పోసిన ఒక మఱ్ఱి చెట్టు కూడా ఉండేది. మామిడి తోపుతో పాటు ఈ మఱ్ఱి చెట్టూ పోయింది. ఊర్లో కొంత మంది ప్రముఖుల ఇండ్ల ముందు కూడా యాప చెట్లు ఉండేవి. రాంకిషన్ రావు దేశ్పాండే, చట్ల శంకర్ రావు, ఏనుగు మల్లారెడ్డి గార్ల ఇండ్ల ముందు, విఠలేశ్వరుని గుడి ముందు, పోచమ్మ గుడి ముందు యాప చెట్లు చూసిన జ్ఞాపకం. ఈ చెట్లు కూడా కనుమరుగు అయిపోయినాయి. అయితే మా జ్ఞాపకాల్లో మాత్రం పదిలంగా ఉన్నాయి.

గడచిన పదేళ్ళ కాలంలో తెలంగాణ ప్రభుత్వం అమలు చేసిన హరితహారం కార్యక్రమంలో భాగంగా బోథ్ వందలాది కొత్త చెట్లు నాటి ఉంటారు. కానీ బోథ్ పర్యావరణ సమతౌల్యాన్ని దశాబ్దాలుగా కాపాడి కనుమరుగైన మాముళ్లు, చింతలు, రావి, మఱ్ఱి, యాప, జువ్వి చెట్లకు ఇవి సాటి రావు.

– శ్రీధర్‌రావ్ దేశ్‌పాండే, m : 94910 60585
e : deshpandesri@gmail.com

# వ్రజం వ్రజమే

మన సాహిత్యంలో దైనందిన జీవితంలో వజ్రం అనే పదాన్ని తరచుగా వింటుంటాము. ధృఢమయిందీ, మన్నికైనది దేన్నయినా వజ్రంతో పోలుస్తారు. వజ్రకాయము, వజ్ర సంకల్పము, వజ్రసన్నిభము ఇలా.. శక్తివంతంగా పనిచేసేదాన్ని దేనినైనా వజ్రాయుధంతో పోలుస్తారు.

**వజ్రానికి పర్యాయపదాలు:**

"హీరక, వజ్ర, దధీత్యస్థి, సుచీముఖం, వరారకం, ఇంద్రాయుధం, భిదూరం, లోహజిత్, కులిశం, పబిః మరియు అభేద్యం"

ఇలా అనేక పేర్లతో ప్రసిద్ధమైన వజ్రం సామాన్యుడి నుండి రాజుల వరకు చిరపరిచితం. అందరికి అందుబాటులో లేకున్నా వజ్ర లక్షణాలైన మెరుపు, కఠినత్వం గురించి తెలియని వారు ఉండరు. రత్నాలన్నిటిలో అతి ముఖ్యమైంది కాబట్టి వజ్రానికి రత్నముఖ్య మనే పేరు కూడా ఉంది. ఇతర రత్నాల వలె కాకుండా ఇది ఒక సాధనంగా మరియు ఆయుధాలుగా ఉపయోగించబడినది. దీనికి సహజంగానే అనేక దివ్యశక్తులు ఆపాదించ బడ్డయి. తెలుగులో దీన్ని 'రవ్వ' అని ప్రాకృతంలో 'వైరమ్' అంటారు, ఇది సంస్కృతంలో వజ్రంగా మార్పు చెందిందని ఒక వాదన కూడా ఉంది. రవ్వ మరియు వైరమ్ బహుశా భాషాపరమైన అనుబంధం కలిగియుండ వచ్చు.



నిజాం వ్రజం

**వజ్ర చరిత్ర:**

వేదకాలం నుండి వజ్రాలు మన నాగరికతకు సుపరిచితాలు. ఐతరేయబ్రాహ్మణ్యంలో దీని గురించి తొలిసారిగా కనిపిస్తుంది ఋగ్వేదంలో కూడా వజ్ర ప్రసక్తి కనిపిస్తుంది.

ఈ పదం ఆయుధం అనే అర్థం లో ఉపయోగించబడింది. ఉదాహరణకి ఋగ్వేద సూక్తం:

*'ధిశ్వ వజ్రో గభస్త్యో రక్షోహత్యాయ వజ్రివః*
*సాదహిష్టా అభి స్పృధః'*

అంటే వజ్రాయుధము (పిడుగుపాటును) కలిగినవాడా, రాక్షసుల నాశనానికి ఆయుధాన్ని నీ చేతుల్లోకి తీసుకో, నిన్ను ధిక్కరించే వారిని పూర్తిగ పడగొట్టు అని అర్థం.

పురాణాలు ఇతిహాసాల్లో వజ్ర శబ్దం వ్యక్తుల పేర్లలో, సైనిక వ్యూహ సంబంధితముగ, రసశాస్త్రములో ఔషధము గాను బౌద్ధ,జైన వాంగ్మయాలలో వివిధ ఉత్పత్తి అర్థాలలో కనిపిస్తుంది. కౌటిల్యుని అర్థశాస్త్రంలో కూడా వజ్రాలు దొరికే స్థలాల ప్రసక్తి కనిపిస్తుంది. ఆ కాలంలో వజ్రాలు దొరికిన 'సభారాష్ట్రకం, మధ్యమరాష్ట్రకం, కాశ్మకరాష్ట్రకం, శ్రీకటనకం మొదలైన' ప్రదేశాల పేరుతోనే వాటిని గుర్తించేవారు.

దైవ సంబంధమైన కౌస్తుభమణి, శ్యమంతకమణి వంటి ప్రస్తావనలు చరిత్రలో భాగం కాకపోయినా వజ్రం యొక్క ప్రాచీనత ప్రముఖతను తెలియచేస్తాయి.

మన పూర్వీకుల నమ్మకం ప్రకారం ఇవి దధీచి ఎముకల నుండి పుట్టాయని అంటారు. బలి చక్రవర్తి శరీర భాగాలు వజ్రాలతో సహా భూమి పైన రత్నాలుగా మారాయని ఇంకో నమ్మకం.

క్షీరసాగర మథనంలో కౌస్తుభమణి వంటివి ఉద్భవించాయని మరొక నమ్మకం.

వరాహమిహిరుడు బృహద్సంహితలో పూర్వపు నమ్మకాలను సంగ్రహంగా ఇలా వర్ణించాడు.

*రత్నాని బలాద్దైత్యద్ధచ్యోన్యే వదన్తి జాతని కేచిద్భ్వః స్వభావాద్వైచిత్ర్యాన్ ప్రాహురూపాలానామ్.*

ఈ శ్లోకంలో వరాహమిహిరుడు పైన పేర్కొన్న దదీచి, బలాదిత్య ఎముకలు కాకుండ రత్నాలు భూమిలో కూడా పుడతాయి అని ఆ కాలంలో ఉన్న నమ్మకాలను సంగ్రహ పరిచాడు.

వేణానది ఒడ్డున లభించే వజ్రాలు అత్యంత స్వచ్ఛమైనవి. కోసల దేశంలో లభించే వజ్రాలు శిరీష పుష్పం (తెల్లటి పసుపు) ఛాయ ఉంటుంది. సౌరాష్ట్రలో ఎర్రటి మెరుపు, సర్పారాదేశానికి చెందినవి ముదురు రంగులో ఉంటాయి. హిమాలయ ప్రాంతపు వజ్రాలు కొద్దిగా ఎరుపురంగులో ఉంటాయి. మాతంగదేశంలో ఉన్నవి బూడిద రంగులో ఉంటాయి (వల్ల పువ్వు). కళింగదేశంలో పసుపు ఛాయ, పౌండ్రదేశంలో నలుపు (నీలం) రంగు వజ్రాలు లభిస్తాయని వరాహమిహిరుడు పేర్కొన్నాడు.

ఈ స్థానాలన్నింటికీ స్పష్టమైన భౌగోళిక సరిహద్దులు లేవు. అంతే కాకుండా వాణిజ్య కేంద్రాలు మరియు ఉత్పత్తి స్థలాలు కలిపి ప్రస్తావించబడ్డాయి. వరాహమిహిరుడి జ్ఞానం అనుభావిక మైనది కనుక ఈ రకమైన అస్పష్టత సహజం. ఇంకా

వరాహమిహిరుడు ఎవరు ఎలాంటి వజ్రాలు ధరించాలి, ఏ దేవతలకు ఎలాంటి రంగు ఆకారం వజ్రాలు ఆపాదించబడ్డాయో, వజ్రాలకు వాటి స్వచ్ఛత బరువు ఆధారంగా ఎలా విలువ కట్టాలి అనే అనేక అంశాలు బృహద్సంహితలో చర్చించటం జరిగింది. ఇవన్నీ శాస్త్రీయ వాస్తవాలు కాదు నమ్మకాలు మాత్రమే.

వజ్రాలకు విలువ కట్టే విషయంలో మాత్రం కొన్ని ప్రమాణాలు వివరించాడు. వాటి ప్రకారం స్వచ్ఛమైన వజ్రం బరువు పెరిగినకొద్ది ద్రవ్యరూపంలో దాని విలువ ద్విగుణీకృతం అవుతుంది. వజ్రాల ధర అంచనా వెయ్యడంలో ఈ పద్ధతి నేటికీ కొంతవరకు పాటిస్తున్నారు.




కిమ్‌బర్‌లైట్, వజ్రకరూర్

ఏడవ శతాబ్దం B.C నుండి 1728 వరకు బ్రెజిల్‌లో వజ్రాలు కనుగొనబడే వరకు భారతదేశం వజ్రాలకు మూలం. ఇక్కడ చాలా పెద్దవి, అత్యుత్తమ నాణ్యతగల వజ్రాలు ఇక్కడ లభించాయి. ప్లినీ మరియు టోలెమీ వంటి గ్రీకు మరియు రోమన్ రచయితలు భారతదేశాన్ని వజ్రాలకు ఒక మూలంగా పేర్కొన్నారు. మార్కో పోలో రచనలలో వజ్రాల ప్రసక్తి ఉంది.

**వజ్రాల ఉనికి:**

వజ్రాల ఉనికి యొక్క మొదటి వివరణాత్మక రికార్డ్ టావెర్నియర్ (1605 నుండి 1689) అందించారు.

అన్ని ముఖ్యమైన డైమండ్ క్షేత్రాలు దక్కన్ పీఠభూమి అంచులలో పెన్నార్ నది (14 N Latitude) నుండి గంగానది దిగువ ఉపనదుల వరకు (25 N Latitude) విస్తరించి ఉన్నాయి.



చిన్నదైనా వజ్రమే

భారతదేశంలోని వజ్రాల క్షేత్రాలు నాలుగు ప్రాంతాలుగా విభజించబడ్డాయి. అవి:

1. ఆంధ్రప్రదేశ్ మరియు తెలంగాణలతో కూడిన దక్షిణ భారత ప్రాంతం: కడప, అనంతపురం, కర్నూలు, గుంటూరు, కృష్ణా మరియు మహబూబునగర్ లోని కొన్ని ప్రదేశాలు ఇందులో ఉన్నాయ్.
2. పన్నా బెల్ట్‌తో కూడిన మధ్యప్రదేశ్ మధ్య భారతీయ ప్రాంతాలు.
3. బెహ్రాదిన్ – రాయ్‌పూర్ జిల్లాలోని కొడవలి, ఛత్తీస్‌గఢ్, బస్తర్ జిల్లాలో తోకపాల్ దుగపాల్ మొదలైనవి ప్రాంతం,
4. తూర్పు భారతదేశ ప్రాంతాలు, ఎక్కువగా ఒరిస్సా మహానది మరియు గోదావరి లోయల మధ్య ప్రాంతాలు:

ఆంధ్రప్రదేశ్‌లోని పెన్నా కృష్ణ మరియు గోదావరి నది ప్రాంతాల్లో కనిపించే వజ్రాలు మచ్చలేని, రంగులేని కన్నీటిబొట్టు వలె ఉండేవి గోల్కొండ వజ్రాలుగా ప్రసిద్ధి చెందాయి. వజ్రాలు దొరికే ప్రాంతాలన్నీ పూర్వపు గోల్కొండ రాజ్యంలో భాగంగా ఉండేవి కాబట్టి ఆ పేరు వచ్చింది. ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన కోహినూర్ గుంటూరు సమీపంలోని కొల్లూరులో లభించింది.

అన్ని వజ్రాలు రత్నాలుగా అర్హత పొందవు. దోషరహితమైనవి మరియు మంచి రంగురాళ్ల రత్నాలుగా పనికివస్తాయి. రంగు తక్కువ, లోపభూయిష్టమైన రాళ్లు, చిప్స్ ముక్కలు, చిన్న కణాలు మరియు రజను, పరిశ్రమలో ఉపయోగించబడతాయి.

**వజ్రాలలో రకాలు-వనరులు:**

వజ్రాలు వాటి ఉపయోగాన్ని బట్టి 3 కేటగిరీలు.

1. **రత్నం గ్రేడ్:** 2.37% వనరులు 'రత్న' రకాలు. (Gem grade)
2. **పరిశ్రమ గ్రేడ్:** 64% పారిశ్రామిక రకం Industrial grde
3. **వర్గీకరించబడనివి (unclassified):** అత్యధిక వనరులు ఇంకా (95%).

**స్థూలంగా పారిశ్రామిక వజ్రాలు 3 రకాలు**

1. Balls: చిన్న వజ్రాల సమూహం, cleavage ఉండదు.
2. Borts: పసుపు బూడిద నుండి నలుపు రంగు లోపభూయిష్ట లేదా సక్రమంగా ఆకారంలోలేనివి
3. Carbonado: నలుపు చాలా కఠినమైన అపారదర్శక మరియు cleavage లేకుండా ఉండేవి.

ఇండస్ట్రియల్ క్వాలిటీ వజ్రాలను కుడా ఆభరణాలుగా ఉపయోగించడం ఇప్పుడు ట్రెండ్.

**భారతదేశంలో డైమండ్ నిలువలు:**

UNFS సిస్టమ్ ఆధారంగా NMI డేటా ప్రకారం భారతదేశంలోని డైమండ్ నిలువలు (రిజర్వ్/వనరులు కలిపి) 31.83 మిలియన్ క్యారెట్లుగా అంచనా వేయబడ్డాయి. వీటిలో 0.95 మిలియన్ క్యారెట్లు రిజర్వ్‌గాను, మిగిలినవి వనరులుగా గుర్తించబడ్డాయి.

వజ్రాల నిలువలు మధ్యప్రదేశ్‌లో 90.18%, ఆంధ్ర ప్రదేశ్ 5.72% మరియు ఛత్తీస్‌గఢ్ నుండి 4.09% ఉన్నాయి.

**వజ్రాల ఉత్పత్తి మరియు నిలువలు:**

పన్నా మధ్యప్రదేశ్ నుండి 2016లో 36516 క్యారెట్లు ఉత్పత్తి చేయబడ్డాయి ఇందులో 37% rough అన్‌కట్ మరియు మిగిలినవి పారిశ్రామిక నాణ్యత గల వజ్రాలు.


**భారతదేశంలోని ప్రసిద్ధ వజ్రాలు:**

కోహినూర్, హెూప్, డ్రెస్డెన్ గ్రీన్ ఫ్లోరెంటైన్, గ్రేట్ మొఘల్,

ఓర్లోఫ్ డైమండ్, పిట్ (రీజెంట్) డైమండ్ వంటివి బాగా ప్రచారంలో ఉన్న భారతీయ వజ్రాలు.

**ప్రజలకు తక్కువగా తెలిసిన కొన్ని వజ్రాల వివరాలు:**

అక్బర్ షార్ (గొర్రెల కాపరి రాయి): 1739 లో లభించింది. 71.70 క్యారెట్ లా వైట్ డ్రాప్ ఆకారపు రాయి ప్రస్తుతం బరోడాకు చెందిన గైక్వాడ్స్ యాజమాన్యంలో ఉంది. ఇది ఒకప్పుడు నెమలి సింహాసనంలో భాగం.



కోహినూర్ వజ్రం

**నలుపు ఓర్లాఫ్ (eye of Brahma):** 67.50 క్యారెట్ కుషన్ ఆకారంలో ఉన్న నల్లవజ్రం ప్రస్తుతం చార్లెస్ ఎఫ్ విన్సమ్ ఎన్ వై యాజమాన్యంలో ఉంది. ఇది ఒకప్పుడు 195 క్యారెట్లు. పాండిచ్చేరిలోని ఒక పుణ్యక్షేత్రం నుండి దొంగిలించ బడినట్లు చెప్పబడింది.

భారతదేశానికి చెందిన బ్రియోలెట్టి (Briolette of India) 93.83క్యారెట్ బ్రయోలెట్ ఆకారపు వజ్రం 1971లో ఐరోపాలో విక్రయించబడింది.

**దర్యా ఇ నూర్ :** 1739 కు ముందు దొరికిన వైట్ టేబుల్ కట్ డైమండ్ నాదిర్షా ద్వారా ఇరాన్ చేరింది. ఇప్పుడు ఇరాన్ ట్రెజరీలో భాగం. Great Table అనే ఈ పింక్ 242 క్యారెట్ల టేబుల్ కట్ వజ్రం 1677 కు ముందు దొరికింది . ఇరాన్ యొక్క దరియా ఇ నూర్ ఇదే కావచ్చు.



పసుపుపచ్చ వజ్రం

దర్యా ఇ నూర్ (ఢాకా) 150 క్యారెట్ల కుషన్ కట్ వైట్ డైమండ్ ప్రస్తుతం ఢాకా నవాబ్ వద్ద ఉంది.

బంగారు మహారాజు (Golden Maharaja): 65.60 క్యారెట్స్ గోల్డెన్ పియర్ ఆకారపు వజ్రం ప్రస్తుతం అమెరికన్ మ్యూజియం ఆఫ్ నేచురల్ హిస్టరీతో ఉంది.

**Hortensia (Hydrangea):** 20 క్యారెట్ల పింక్ డైమండ్, ఫ్రెంచ్ అధికారిక ఆభరణాలలో భాగం.

**జహంగీర్:** 83.00 క్యారెట్ల తెల్లని బేరిపండు ఆకారముగల వజ్రం ప్రస్తుత యజమాని సి పటేల్ ఇండియా. ఒకప్పుడు ఈ చెక్కబడిన రాయి నెమలి సింహాసనం లోని నెమలి ముక్కు నుండి వేలాడబడింది.

**నాసిక్ వజ్రం:** నాసిక్‌లోని శివాలయంలో భాగమైన 43.38 క్యారెట్ల తెల్లని ఎమరాల్డ్ కట్ ప్రైవేట్ యాజమాన్యంలోని వజ్రం.

**నేపాల్ వజ్రం:** 79.41 క్యారెట్ల వైట్ పియర్ కట్ గోల్కొండ Diamond ప్రైవేట్ యాజమాన్యం.

**నిజాం వజ్రం:** 277 క్యారెట్ల తెల్లని వజ్రం గోల్కొండ గనుల నుండి 440 క్యారెట్ల బరువును కలిగి ఉంది.

Piggott Diamond : 49 క్యారెట్ వైట్ బ్రిలియంట్ కట్. ఇది లార్డ్ పిగ్గోట్, మద్రాసు గవర్నర్కు భారతీయ యువరాజు సమర్పించినది. ప్రస్తుతం దీని జాడ తెలియని పరిస్థితి.

**సాస్నీ (Astor) వజ్రం :** 1593 కు పూర్వం దొరికిన ఇ వైట్ పియర్ కట్ 55 క్యారెట్ డైమండ్ ఇప్పుడు ఆస్టర్ ఎస్టేట్‌లో భాగం. హెన్రీ తన బట్టతలని కప్పుకోవడానికి ధరించినట్లు చెప్పాడు.

Shah diamond: 1591 ముందు 88.70 క్యారెట్ వైట్ బార్ కట్ కనుగొనబడింది. ప్రస్తుత యజమాని రష్యా. 1829లో పర్షియా ద్వారా జార్‌కు బహుమతిగా ఇచ్చినట్లు చెప్పబడింది.

**షా ఆఫ్ పర్షియా :** 1739కు ముందు దొరికిన 99.52 క్యారెట్ల పసుపు రంగు కుషన్ కట్ డైమండ్ . నాదిర్ షా 1739లో ఢిల్లీ నుండి పట్టుకు పోయినది.

Star of East: 26.16 క్యారెట్లు తెలుపు Brilliant కట్.

**Wittelsbach (The Great Blue) :** 1722కు ముందు దొరికిన 35.56 క్యారెట్ల ఓవల్ కట్ బ్లూ డైమండ్. ఆస్ట్రియా యువరాణి మరియా అమేలియా పెళ్లికానుకలో భాగం.

**తాజ్ ఇ మాహ్ (Crown of the Moon):** 1739కి ముందు దొరికిన తెల్లటి 115.05 క్యారెట్ రోజ్ కట్ డైమండ్ ఇప్పుడు ఇరాన్ ట్రెజరీలో భాగం. దరియా ఇ నూర్‌తో పాటు బ్రాస్‌లెట్‌లో జతగా సెట్ చేయండి.

**వజ్రఖనిజ సమాచారం:**

రసాయనిక ఫార్ములా ప్రకారం కార్బన్ డైమండ్‌లోని ప్రతి కార్బన్ పరమాణువు చుట్టూ మరో నాలుగు కార్బన్ పరమాణువులు ఉంటాయి. బలమైన సమయోజనీయ బంధం (covalent bond) ద్వారా ఒకదానితో ఒకటి కనెక్ట్ చేయబడి ఉంటాయి. ఈ పరమాణువుల అమరిక వజ్రం యొక్క మన్నిక మరియు బహుముఖ ప్రత్యేకతలకు కారణం. వజ్రాలు వాటి కాఠిన్యం ఔజ్వల్యం మరియు అత్యధిక ఉష్ణ వాహకతకు ప్రసిద్ధి చెందాయి.

**వజ్రాల రంగులు:** చాలా వజ్రాలు గోధుమ రంగు, నలుపు



వజ్రాలు



దరియా-ఎ-నూర్

లేదా పసుపు రంగులో ఉంటాయి. అవి రంగులేనివిగా కూడా ఉంటాయి. గులాబీ ఆకుపచ్చ మరియు ఎరుపు మరియు నీలం రంగులలో అరుదుగా ఉంటాయి.

**Streak:**

చాలా కఠినంగా ఉండటం వల్ల ఎటువంటి గీత పడదు.

**Lustre:**

అడమంటైన్, అలోహ (Non-Mettallic) ఖనిజాల అన్నిటికన్నా అత్యధిక స్థాయి మెరుపు ఉంటుంది.

**Diaphanity (ప్రకాశ పారగమ్యత):** పారదర్శక, అర్ధపారదర్శక మరియు అపారదర్శక.

**Cleavage:** పర్ఫెక్ట్ ఆక్టాహెడ్రల్ చీలిక నాలుగు దిక్కులలో.



పింక్ డైమండ్

**కాఠిన్యం:** మొహ్స్ స్కేల్‌లో - 10వ స్థానం. మరే ఇతర ఖనిజాలకన్న ఎక్కువ.

**విశిష్ట గురుత్వం:** 3.4 to 3.6.

**క్రిస్టల్ సిస్టమ్:** ఐసోమెట్రిక్

**వజ్రాల ఉపయోగం:**

అధిక విలువ గల ఆభరణాలు, అధికార చిహ్నాలు, అధిక విలువ కరెన్సీ గానే కాక, అనేక పారిశ్రామిక ఉపయోగాలు ఉన్నయి. కాఠిన్యం కారణంగా వాటిని కటింగ్ డ్రిల్లింగ్ మరియు పాలిషింగ్‌లో ఉపయోగిస్తారు. ఎలక్ట్రానిక్ పరిశ్రమలు, వైద్యంలో, సౌందర్య ఉత్పత్తులలో కూడా ఉపయోగాలు అనేకం. నానో టెక్నాలజీ, ఎలక్ట్రానిక్‌ల అభివృద్ధితో రోజురోజుకూ దీని ఉపయోగాలు పెరుగుతున్నాయి.



ముడి వజ్రం

**వజ్రాల లభ్యత:**

కింబర్లైట్ మరియు లాంప్రోయిట్స్ అనే రెండు రకాల శిలలు వజ్రాలకు ప్రాథమిక వనరులు. కృష్ణానది గులకరాళ్ళలో వజ్రాలు సూర్యాపేట జిల్లాలో అక్కడక్కడ ఉన్నాయి. తెలంగాణలో కింబర్‌లైట్ శిలలు కొల్లాపూర్, నారాయణపేట ప్రాంతాల్లో బయటపడ్డాయి. మూసీనది పరివాహక ప్రాంతం లో కూడా వజ్రాలు దొరికే అవకాశం ఉందని శాస్త్రవేత్తలు అనుమానిస్తున్నారు. ఇటీవల ఈ ప్రాంతంలో లాంప్రోయిట్స్ ఉన్నట్టు తెలిసింది.

**ఏవి వజ్రాలు?**

150 నుండి 700 కి.మీ లోతులో వజ్రాలు ఏర్పడతాయి. అవి కింబర్లైట్ శిలాద్రవం విస్ఫోటనం వల్ల పైకి వస్తాయి. ఈ విస్ఫోటనాలు వేగంగా మరియు అకస్మాత్తుగా ఉంటాయి. కింబర్‌లైట్ అనేది సిలికా తక్కువ మెగ్నీషియం సమృద్ధిగా ఉన్న అంతర్గమ శిల (intrusive rock) యొక్క పేరు. ఇవి పైప్ (pype) ఆకారంలోను (Dyke) డైక్ లాగ ఉంటాయి. లాంప్రోయిట్స్ (Lamproits) మరియు మెగ్నీషియం సమృద్ధిగా ఉన్న స్ఫటికీకరించ బడిన ఇంట్రూసివ్ శిలకి ఉన్న పేరు. దీనిలో క్రిస్టల్ ఖనిజం ఫెల్డ్‌స్పార్ ఉండదు. లాంప్రోయిట్‌లు చాలా తరచుగా కనిపిస్తుంటాయి కానీ కింబర్‌లైట్‌తో పోలిస్తే ఇందులో వజ్రాలు చాలా అరుదుగా దొరుకుతాయి.

**వజ్రాలు-గుడులు:**

భారతదేశంలోని అన్ని ఆలయాలలో దేవుండ్ల ఆభరణాలలో వజ్రాలు ఒక ముఖ్యమైన భాగం. ప్రసిద్ధి చెందిన ఎర్రటి వజ్రంతో సహా తిరుపతి దేవస్థానం వజ్రాలు అందరికీ తెలిసినవే. మెల్కోటే దేవస్థానం యొక్క వైరముడి సేవను ప్రతి సంవత్సరం వేలాది మంది సందర్శిస్తారు. భద్రాచల రామదాసు రాములవారికి చేయించిన కలికి తురాయి, రవ్వలమొలతాడు మొదలయినవి చాలా ప్రసిద్ధం.

జాతీయజెండా రూపకర్త పింగళి వెంకయ్యను ఆయనకు ఉన్న వజ్రాల పరిజ్ఞానం వల్ల వజ్రాల వెంకయ్య అని కూడా అనేవారు.

**-చకిలం వేణుగోపాలరావు,**
డిప్యూటి డైరెక్టర్ జనరల్ జిఎస్ఐ(రి)
m: 9866449348
e : venugopal.chakilam1@gmail.com

**- శ్రీరామోజు హరగోపాల్,**
m : 99494 98698
e: akshara25@gmail.com



## నా పాత్ర ఇంకా సశేషం, నేను ఒక విశేషం!

# చెన్నమనేని రాజేశ్వర రావు గారు

"స్వాతంత్ర సమరయోధులు చెన్నమనేని జీవితం నేటి తరాలకు స్ఫూర్తిదాయకం" పోస్టల్ కవర్ ఆవిష్కరణ సందర్భంగా సుప్రీం కోర్టు మాజీ న్యాయమూర్తి **బి.సుదర్శన్ రెడ్డి** గారు

"శాసనసభలో వారి ప్రసంగాలు వారి ప్రత్యామ్నాయ రాజకీయార్థిక సామాజిక మార్పులపైన విశ్లేషణ ఉన్న ఈ పుస్తకం ప్రతి ప్రజాప్రతినిధికి ఒక విజ్ఞాణభాండారం" శాసనసభలో వారి ప్రసంగాల పుస్తకావిష్కరణ సందర్భంగా శాసనమండలి చైర్మన్ **గుత్తా సుఖేందర్ రెడ్డి** గారు

"శాసనసభాపతిగా శాసనసభలో వారి పాత్ర చూసే భాగ్యం నాకు దక్కడం నా అదృష్టం" **కె.ఆర్.సురేష్ రెడ్డి** గారు, ఎం పి, మాజి స్పీకర్

"చట్ట సభలలో వైవిధ్యమైన రాజకీయ పరిస్తితులను సునాసాయంగా ప్రజాభ్యున్నతి వైపు మలచగల రాజకీయ నైపుణ్యమున్న వ్యక్తి మా అన్నగారు" **చెన్నమనేని విద్యాసాగర్ రావు** గారు, మాజి గవర్నర్

"బడుగుబలహీన వర్గాలకు సామాజిక న్యాయంతో పాటు రాజకీయ ప్రాతినిధ్యం విషయంలో చెన్నమనేనికి ఖచ్చితమైన అభిప్రాయం ఉండేది" **ఎల్.రమణ** గారు, శాసనమండలి సభ్యులు

"చెన్నమనేని రాజేశ్వర రావు గారి స్ఫూర్తిని ఫౌండేషన్ కార్యక్రమాల ద్వారా అందరికి అందుబాటులోకి తెస్తాం"

**చెన్నమనేని రమేష్,** చెన్నమనేని రాజేశ్వర రావు లలితా దేవి ఫౌండేషన్ చైర్మన్

కీ.శే. చెన్నమనేని రాజేశ్వర రావు గారి శతజయంతి సందర్భంగా "చెన్నమనేని రాజేశ్వర రావు మరియు లలితా దేవి ఫౌండేషన్" ఏర్పాటు చేసిన కార్యక్రమాలలో 17 ఫిబ్రవరి 2024 సాయంత్రం జలవిహార్, హైదరాబాదులో విడుదలైన పుస్తకం "శాసనసభలో మూడు దశాబ్దాల ప్రజా వాణి - చెన్నమనేని" మరియు భారత పోస్టు విభాగం ద్వారా వారి జ్ఞాపకార్థం పోస్టల్ కవర్, వారి జీవితకాల విశేషాలను తెలియజేస్తున్న ఫోటో ప్రదర్శన ప్రధానమైనవి.

*పార్టీ యజ్ఞంలో నేను సమిధను*
*పార్టీ చీకట్లో నేను ప్రమిదను*
*పార్టీ పోరాటంలో నేను సైనికుడిని*
*పార్టీ నిర్మాణంలో నేను కార్మికుడిని*
*పార్టీ పాఠ్యాంశంలో నేనొక ముఖ్య అంశాన్ని*
*నా పాత్ర ఇంకా సశేషం, నేను ఒక విశేషం!*

ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు, కమ్యూనిస్టు నాయకులలో అగ్రజుడు చెన్నమనేని రాజేశ్వరరావు తన గురించి చెప్పుకున్న మాటలు ఇవి. అటు స్వాతంత్ర్య ఉద్యమంలోను, ఇటు కమ్యూనిస్టు పోరాటంలోను ఆయన పోషించిన పాత్ర ఆజరామం. నిజాయితీకి నిలువుటద్దం! అజాతశత్రువు! నిస్వార్ధ సేవ! పోరాటాలకు స్ఫూర్తి.... ఇవన్నీ చెన్నమనేని వ్యక్తిత్వానికి పర్యాయపదాలు. తన సుదీర్ఘ రాజకీయ ప్రస్థానంలో వివిధ పదవులు అలంకరించి భావితరాలకు స్ఫూర్తినిచ్చిన అలుపెరగని యోధుడు ఆయన.

చెన్నమనేని రాజేశ్వరరావు పద మూడెండ్ల ప్రాయంలోనే సిరిసిల్లలో 1935లో జరిగిన ఆంధ్ర మహాసభలకు స్వచ్ఛంద సేవకులుగా హాజరయ్యారు. స్కాలర్స్ డిబేటింగ్ సొసైటీ పేరుతో స్థాపించిన సంఘానికి కార్యదర్శిగా రాజకీయ జీవితం ప్రారంభించారు. క్విట్ ఇండియా ఉద్యమానికి మద్దతుగా విద్యార్థులను సమీకరించారు. ఆ సమయంలో అరుణ ఆసఫ్ అలీ రాజేశ్వరరావును నాయకుడిగా సంబోధిస్తూ అభినందించారు.




1947లో దేశానికి స్వాతంత్రం వచ్చిన హైదరాబాదులో మాత్రం నిజాం పాలనే కొనసాగింది. ఈ సమయంలో మేధావులు, ఉద్యమకారులను కలుపుకొని హైదరాబాద్ సంస్థాన విమోచన ఉద్యమంలో పాల్గొన్నారు. రహస్యంగా మారువేషాల్లో తిరిగారు. కాలేశ్వరం గోదావరి ఒడ్డున సిరొంచాలో క్యాంపు నిర్వహించిన సమయంలోనే పీ.వీ నరసింహారావుతో పరిచయం ఏర్పడింది. 1951లో కమ్యూనిస్టు ఉద్యమం సాగుతున్న సమయంలో రావి నారాయణరెడ్డితో పాటు రాజేశ్వర రావును అరెస్ట్ చేశారు. చంచల్ గూడా, ఔరంగాబాద్, గుల్బర్గా జైళ్లకు తిప్పారు. అప్పుడే మార్క్సిజం, లెనినిజంపై ఇద్దరి మధ్య సుదీర్ఘంగా చర్చలు జరిగినట్టు రాజేశ్వరరావు తెలిపారు. 1952లో జైలు నుంచి విడుదలయ్యాక కమ్యూనిస్టు పార్టీ కరీంనగర్ జిల్లా కార్యదర్శిగా రైతు ఉద్యమాల్లో నిమ్మగ్నమయ్యారు. అంచెలంచెలుగా ఎదిగిన ఆయన సిపిఐ జాతీయ కౌన్సిల్ సభ్యుడిగా పని చేశారు.

1952లో ఆయన జైల్లో ఉన్న సమయంలో పెరోలుపై మెట్పల్లి ఎమ్మెల్యేగా నామినేషన్ వేసేందుకు రాగా రెండు నిమిషాలు సమయం ఎక్కువ అవడంతో నామినేషను తిరస్కరించారు. 1957లో చొప్పదండి నుంచి పీపుల్స్ డెమొక్రటిక్ పార్టీ నుంచి పోటీ చేసి తొలిసారి విజయం సాధించారు. తర్వాత సిరిసిల్ల నుంచి 1967, 1978, 1985, 1994, 2004లో ఆరుసార్లు ఎమ్మెల్యేగా గెలుపొందారు మూడు పర్యాయాలు శాసనసభలో 1967, 78, 85ల్లో సిపిఐ ఫ్లోర్ లీడర్గా పనిచేశారు. 1999లో తెలుగుదేశం పార్టీలో చేరారు. 77 ఏళ్ల వయసులో కమ్యూనిస్టు పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేసిన ఆయన టిడిపిలో చేరడానికి ఎటువంటి కారణాలు చెబుతారో అన్న ఉత్కంఠ ఆనాడు అందరిలోనూ కనిపించింది. కానీ టిడిపిలో తన చేరిక కేవలం వైయుక్తకమైనదే తప్ప రాజకీయమైనది కాదని ప్రకటించి తన నిజాయితీని చాటుకున్నారు.

ఏడు దశాబ్దాల రాజకీయ జీవితంలో చేపట్టిన ప్రతి పదవికి వన్నె తెచ్చారు. శా సనసభ లోపల, బయట ఆయన చేసిన ప్రసంగాలు ప్రతి ఒక్కరిని ఆలోచింప చేసేవిగా ఉండేవి. పాలకవర్గాలపై విమర్శలు చేస్తూనే పరిష్కార మార్గాలు చూపిన మేధావిగా పేరు తెచ్చుకున్నారు. పార్టీల మధ్య సిద్ధాంత వైరుధ్యాలు ఉన్నప్పటికీ అన్ని పార్టీల నేతలు గౌరవించే అరుదైన నేతగా గుర్తింపు తెచ్చుకున్నారు.

ప్రస్తుతం అలాంటి రాజకీయ విలువలు ప్రతినిత్యం అంతరించిపోతున్న సమయంలో నిజంగానే చెన్నమనేని పాత్ర ఇంకా సశేషం, ఖచ్చితంగా ఈ తరానికి వారి స్ఫూర్తి ఒక విశేషం. ఆయన కోరిక మేరకే చట్ట సభలో వారి సందేశాలను, చట్టసభలు మరియు వాటి నియమావళులు, సంధానకర్తల పైన వారి అనుభవాలు విమర్శలను పొందుపరచిన పుస్తకం మనకు ఒక సమగ్ర పాఠ్యాంశంగా విడుదల కాబోతున్నది.

ఈ పుస్తకం "శాసనసభలో మూడు దశాబ్దాల ప్రజా వాణి - చెన్నమనేని" వారి రాజకీయ జీవితాశయాలను, పేద, బడుగు బలహీనవర్గాల ప్రజల అభ్యున్నతికోసం వారు చేసిన నిరంతర పరిశ్రమను ప్రతిబింబిస్తాయి. శాసనసభను ప్రజలవాణిగా తీర్చిదిద్దదలచుకున్న ప్రతి రాజకీయవేత్తకు ఈ పుస్తకం మంచి పాఠాలను అందిస్తుంది. ఇందులో బడ్జెట్ ప్రసంగాల సందర్భంగా వారు ఒకవైపు ప్రజాసమస్యలను - కౌలుదారి చట్టాలు, భూసంస్కరణలు, ప్రజాపోరాటాలు నిర్బంధాలు, సన్న చిన్న కారు రైతుల ఆర్థిక సామాజిక అభ్యున్నతి, తెలంగాణలో సాగునీటి సమస్య పరిష్కార మార్గాలు, తీవ్రవాదం వాటి మూలాలు, పేదరికం పెట్టుబడిదారి వ్యవస్థలో సామాన్యప్రజల జీవనసంఘర్షణ, విద్యా, వైద్యన్ని - లోతుగా అధ్యయణం చేసి పరిష్కారమార్గాలను, వ్యవస్థాపరమైన మార్పుల ఆవశ్యకతను కూలంకషంగా నినదించారు. ఇదేగాక వారి శాసనసభా అనుభవాలను - "నాయకుడికి నా నిర్వచనం", "శాసనసభ విలువల పరిరక్షణలో స్పీకర్ పాత్ర, ముఖ్యమంత్రి పాత్ర, ప్రజాస్వామ్య ప్రతిష్ట" తో పాటు "శాసనసభ్యునిగా నా అనుభవాలు" పొందుపరిచారు.

"పదవి అనేది యుద్ధ వీరుడు చేతిలో కరవాలం. మానవత్వమే గమ్యం. మానవత్వం వెల్లివిరిసే సమాజమే నా ధ్యేయం" అంటూ ఆయన చెప్పిన మాటలు నేటి తరాలకు స్ఫూర్తి దాయకం. ఒక్క మాటలో చెప్పాలంటే సుదీర్ఘ రాజకీయ అనుభవమున్నా ఏనాడు హంగు ఆర్భాటాలకు పోకపోగా.. నమ్మి గెలిపించిన ప్రజల పక్షాన నిలిచి స్వపక్షం విపక్షం అనే తేడా లేకుండా పోరాడి ప్రజల గుండెల్లో సుస్థిర స్థానం సంపాదించుకున్నారు.

అవును చెన్నమనేని పాత్ర ఇంకా సశేషం, ఖచ్చితంగా ఈ తరానికి వారి స్ఫూర్తి ఒక విశేషం!

– డా. చెన్నమనేని రమేష్
చైర్మన్, చెన్నమనేని రాజేశ్వర రావు మరియు
లలితా దేవి ఫౌండేషన్
(www.chennamanenifoundation.org)

ద

# గుల్జార్ చెప్పిన కథ

కథ ఎలా ఉండాలి? అని ఎవరైనా అడిగితే గుల్జార్ చెప్పిన ప్రేమ్ చంద్ కథను మినహా మరో మంచి ఉదాహరణ నేనేమి ఇవ్వగలను అనిపిస్తుంది!

1930లలో రాసిన ఆ కథ... కథలోని ఆ ఐదేళ్ళ హమీద్... ఈద్ యొక్క అందమైన ఉదయం మనల్ని వెంటాడుతుంది.

మనిషి జీవితం పాటతో మొదలైనా, మనిషికి సన్నిహితంగా ఉండేవి కథలు. బుద్ధి తెలిసినప్పటినుంచి మనిషి వినేవి కథలే. మనిషి జీవితం కథలతోనే మొదలవుతుంది. కథలతోనే ముగుస్తుంది. అవి ఆత్మకథలు కావచ్చు. జ్ఞాపకాలు కావచ్చు.

కథ ఎలా ఉండాలి? కథలో ఏం వుండాలి? కథ ఎలా నడుస్తుంది అన్న మాటల గురించి ఆలోచిద్దాం.



కథల్లో జీవితం ఉండాలి. సామాజిక స్పృహ ఉండాలని ఇలాంటివి ఎన్నో చెబుతూ ఉంటారు. అవన్నీ పక్కన పెట్టి కథ ఎలా ఉండాలి అన్న విషయం చెప్పడం కోసం గుల్జార్ అనుభవాన్ని చెబుతాను. గుల్జార్ మంచి దర్శకుడే కాదు. కవీ, అంతకుమించి కథకుడు.

రాఖీ, గుల్జార్ విడిపోయారు. కారణాలు తెలియవు. తన కథల పుస్తకాలని చాలా వరకు రాఖీకి అంకితమిచ్చాడు గుల్జార్. అంకితం ఇచ్చినప్పుడు అతను రాసిన ఒకే ఒక వాక్యం మనల్ని వెంటాడుతుంది.'లాంగెస్ట్ షార్ట్ స్టోరీ ఆఫ్ మై లైఫ్' –రాఖీ

గుల్జార్ జీవితంలో రాఖీది ఓ చిన్న కథ! కానీ అది అత్యంత సుదీర్ఘమైన కథ.

అదలా ఉంచి కథ ఎట్లా ఉండాలి అన్న విషయం చెప్పడానికి గాను గుల్జార్ అనుభవం చెబుతాను. ఐతే గుల్జార్ అనుభవం చెప్పాలంటే ముందు ప్రేమ్ చంద్ రాసిన కథ గురించి చెప్పాలి.

ఈద్గా

పంజాబీల ఇంటిముందు తందూర్ ఉంటుంది. ఆ తందూర్ లో సాయంత్రం పూట రొట్టెలు తయారు చేస్తుంది ఐదేళ్ళ కుర్రవాడి వాళ్ళ నానమ్మ. రొట్టెలు చేయడంలో నిపుణురాలు ఆమె. చేతిని తడి చేసుకొని తయారు చేసిన రొట్టెలు చేతిలో ఉంచుకొని క్షణాల్లో తందూర్లో పెట్టి కాల్చేది. ఆమెలో ఎంత నైపుణ్యం ఉన్నా ఆమె చేతులు కాలుతూనే ఉండేవి. చేతుల మీద కాలిన మచ్చలు కూడా ఏర్పడ్డాయి. అప్పుడప్పుడు వేళ్ళకి బ్యాండేజ్ కూడా కట్టాల్సి వచ్చేది. అది చూసినప్పుడల్లా హమీద్ కి బాధ కలిగేది. అతను ఎప్పుడూ ఆ విషయం ఎవరికీ చెప్పలేదు.

కథ హమీద్ చుట్టూ తిరుగుతుంది. అతను ఓ ఐదేళ్ల కుర్రవాడు. అతనూ, అతని ముసలి నానమ్మ దారిద్ర్యమైన పరిస్థితుల్లో జీవిస్తూ వుంటారు. హమీద్ తల్లిదండ్రులు మరణించారు. అమాయకత్వంతో కూడిన అనంతమైన ఆశ హమీద్ ది. అల్లాహ్ మియాన్ నివాసం నుండి విలువైన బహుమతులతో, సంపదలతో తల్లిదండ్రులు ఒక రోజు తిరిగి వస్తారని అతను భావిస్తూ వుంటాడు. పేదరికంలో ఉన్నప్పటికీ, హమీద్ సంతోషంగా సంతృప్తిగా వుండే పిల్లవాడు.

జాతరలో ఖర్చు పెట్టడానికి అతని దగ్గర కేవలం మూడు పైసలు మాత్రమే వున్నాయి. అతను తన స్నేహితులు తమ పాకెట్ మనీతో క్యాండీలు, స్వీట్లు, బొమ్మల కోసం ఖర్చు చేయడం చూస్తాడు. కానీ అతను అలాంటి వస్తువులేవీ కొనడు.

అది ఈద్ యొక్క అందమైన ఉదయం. హమీద్, అతని స్నేహితులు వాళ్ళ గ్రామానికి 3 మైళ్ల దూరంలో ఉన్న ఈద్గా వద్ద నమాజ్ చేయడానికి బయలుదేరతారు. ప్రార్థనలు ముగియగానే అందరూ బయటకు వస్తారు. హమీద్ జేబులో వున్నవి కేవలం 3 పైసలు. పండుగ పూట ఏమైనా కొనుక్కోమని వాళ్ళ నానమ్మ ఇచ్చినవి.

హమీద్‌కి ఇతర పిల్లల మాదిరిగా కొత్త బట్టలు లేదా బూట్లు లేవు. తల్లిదండ్రులు చనిపోవడంతో నానమ్మ వద్ద ఉంటున్నాడు.

జాతరలో ఖర్చు పెట్టడానికి అతని దగ్గర కేవలం మూడు పైసలు మాత్రమే వున్నాయి. అతను తన స్నేహితులు తమ పాకెట్ మనీతో క్యాండీలు, స్వీట్లు, బొమ్మల కోసం ఖర్చు చేయడం చూస్తాడు. కానీ అతను అలాంటి వస్తువులేవీ కొనడు.

హమీద్ తన నానమ్మ రోట్టెలు చేస్తున్నప్పుడు ఆమె చేతిని ఎలా కాల్చుకుందో గుర్తుకు తెచ్చుకుని చిమ్టా (చిమటా) కొనడానికి ఒక దుకాణం దగ్గర ఆగి బేరం చేసి దాన్ని కొంటాడు. తిరుగు ప్రయాణంలో, అతని స్నేహితులు చిమటా కొనుక్కున్నందుకు అతనిని ఎగతాళి చేస్తారు, కానీ అతను తన తెలివిగల మాటలతో వాళ్ళని ఎదుర్కొని వాళ్ళకి మాటలు లేకుండా చేస్తాడు. వారి పాడైపోయే బొమ్మల కంటే తన చిమటా మెరుగని చెబుతాడు.

హమీద్ ఇంటి దగ్గరకు వస్తాడు. హమీద్ గొంతు వినగానే, అతని నానమ్మ అమీనా ఇంట్లోంచి బయటకు పరిగెత్తి, అతన్ని

ఎత్తుకుని ముద్దుపెట్టుకుంటుంది. అకస్మాత్తుగా అతని చేతిలో ఉన్న చిమటాని గమనిస్తుంది.

ఇప్పటి దాకా ఏమీ తినకుండా తాగకుండా ఈ చిమటా కొన్నావా? దీని కన్నా మంచిది ఏమీ జాతరలో దొరకలేదా?' గట్టిగా అడుగుతుంది.

"నీకు ఇదెక్కడ దొరికింది?'

'కొన్నాను"

'ఎంతకు కొన్నావు?'

'మూడు పైసలు.'

"అక్కడ ఏమీ కొనుక్కోకుండా ఇది కొన్నావా..?"

"అవును"

నానమ్మ అమీనాకి ఏమీ అర్థం కాదు. తన చేతులతో తన గుండెలు బాదుకుంటుంది.

'నువ్వు తెలివితక్కువ పిల్లవాడిలా వున్నావు! మిట్ట మధ్యాహ్నం అయ్యింది. ఇప్పటి దాకా ఏమీ తినకుండా తాగకుండా ఈ చిమటా కొన్నావా? దీని కన్నా మంచిది ఏమీ జాతరలో దొరకలేదా?' గట్టిగా అడుగుతుంది.



హమీద్ భయంగా ఇలా బదులిచ్చాడు, 'నువ్వు తందూర్లో రొట్టెలు కాలుస్తూ నీ వేళ్లనుకాల్చుకుంటున్నావు, అందుకే చిమటా కొన్నాను.'

ఆ జవాబుతో వృద్ధురాలి కోపం కరిగిపోతుంది. బాధ కన్నీళ్ళై ప్రవహిస్తుంది. ప్రేమతో హమీద్‌ని గట్టిగా వాటేసుకుంటుంది. ఆమె కరిగి నీరవుతుంది. అది వృధా కాని కన్నీరు. ఆమె ప్రేమ మాటలు లేనిది, సున్నితత్వంతో నిండిపోయిన ప్రేమ.

పెద్దలకు లేని కనికరం, పరిపక్వత

ఎంత నిస్వార్థపరుడైన బిడ్డ! నా పట్ల ఎంత శ్రద్ధ! ఎంత దయ. వాడిది ఎంత పెద్ద హృదయం! ఇతర అబ్బాయిలు బొమ్మలు కొనుక్కోవడం, మిఠాయిలు కొనడం చూసి అతను ఎంత బాధపడ్డాడో కదా! అతను తన కోరికలను ఎలా అణచుకోగలిగాడు! జాతరలో కూడా తన ముసలి నానమ్మ గురించే ఆలోచించాడు. అమీనా గుండె ప్రేమతో కూడిన బాధతో నిండిపోతుంది.

ఆమె కన్నీళ్లు పెట్టుకుంటుంది. ఈ చిన్న కథకు అంత పెద్ద అర్థం ఉంది. చాలా మంది పెద్దలకు లేని కనికరం, పరిపక్వత ఆ ఐదేళ్ళ కుర్రవాడికి ఉంది. మనం ఐదేళ్ళ హమీద్‌లా ఎందుకు ఉండలేకపోతున్నాం? ఈద్ సందర్భంగా అతను మూడు పైసాలకు కొన్న బహుమతి ఎంత అమూల్యమైనది."

అమీనా తన ఆప్రాన్‌ను విప్పి, తన మనవడి కోసం అల్లా ఆశీర్వాదం కోసం వేడుకుంది. ఆమె కళ్లలోంచి పెద్దగా కన్నీళ్లు జారిపోతూవుంటాయి.

విచిత్రమైన విషయం ఏమిటంటే– చిమటా పోషించిన పాత్ర కంటే విచిత్రమైనది. హమీద్ వృద్ధునిగా మారినట్టు అనిపించడం. అమీనా చిన్న అమ్మాయిగా మారినట్టు అనిపించడం.

అమీనా తన ఆప్రాన్‌ను విప్పి, తన మనవడి కోసం అల్లా ఆశీర్వాదం కోసం వేడుకుంది. ఆమె కళ్లలోంచి పెద్దగా కన్నీళ్లు జారిపోతూవుంటాయి. ఆమెలో ఏం జరుగుతుందో హమీద్‌కి ఏం అర్థం కాదు.

ముగ్గురిలోనూ అదే రకమైన బాధ..

1930లలో రాసిన ఈ కథ నేటికీ సజీవంగా ఉండిపోయింది. దాదాపు 9 దశాబ్దాల తర్వాత కూడా ఈ కథ గురించి మాట్లాడుకుంటున్నాము. అదీ ఈ కథ గొప్పతనం.

ఈ కథలో మెలోడ్రామా ఉంది. అది బలంగా ఉంది పాత్రలు సామాన్యంగా కనిపిస్తాయి. కోరికలు చిన్నవి. విలువలు పెద్దవి. భాష సరళంగా సూటిగా ఉంటుంది.

కథలో ఏది చెప్పకుండా దాచి పెట్టడం ఉండదు. పాత్రల మనసులో ఏమి వుంటుందో అది కథలో ప్రతిబింబిస్తుంది.

ఈ కథని గుల్జార్ చిన్నప్పుడు చదివి ఏడ్చాడు. ఒకరోజు గుల్జార్ వాళ్ళ నాన్న ఏదో కథని అతని భార్యకి వినిపిస్తూ ముక్కు తుడుచుకోవడం చూస్తాడు. ఆ కథ మరేదో కాదు, గుల్జార్ చదివిన మున్షీ ప్రేమ్‌చంద్ కథ. గుల్జార్ వాళ్ళ అమ్మకి ఉర్దూ రాదు. ఆ కథని మళ్ళీ చదివి వినిపించమని గుల్జార్ ని ఒకసారి కోరుతుంది వాళ్ళ అమ్మ.

గుల్జార్ చదవడం మొదలు పెడతాడు. కథ పూర్తి కాకముందే ఆమె గొంతు గద్గదం అవుతుంది. కళ్ళల్లో నీళ్లు కదలాడుతాయి. ఆ తర్వాత గుల్జార్ మళ్లీ ఒకసారి కథ చదువుతాడు ఇప్పుడు అలాంటి పరిస్థితి ఆయనది.

ఎంతో ప్రయాసపడి గాని కథని వినిపించటం పూర్తి చేయలేక పోతాడు గుల్జార్. అతను అప్పటికి చిన్నవాడు. అతని తల్లి, తండ్రి కన్నా చిన్నది. కానీ ఆ కథ చదివినప్పుడు ముగ్గురిలోనూ ఒకే రకమైన బాధ, ఆవేదన, ఫీలింగ్, అనుభూతి.

కథ ఎలా ఉండాలి? అని ఎవరైనా అడిగితే ఇంతకన్నా మంచి ఉదాహరణ నేను ఏమి ఇవ్వగలను అనిపిస్తుంది!

–మంగారి రాజేందర్ (జింబో)

m : 9440483001

e : rajenderzimbo@gmail.com

# శక్తి ఆరాధకులు - బైండ్ల కళాకారులు

తెలంగాణా జానపద కళారూపాల్లో విశిష్టమైన కళారూపం బైండ్ల కళారూపం. ఇక్కడ మనుగడలో ఉన్న కళారూపాల్లో భారతం, రామాయణం కథలను కథాగానం చేసే కళారూపాలే ఎక్కువ. ఇందుకు భిన్నంగా కేవలం శక్తి దేవతలైన ఎల్లమ్మ, పోచమ్మ, మైసమ్మ, పెద్దమ్మ వంటి దేవతలను కొలుస్తూ, కథలు చెప్పే కళారూపాల్లో అరుదైన కళారూపం బైండ్ల కళారూపం కావడం విశేషం. వంశపారంపర్యంగా సంక్రమించిన కథాగాన సంస్కృతిని అనుసరిస్తూ వృత్తిగాయకులుగా పేరు గాంచిన బైండ్లవారు ఎల్లమ్మ, మారమ్మ, మైసమ్మ, భవాని, దుర్గా, కాళి మొదలైన పేర్లు కలిగిన శక్తి దేవతలను ఆరాధిస్తూ జీవనం గడుపుతారు. కళాకారులు దేవత పేరు ఏది చెప్పినా ఆదిశక్తి రూపమైన భవాని దేవియే వీరికి ఆరాధ్యదైవం. మాదిగ వారికి ఉపకులంగాను పేర్కొంటారు. వారు చేసుకునే శుభ, అశుభ కార్యాలతోను వండుగలలోను భాగస్వాములవుతారు. పెండ్లిళ్లకు పురోహితులుగా వ్యవహరిస్తారు. శక్తి దేవతల చరిత్రలను వీరిని గురించి పరిశీలించినట్లయితే వారి ఆకారం, వీరు పూజించే దేవతలను జన వ్యవహారంలో నున్న ఈ క్రింది చాటు పద్యంలో వర్ణించడం చూడవచ్చు.



సీ॥ దీర్ఘకాయము గల్గి ధైర్యవంతుడయ్యి
పాదాల జీరాడుపంచె గట్టి
బుగ్గ మీసంబుల పూర్ణ దృఢత్వంబు
తెల్లని తలపాగ తేజమలర
చెనయ దక్షిణ చేతి సింహతలాటమ్ము
జమిడిక వామచంకను ధనింప
కాళ్ళకు గజ్జెలు ఘల్లు ఘల్లున మోగ
నుదుట కంకుమ బొట్టు నది జ్వలింప
తే ॥ శాంభవీ దుర్గా మహంకాళి జగము మాత
ప్రకృతి దేవికి పుత్రుడు భవ్యశీలి
అతడె భవనీడు జనపదుడాది శక్తి
మహిమల న్పుగ్గిడించెబు మానధనుడు

**బైండ్ల ప్రస్థావన :** బైండ్ల వారి ప్రస్థావన ప్రాచీన తెలుగు సాహిత్యంలోను మరియు వారు ప్రదర్శించే ఎల్లమ్మ కథలోను కనిపిస్తుంది. ముఖ్యంగా

శ్రీనాధుని కాశీఖండంలోని ఏడవ అశ్వాసంలో

॥ పణుతించు ఏక వీరాదేవి నొకవేళ
బపనీడయి సమగ్ర భక్తి గరిమ ॥

అనే - ప్రయోగాన్ని బట్టి చూస్తే శక్తిని ఆరాధించే ఒక గాయకుడైన భక్తుడు 'బైండ్ల' అని చెప్పవచ్చు. అదేవిధంగా ప్రతాపరుద్రుని కాలంలో ఓరుగల్లులో భవనీల చక్రవర్తి ఏకవీరాదేవి ముందు (ఎల్లమ్మ) నిలబడి పరశరాముడి కథలన్నీ పాడీతో పాడినట్లు క్రీడాభిరామంలో కలదు. అదేవిధంగా శ్రీకృష్ణదేవరాయలు తన ఆముక్త మాల్యదలో జముడిక వాయిద్యమును గూర్చి పేర్కొన్నాడు. ధూర్జటి శ్రీ కాళహస్తీశ్వర శతకంలో ప్రతీ ఊర్లో భవానీ కాంద్రు మహాకవులుగా చలామణి అవుతున్నారని ఉంది. వీరు వంశపారంపర్యంగా గ్రామ దేవత కథలు చెబుతూ శక్తి గొప్పతనాన్ని గురించి వర్ణిస్తూ గ్రామ గ్రామాల్లో కథాగానం చేయడం ప్రధాన వృత్తి.

**బైండ్ల వృత్తాంతం :**

బైండ్ల వారిని బవనీలు అని కూడా పిలుస్తారు. కళాకారులు ప్రదర్శనలో వాయించే వాద్యాన్ని జమిడిక అని, శిష్టులు దీనిని బవనిక అంటారు. అందుకే ఈ బవనికను వాయించే వారే బవనీలు, బైండ్ల వారని బిరుదురాజు రామరాజుగారు 'తెలుగు జానపద గేయ సాహిత్యం'లో వివరించాడు. అదేవిధంగా వీరు భవాని మాతను కొలువడం వల్ల భవనీలు అని, వారే బైండ్ల వారు అని పేర్కొన్నారు. బైండ్ల వారిని సర్కారు జిల్లాలో జముకులవాళ్లు అని అంటారు. ఇక్కడ జముడుకను జముకు అంటారు. శ్రీకాకుళం జిల్లాలో బుడబుడకలవారు అంటారు. జముడుక వాయించేటపుడు బుడబుడ మనే శబ్ధం వస్తుంది. కాబట్టి బుడబుడ కల వారు అంటారు. రాయలసీమలో ఆసాదివాళ్లు, బైనీండ్లు అని అంటారు.

కళాకారులు చెప్పే ఎల్లమ్మ కథలో బైండ్ల వారి ప్రస్తావన మరియు వారి వృత్తాంతం కనిపిస్తుంది. జమదగ్ని మహాముని భార్య ఎల్లమ్మ తల్లి సంతానం కావాలని భర్తను కోరుతుంది. అందుకు జమదగ్ని మహాముని సంతాన వరం కావాలంటే పరశురాముడికి తండ్రి జాడ చెప్పకూడదని చెపితే ఇరవై నాలుగు సంవత్సరాలు అష్టకష్టాలు పడాల్సి వస్తుందని అంటాడు. ఒకవేళ అతను పెట్టే కష్టాలు భరించలేక తండ్రి జాడ చెప్పితే, నీ శిరస్సు పత్తికాయ మాదిరిగా నాలుగు వక్కలుగా పగిలిపోతుందని చెప్తాడు. అయినప్పటికీ ఆమె సంతానం కావాలని కోరుతుంది. ఆ రకంగా ఆమె కొడుకు పరుశురాముడు పెట్టే కష్టాలు భరించలేక అతని

నుండి తప్పించుకుంటునే తండ్రి దాక్కోడానికి గౌండ్ల వాడ, చాకలివాడ, గొల్లవాడ, బాపనివాడ, శాలవాడ తిరుగుతుంది. వారంతా పరుశురాముని పేరు విని ఎవరూ ఆశ్రమం కల్పించరు. చివరికి జగతి కంటే ఆరునెలల ముందు పుట్టిన తాత జాంబవంతుని దగ్గరికి వెళ్లి ఒక్క గడియ దాయమని కోరుతుంది. అతను ఆమె కష్టం విని నా దగ్గర నిన్ను దాయడానికి స్థలం లేదని పచ్చి తోళ్లు నాన బెట్టిన, రడగబ్బు వాసన వచ్చే లందగోలెం ఉందని అందులో దాక్కోమంటాడు. ఆమె కొడుకు పెట్టే కష్టం కంటే లందగోలెం రడగబ్బు వాసన ఎక్కువ కాదని, ఆ వాసన రాకుండా ఉండేందుకు ఆమె తన దగ్గరి గోరంత బండారి తీసి, గోలెం దగ్గర వేయగా వాసనంతాపోయి, సువాసన వెదజల్లుతుంది. పరశు రాముడు తల్లిని వెతుకుతూ, తాత జాంబవంతుని దగ్గరికి వచ్చి ఎల్లమ్మ జాడ చెప్పమని వాదిస్తాడు. జాంబవంతుడు ఆమెను రక్షించడానికి ఇక్కడికి రాలేదని చెప్పినప్పటికీ లందగోలెం దగ్గరి బండారి చూసి, తల్లి గోలెంలోనే దాక్కుందని, ఆ తల్లిని బయటికి రప్పించడానికి పరశురాముడు చేతిలో జమిడిక, జేగంట, కాళ్లకు గజ్జెలు, వేప రెమ్మలు ధరించి బైండ్ల అవతారమెత్తుతాడు. లందగోలెం దగ్గర పసుపు బండారి తోటి పట్నాలు పరిచి ప్రార్థన చేయగా ఎల్లమ్మ తల్లి బయటికి వస్తుంది. ఈ రకంగా శక్తిని ఆరాధించడానికి ప్రసన్నం చేసుకోవడానికి పరశురాముడు ధరించిన బైండ్ల వేషమే వంశపారంపర్యంగా బైండ్ల కళాకారులకు సంక్రమించిందంటారు. ఈ విధంగా ఎల్లమ్మ కథలో బైండ్ల ప్రస్థావన కలదు.

**బైండ్ల కళాకారులు ప్రదర్శించే కథలు :**

బైండ్ల కళాకారులు ప్రధానంగా గ్రామ దేవతల కథలు ప్రదర్శిస్తారు. ముఖ్యంగా గ్రామాల్లో జరిగే జాతరలు, కొలుపులు, పండుగల సందర్భంలో ఈ కథలను చెబుతారు.

1. మాతపురాణం 2. ఎల్లమ్మ కథ 3. శక్తికల్యాణం 4. రేణుకా యుద్ధం 5. మలిశెట్ల యుద్ధం 6. మాంధాత కథ 7. తరీదేవి కథ 8. మైసమ్మ కథ 9. పోచమ్మ కథ 10. పెద్దమ్మ కథ మొదలైన కథలు ప్రధానంగా చెప్తారు.

బైండ్ల వారు గానం చేసే కథల్లో మాతపురాణం ఒక విశిష్టమైన కథ. మాత అనగా తల్లి. ఆదిశక్తి పరంజ్యోతి అని ఈ మహత్తర శక్తికి గల పేర్లు. భవానీ, అంబ, కాళిక మొదలగు నామాలతో ఈ శక్తిని ఆరాధించే సంప్రదాయం ఉంది. బైండ్లవారు ఈ శక్తిని బాధలు మాన్పే దేవతగా భావించి ఈమె కీర్తిని తమ ప్రధాన వాద్యమైన జమిడికతో పాడుతూ కథను ప్రారంభిస్తారు. బవనీయుడు రేణుక అమ్మవారి కొలుపులకు ప్రధానకర్త. చంకలోని జమిడికతో అతడు శక్తిగానం చేయనిదే ఆదిశక్తికి ఉనికియే లేదు. చర్మవాద్యాలైన రుంజ, మృదంగం, తబలా, డోలు, మద్దెల, డమరుకం, వీటన్నిటికీ లేని లక్షణం జమిడికకు ఉంది. ఒక తంత్రి, ఒక చర్మం, రెండు కలిసి ఉన్న వాద్యం జమిడిక.

ఇది భారతీయ వాద్యాలలోనే ప్రత్యేకతను కలిగి ఉంది. దీనిని వాయిస్తూ అమ్మవారిని సంతోషపెట్టే విధంగా జానపదులను అలరింపచేసే పాట ఈ క్రింది విధంగా ఉంటుంది.

*కృతాయుగంబున రేణుకాశక్తి*
*త్రేతాయుగంబున సీతామహాశక్తి*
*ద్వాపర యుగంబున ద్రౌపది మహాశక్తిగా*
*కలియుగంబున అమ్మవారు*
*గృహ గృహిణి యను ఆదిశక్తి*
*లోలాక్షి లోకమాత*
*మాపు చూస్తే మరియు రూపు*
*పగలు చూస్తే పద్మిని చూపు*
*లోకాలు నేలు శక్తి*
*లోకాలు పోలు శక్తి*
*నీళ్ల మీది బుగ్గ నీలారివమ్మా అమ్మా*
*అమ్మవారు నీ గురిగింజ కన్నులకు గుప్పెన నుదుట*
*వాలారి కన్నులకు వచ్చేట్లు నిదుర (నిద్ర)*
*మా భవనీల ప్రార్థన అలకించి*
*మమ్ములను కాపాడునట్టి*
*రేణుకా*
*పరంజ్యోతి, ఆదిశక్తి, అమ్మవారు*
*నమస్తే, నమస్తే నమః అని ఆదిశక్తిని కీర్తిగానం చేస్తారు.*

ఆదిశక్తి అమ్మవారు సృష్టికి మూలకారణం. పరంజ్యోతిగా వెలుగొంది, కృతాయుగంలో, రేణుకాశక్తిగా, త్రేతా యుగంలో సీతామహాలక్ష్మిగా, ద్వాపరయుగంలో ద్రౌపదిగా, కలియుగంలో అమ్మవారిగా అవతరించి దుష్ట శిక్షణ, శిష్ట రక్షణ గావించి బాధలను తీర్చే తల్లిగా, ఆరాధించిన వారిని ఆదుకొను మాతగా విలసిల్లింది. లోకమాతగా అనేక రూపాల్లో లోకాన్ని రక్షించేదిగా ఆరాధింపబడుతుంది అమ్మవారు. బవనీలు చెప్పే అన్ని కథలు కూడా అమ్మవారికి సంబంధించినవే కాకుండా అవి గ్రామ దేవతలకు సంబంధించనవి కావడం విశేషం. ఈ కథలన్నింటిలో ఎల్లమ్మ, జమదగ్నుల మహిమలను వేనోళ్ళ కీర్తింప చేసేవే.

**ఉదా :** కళాకారులు చెప్పే ఎల్లమ్మ కథా స్వరూపంను పరిశీలించినట్లైతే ఈ కథలో అహల్య గౌతముల కుమారుడగు జమదగ్నికి శివుని కూతురగు ఎల్లమ్మను ఇచ్చి వివాహం చేస్తారు. వివాహం అయిన కొద్ది రోజులకే జమదగ్ని తల్లిదండ్రుల అనుమతి పొంది తపస్సు చేయుటకు అడవికి వెళ్తాడు. ఒకనాడు ఎల్లమ్మ తన భర్తను కలుసుకొనదలచి భోనం వండి అలంకరించుకొని బయలుదేరుతుంది. ఆమె వస్తే జమదగ్నికి తపో:భంగం జరుగుతుందని భగవంతుడు మార్గ మధ్యంలో ముగ్గురు పసిబాలురను సృష్టించి వారిని ఎల్లమ్మ వద్దకు పంపుతాడు. ఆ పసిబాలురు మాకు ఆకలి వేస్తుంది. అన్నం పెట్టమని అడుగుతారు. కాని ఆమె భర్త సేవకు ఆలస్యమవుతుందని చెప్పి వారి ఆకలిని తీర్చకుండానే జమదగ్నిని చేరుకుంటుంది.

జమదగ్ని ఎల్లమ్మను పరీక్షించదలచి జల్లెడలో నీరు తెమ్మంటాడు. జల్లెడలో నీరు తేగా, అతను సంతోషించి భోజనం చేయుటకు సిద్ధం అవుతాడు. అపుడు కుండ తెరిచి చూసేసరికి అన్నం అంతా అదేవిధంగా ఉంటుంది. అశ్చర్యంతో జమదగ్ని దీనికి కారణమేమిటని దివ్యదృష్టితో చూస్తాడు. భర్త సేవకు ఆలస్యమవుతుందని వచ్చిన ఎల్లమ్మ దారిలో అన్నమడిగిన ముగ్గురు పసిబాలురకు అన్న పెట్టలేదని, ఆ ముగ్గురు పిల్లలు తమ పిల్లలేనని జమదగ్ని గుర్తిస్తాడు. వారికి అన్నం పెట్టి తీసుకరావలసిందిగా ఆదేశిస్తాడు. ఆ పసిబాలురు ఎల్లమ్మను నగ్నంగా ఉండి భోజనం పెట్టమని కోరగా, ఎల్లమ్మ పాతివ్రత్య మహిమచే అక్షయ వలువలు ధరించి ఆ బిడ్డలకు అన్నం వడ్డించి వారిని తీసుకొని జమదగ్నిని చేరుకుంటుంది.

జమదగ్ని తన భార్య ఎల్లమ్మను ఇసుకతో కడవ గావించి నీరు తెమ్మని కోరడం, ఆమె తన పాతివ్రత్య మహిమచే ఇసుకతో భాండము గావించి, దానిలో నీరు నింపే సమయంలో అక్కడ కొన్ని కప్పలు రాసక్రీడ లాడుతున్నట్లు గమనించిన ఎల్లమ్మ మనస్సు చెలిస్తుంది. దివ్య దృష్టితో ఇది గమనించిన జమదగ్ని తన రొమ్ము నుండి కొంతమట్టిని తీసి ఒక వ్యక్తిని సృష్టించి ఎల్లమ్మ ఉన్న కొలను వద్దకు వంపిస్తాడు. అతడు ఎల్లమ్మను బలత్కరించ ప్రయత్నిస్తాడు. వానిని తిరస్కరించి జమదగ్నిని చేరుకొని అతనికి అన్నం పెడుతుంది. జమదగ్ని ఎల్లమ్మను దోషురాలుగా భావించి ఆమె చేతి అన్నం తినడం ఇష్టము లేక తన కుమారులైన పసిబాలురతో తల్లైన, అక్కైనా, చెల్లెల్లైనా, తప్పు చేస్తే ఏమి చేయవలెను కొమరులారా? అని జమదగ్ని అడుగగా తప్పు చేసిన వారిని చంపుట మంచిదని తిరిగి సమాధానం చెపుతారు. అప్పుడు తప్పు చేసినది నీ తల్లియే అని వారికి చెపుతాడు. తప్పు చేసినది తన తల్లియేనని తెలిసి కూడా పరశురాముడు ఏ మాత్రం సంకోచించ కుండా తండ్రి ఆజ్ఞ మేరకు తల్లి తలను ఖండిస్తాడు. తరువాత జమదగ్ని ప్రసన్నచిత్తుడై, పరశురామున్ని వరము కోరుకోమనగా, తన తల్లిని బ్రతికించుమని కోరుతాడు. అప్పుడు జమదగ్ని తపో:మహిమచే ఎల్లమ్మను బ్రతికిస్తాడు. ఇంతటితో ఎల్లమ్మ కథ ముగుస్తుంది.



ఎల్లమ్మ దీన జన రక్షకురాలిగా, వ్యాధి, రోగ భయాలు, దారిద్ర్య భయాలు పోగొట్టు శక్తిగా గుర్తించి ఆరాధించడం నిమ్న వర్గాలలోను, ఉన్నత వర్గాలలోను ఉన్నాయి. తెలుగునాట ఈ దేవతను ఎల్లమ్మ మాహురమ్మ, రేణుక, ఎల్లు, అక్కలదేవి, ఎల్లారి, ఏకవీర మొదలైన పేర్లు వ్యవహారంలో వినిపిస్తాయి. అందుకే ఈ దేవతను ఎక్కువగా కొలుస్తారు. ఈ కథల ద్వారా శక్తి దేవతలకు సంబంధించిన మహిమలను జానపదులు ఎంతగా విశ్వసించి ఆరాధిస్తారో తెలుస్తుంది.

### ప్రదర్శనా విధానం :

**ప్రదర్శనా సమయం :** గ్రామ దేవతా కొలుపులు అన్ని రాత్రి పూటనే జరుగుతాయి. అందుకే వీరు చెప్పే కథలు కూడా రాత్రి పూటనే ఉంటాయి. అప్పుడప్పుడు అనుష్టానాలకు అనుగుణంగా పగలు కూడా ప్రదర్శిస్తారు. రాత్రి పూట అయితే భోజనాలు ముగించుకుని 9 లేదా 10 గంllలకు ప్రారంభిస్తే తెల్లవార్లు కథలు ప్రదర్శిస్తారు.

**వేదిక :** వేదిక అనేది ప్రత్యేకంగా ఉండదు. కాని వీరు ఎక్కడైతే దేవతా కొలుపులు కొలుస్తారో ఆ గుడి ముందే నిలబడి కథలు ప్రదర్శిస్తారు. గుడి ముందు పందిరి వేసి ఉంటే దాని క్రింద నిలుచొని కథలు చెపుతారు.

### ప్రదర్శకులు :

ప్రదర్శనలో కళాకారులు ముగ్గురు ఉంటారు. ఇందులో ఒకరు ప్రధాన కథకుడు. ఇతనే జమిడిక వాద్యాన్ని వాయిస్తూ, కథ చేస్తాడు. ఇతనికి వంతులగా ఇద్దరు తాళాలు వాయిస్తూ, ప్రధాన కథకున్ని అనుసరిస్తూ కథాగానం చేస్తారు.

**ప్రదర్శనా ప్రారంభం :** బవనీయుడు పాడే పాటలతో, పద్యాలతో, దండకాలతో ప్రజలకు వినోదాన్ని, భక్తిని కలిగిస్తాడు. అంబకీర్తనతో, దండకంతో దేవీస్తుతితో శ్రావ్యమైన కంఠంతో కథ చెపుతూ, గజ్జెల కాళ్ళతో చక్కగా నాట్యం చేస్తూ, వివిధ భంగిమలలో ప్రేక్షకులను ఆనందపెడుతాడు.

**ప్రదర్శనా పద్ధతి :** ప్రదర్శన ఆద్యంతం ఆసక్తిగా సాగుతుంది. కథకులు ప్రదర్శనలన్నింటిని కథాగాన పద్ధతిలో ప్రారంభిస్తారు. పరశురాముని కథ మాత్రం పాత్రలకు అనుగుణంగా వేషధారణ చేసుకొని కథాగాన యక్షగాన పద్ధతిలో కథలను ప్రదర్శిస్తారు.

కథాగానాన్ని మధ్యలో ఆపి విశ్రాంతి తీసుకొనే సమయంలో ప్రధాన కథకుడు కథను వివరిస్తుంటాడు. ఈ సమయంలో కథకుడు కొంత విరామం పొంది, మళ్లీ తరువాత కథను అందుకొని అతను – మధ్యలో పెద్దకేక వేస్తాడు. ఈ కేక నిద్రిస్తున్న ప్రేక్షకులకు ఒక హెచ్చరికలా ఉంటుంది. కథ చెప్పేటపుడు బైండ్లవారు ప్రదర్శించే హావభావ విన్యాసాల్ని చూడవలెనే గాని, చెప్పుటకు అలవి కాదు. కథావేగాన్ని పుంజుకుని కథకుడు లయ బద్ధంగా, వేగంగా నాట్యం

చేస్తూ కథాగానం చేస్తూ హుషారుగా గంతులిడుతూ ఉంటే చూసేవారు ఉద్రేకంలో ఉంటారు.

జమిడిక ధ్వని కథకుని కథాగానానికి అనుకూలంగా కదం తొక్కుతుంది. కథ సీసపద్యాలతో, ద్విపదాలతో సాగుతుంది. అభినయ పూర్వకంగా మరియు కథాగాన శైలిలో కథ ఉన్నా, కథ ఎక్కువగా వచనరూపంలో నడుస్తుంది. రెండు నిమిషాల కొకసారి కథకుడు చేతితో జమిడిక మీటుతుంటాడు. కథా సందర్భమును బట్టి అవయవ చాలనం చేస్తుంటాడు. ముఖ్యంగా సన్నివేషాలు రాగానే ఎడమ చేతిని దగ్గర పెట్టుకొని, కుడిచేతితో అభినయం చేస్తూ కథ చెప్తూ ఉంటారు. కథ చెప్పే సందర్భాన్ని బట్టి వచనం పొడిగించడం, కుదించడం జరుగుతుంది. ఇవి నిస్సారంగా చెప్పుకుంటూ పోయే కథలు కావు. వివిధ రాగాలను గొంతులో పలికిస్తారు. కథలోని సంఘటనలు ప్రేక్షకుల కళ్ళ ముందు జరుగుతున్నాయా అన్నంత బాగా కథకుడు కథ చెప్తుతుంటాడు.

ఈ విషయాలన్నింటిని గమనించడానికై ముందుగా అమ్మవారిని సంతోషపెట్టే విధంగా వారు జానపదులను అలరింపజేసే ప్రార్థన గేయాన్ని గమనిద్దాం.

*తల్లి నిన్ను కొలచి*
*దండములు పెట్టి కరమెత్తి మెక్కెదా, నా కన్నతల్లి*
*అవని లోపలజనుల అంబవే తల్లి*
*బవనీల పాలిటి ఓకల్పవల్లి*
*గవ్వ దర్శనాలు, ఘనంగా ధరియించి*
*ముప్పొద్దు పూజలు చేసేము తల్లి*
*గుగ్గిలము మైసాచి కుప్పగా పొగ లేపి*
*తలచితిమి మదిలోన తల్లి మాయమ్మా*
*సుతులు, జమిడికలు, సుందరముగ వాయించి*
*కాళ్ళ గజ్జెలు కట్టి ఘల్లున మోగించి*
*ఆదితి నీ ముందు అంబవో తల్లి*
*ఇల్లిల్లు నీ పూజ ఇష్టంగా జేసి*
*జగన్మాత నిన్ను జగమెల్ల గొలిచేరు*
*కోపగించకు తల్లి ఓపజాలమమ్మా*
*బగ్గుబగ్గున నుండి బొబ్బలు లేపి*
*కష్టపెట్టకు మమ్ము ఓ కన్నతల్లి,*
*కొత్తకుండల కల్లు సాకాలు నీకు*
*గడప గడపకు నీకు కలివేపరిల్లలు*
*ఆపదలు బాపేటి అమ్మలకు అమ్మ*
*శాంతింపు మా తల్లి జగమేలే తల్లి*
*కోపగించుడి వేళ కోడి పుంజులు బలి బలి*
*గొర్జెపోతుల బలి బలి*
*శాంతింపు శాంతింపు ఓ జగన్మాత*
*బవనీల ఇలవేల్పు భార్గవి అంబ*

దండాలు దండాలు చండికా నీకు అని ప్రధాన కథకుడు, జమిడికను వాయిస్తూ, భక్తి రసావేషంతో ఊగిపోతూ పాడుతుండగా వంతకాళ్లు అనుసరిస్తారు. ఇలా గేయం పాడుతూ ముగింపులో బవనీల ప్రార్థన అలకించెడి తల్లి అని తనను గురించి కూడా ప్రస్తావించుకోవడం కనిపిస్తుంది. ఇంకా వీరు దేవతాస్తుతితో శక్తి కథాగేయాన్ని ద్విపదకు సమీపగతిలో నడుపుతుంటారు.

*ఉదా : రేణుకా శక్తి కళ్యాణంలో*
*రాతికే వరమియ్యి మాత*
*నీ అష్ట కంకణాల చేత*
*అవునమ్మ అనుకుంట్ల కొమ్మ*
*నీవు అద్దంకి నాంచారివమ్మా*
*కల్లు తాగుదువు రావమ్మో*
*సారాయి తాగుదువు లేవమ్మా*
*గంజాయి తాగుదువు రావమ్మా*
*అల్లనాడు నీ(వు) విచ్చిన వరము*
*అడితప్పుకే ఓయమ్మా*
*బండ్లు కట్టుక వచ్చేవారు*
*పూల చెండ్లు వేసుక వచ్చేవారు*
*గుడి చుట్టు కుంకుమ బండ్లు*
*అమ్మ అందురే నీ పేరు*
*శివ అవతార మందురే నీ పేరు*
అంటూ పాడడం కనిపిస్తుంది.

ఎల్లమ్మ జన్మ వృత్తాంతంను తెలిపే మరో పాట రాగయుక్తంగా పాడడం వినబడుతుంది.

*శివుని చిన్న బిడ్డవయ్యా ఎల్లమ్మా*
*నీవు శివునెల్ల మాతవమ్మా ఎల్లమ్మా*
*పార్వద్దేవి బిడ్డవమ్మా ఎల్లమ్మా*
*నీవు పరంజ్యోతి తల్లివమ్మా ఎల్లమ్మా*
*పుట్టలోన బుట్టినావు ఎల్లమ్మా*
*నీవు పుడిమిపై బిడ్డవమ్మా ఎల్లమ్మా*
*నాగవన్ని చీరలమ్మ ఎల్లమ్మా*
*నీకు నెమలి రవికెలమ్మా ఎల్లమ్మా*
*ఏడుమ గవ్వాలు తల్లీ ఎల్లమ్మా*
*నీకు వెనుక దరిసెనమ్మా తల్లీ ఎల్లమ్మా*
*నాగుపాముల బట్టి నావు ఎల్లమ్మా*
*నాగుపాముల బట్టినావు ఎల్లమ్మా*
*నీవు నడికట్టు వేసినావు ఎల్లమ్మా*
*జెర్రిపోతుల బట్టినావు ఎల్లమ్మా*
*నీవు జడ కొప్పుల వేసినావు ఎల్లమ్మా*
*ఓరుగంటి రాజులను ఎల్లమ్మా*
*నీవు ఓంకార మడిగితివి ఎల్లమ్మా*
*నీవు ఎదురైనచో తల్లి ఎవరమ్మా ఎల్లమ్మా*

అంటూ తల్లిని బైండ్ల వారు కీర్తిస్తారు.

**బైండ్ల కళాకారులు ప్రస్తుత స్థితిగతులు :**

బైండ్ల కళాకారులు పూర్వం మాదిగ వారికి పూజారులుగా, శక్తి ఆరాధకులుగా వెలుగొందారు. సామాజికంగా ఒక గౌరవమైన స్థానంలోనే మనుగడ సాగించారు. కాలాలు మారుతున్న కొద్దీ సమాజంలో వస్తున్న మార్పులు బైండ్ల వారి సాంస్కృతిక జీవితంలో కూడా మార్పులు వచ్చాయి. పూర్వం మాదిగ వారు జరుపుకునే శుభ కార్యాలకు బైండ్ల వారు ముహూర్తాలు పెట్టడమే గాక, పెళ్లి తంతు కూడా జరిపించేవారు. ప్రస్తుతం ఆ సంస్కృతి కనుమరుగయింది. ప్రస్తుతం వీరికి వంశానుగతంగా సంక్రమించిన నతను గ్రామాలకు వెళ్లి పోచమ్మ, ఎల్లమ్మ, మైసమ్మ కథలు చెప్పి దేవతలను కొలిచే పూజారులుగా, కళాకారులుగా మాత్రమే మిగలిపోయారు.



కళారూపం ప్రదర్శనలో కూడా కాలానుగుణంగా ప్రేక్షకుల అభిరుచి మేరకు మార్పులు చేసుకున్నారు. పూర్వం వీరు కథాగానం చేసే ఎల్లమ్మ కథను ఏడు రోజులు చెప్పేవారు. ప్రస్తుతం అదే కథను మూడు గంటల్లో చెప్పి కథను ముగిస్తున్నారు. ఈ రకంగా కథ చెప్పించుకునే ధాతలే చెప్పమనడంతో కళాకారులు అందుకు అంగీకరించక తప్పని పరిస్థితి ఏర్పడింది. అంతే గాక ప్రదర్శనలో పూర్వం ప్రధాన కథకుడు జమిడికను వాయిస్తుండగా, మిగతా ఇద్దరు కళాకారులు తాళాలు వాయిస్తూ వంత పాడుతూ కథాగానం చేసేవారు. ఈ రకమైన ప్రదర్శన రెండు తరాల కంటే ముందు బాగానే కొనసాగింది. అప్పుడున్న ప్రేక్షకులు కథను ఆసక్తితో వినేవారు. కానీ ప్రస్తుతం ఆ రకంగా ప్రదర్శిస్తే ప్రదర్శన ప్రేక్షకులను ఆకర్శించడం లేదని కళాకారులు తాము ప్రదర్శించే కథలోని పాత్రలకు అనుగుణంగా వేషాలు ధరించి కథాగానం చేయడం ప్రారంభించారు. దీని కారణంగా తాము ప్రదర్శించే కథాంశం ప్రేక్షకులను ఆకర్షించడమే కాక వారికి ఆదరణ పెరిగేలా కళాకారులే తమ కళారూపంలో మార్పులు చేసుకోవడం చేత కళారూపం మనుగడకు కూడా వారే దారి వేసుకున్నట్లయింది.

అలాగే ప్రదర్శనలో కళాకారులు ప్రధానంగా వాయించే జమిడిక వాద్యాన్ని ఇంతకుముందు మేక జక్కి పొరతో ముడుసు కోవడం జరిగేది. అది చర్మం కావడంతో చలి కాలంలో మరియు వర్షాకాలంలో తేమకు తరుచూ అదిముడుసుకోవడంతో దాని స్థానంలో ప్లాస్టిక్ పొరను ముడుసుకొని వాయించడం జరుగుతున్నది. కాని దేవతలను కొలిచేటప్పుడు చర్మంతో ముడిసిన జమిడిక వాద్యాన్ని వాయిస్తేనే శక్తి దేవతలు తృప్తి చెందుతారనే విశ్వాసం కళాకారులకు ఉన్నప్పటికీ, తప్పని పరిస్థితుల్లో ఉపయోగించడం తప్పలేదని కళాకారుల మాటల్లో కనిపిస్తుంది.

తెలంగాణాలో బైండ్ల సామాజిక వర్గానికి చెందిన జనాభా కూడా అతి తక్కువగా ఉంది. వీరంతా పది గ్రామాలకు ఏదో ఒక గ్రామంలో రెండు కుటుంబాలు, మూడు కుటుంబాలు విస్తరించి కనిపిస్తారు. మాదిగ వారికి ఉపకులంగా కళాకారులు చెప్పు కున్నప్పటికీ మాదిగ వారికి వీరికి కంచం పొత్తు ఉంది కానీ వియ్యం పొత్తు ఉండదు. అయితే వీరి జనాభా తక్కువగా ఉండటంతో పెళ్లి సంబంధాలు కలుపుకోవడంలో అనేక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు.

ప్రస్తుతం తెలంగాణాలో కథాగానం చేసే బైండ్ల కళాబృందాలు కొద్ది వరకే పది వరకు ఉన్నట్లు తెలుస్తున్నది. అయితే కళారూపానికి గ్రామాల్లో శక్తి దేవతలకు జాతర నిర్వహించి నపుడు వీరికి సంబంధించిన ఆయా కట్టడి గ్రామాల్లో దేవతలను కొలుచుకునేప్పుడు మాత్రమే వీరికి ప్రదర్శనావకాశాలు ఉంటాయి. దీని ద్వారా కేవలం సంవత్సరంలో ఆషాడం, శ్రావణం మాసాల్లోనే కళాకారులకు ఉపాధి దొరుకుతున్నది. మిగతా రోజులు వేరే వృత్తులు చేయడానికి కూడా కళాకారులకు అవకాశం లేకపోవడంతో కొత్త తరం వారు లేదా యువకులు ఈ కళారూపాన్ని నేర్చుకోవడానికి ముందుకు రావడం లేదని కళాకారుల మాటల్లో వినిపిస్తున్నది. కానీ అక్కడక్కడ కళాకారులు తమ మూల సంస్కృతిని కొనసాగించాలనే పట్టుదలతో తమ పిల్లలను చదివిస్తూనే సందర్భాన్ని బట్టి వారికి కథలను నేర్పించే ప్రయత్నం చేస్తున్నాడు.

బైండ్ల వారు కేవలం శక్తి దేవతలైన ఎల్లమ్మ, పోచమ్మ, మైసమ్మ, పెద్దమ్మ లాంటి దేవతల కథలే చెప్తారు కాబట్టి ఆయా గ్రామాల్లో ఉన్న శక్తి దేవతల ఆలయాల్లో ప్రభుత్వం ధూప దీప నైవేద్యాల పథకం కింద ఈ బైండ్ల కళాకారులను చేర్చి వీరికి ఆయా శక్తి దేవతల ఆలయాల్లో ఉపాధి కల్పిస్తే కళారూపం మనుగడకు, కళాకారుల గౌరవానికి దోహదం చేస్తుంది. అంతే గాక తరతరాల నుండి కళాకారులు కాపాడుతూ వస్తున్న మౌఖిక సంపద, వారి సంస్కృతి పరిరక్షింపబడుతుంది.


– డా॥ గడ్డం వెంకన్న
m : 9441305070
e : a@gmail.com

ప్రకృతే సౌందర్యం! 22 ప్రకృతే ఆనందం!!

# మా రంగుల ప్రపంచాన్ని ధ్వంసం చేయకండి!

గత కథనాల్లో సముద్రమథనం గూర్చిన తొలినాటి ప్రయత్నాల్ని చూసాం. మానవుడి మేధస్సుకు అందనంతగా సముద్ర లోతులున్నట్లు గుర్తించాం. వీటి అంతర్భాగాల గూర్చి తెలియకముందు వివిధ దేశాల్లో, ప్రజల్లో అనేక అభిప్రాయాలుండేవి. సనాతన దేశాలైన రోమ్, గ్రీస్, రష్యా, చైనా, భారత్ లాంటి దేశాల్లో సముద్రాలు దేవుడి ఆవాసాలని నమ్మేవారు. ఇవే నమ్మకాలు ఎత్తైన పర్వతాలపై కూడా ఉన్నాయి. ఉత్తరాఖండ్‌ను, కేరళను ఇప్పటికి దైవభూమి అని సంబోధించడం తెలిసిందే! మనం నమ్మే భాగవతంలో పాలసముద్రంపై మహావిష్ణువు ఆదిశేషునిపై పవలించగా, లక్ష్మీదేవి ఆయనకు సపర్యలు చేస్తున్నట్లుగా ప్రతీకలుంటాయి. దీన్నిబట్టి ఈ ప్రతీకల సృష్టికర్తలెవరో ఊహించవచ్చు!

ఇక శాస్త్రీయంగా సముద్రాల గూర్చి, వాటి జీవరాశి గూర్చి, సంపదలగూర్చి గత శతాబ్దంలోనే మొదలైనా, క్రీ.పూ. నుంచే వీటి గూర్చిన అనేక కథనాలు ప్రపంచ వ్యాపితంగా వున్నాయి. ఈ నమ్మకాలన్నీ ఆయా ప్రాంతాల మతాల సృష్టి అని తెలిసిందే! అవేకాలాల్లో గతితార్కిక ఆలోచనలు, పరిశీలనలు, వాస్తవాలు కూడా ముందుకు రావడం, వీటిని మతం అడ్డుకోవడం, మరణశిక్షల్ని విధించడం కూడా జరిగేది. (ఈ అంశాల్ని తర్వాత కథనాల్లో చూద్దాం!) మతం ఎంతగా అడ్డుకట్టలు వేసినా, జరగాల్సిన అభివృద్ధి, సాంకేతికత, శాస్త్రీయ ఆలోచనలు ఉవ్వెత్తుగా ఎగిసిపడుతూ నేటి ప్రపంచావిష్కరణకు కారణమయ్యాయి. అదే విధంగా సముద్రమథనం యాంత్రీకరింబడింది. అప్పటిదాకా ఉపరితలానికే పరిమితమైన సముద్రయానాలు, లోపలి భాగాల్లో ప్రయాణించడం, లోతుల్ని, అడుగుల్ని తడమడం మొదలైంది. దీంతో సముద్రాల లోతట్టు గూర్చి, అక్కడ ఆవాసముండే అశేష జీవరాశి ఉనికి, ఇతర సముద్ర సంపదలు మానవుడి కంటపడ్డాయి. ఇలా మొదలైన పరిశోధనలు, ఒకవైపు అభివృద్ధికరంగా వుంటూనే, మరోవైపు సముద్ర జీవరాశికి ప్రాణసంకటంగా మారాయి. ఇప్పుడు సముద్రాల్లోని కొన్ని జలచరాల అంతరాత్మను తట్టిచూద్దాం!




**జాస్ (Jaws) ఓ అభూతకల్పన:**

1975లో వచ్చిన హాలివుడ్ థ్రిల్లర్ చిత్రం జాస్‌ను చాలామంది చూసే వుంటారు. 1974లో పీటర్ బెంచ్లీ (Peter Benchley) రాసిన ఓ కల్పితగాథ ఆధారంగా స్టీవెన్ స్పీల్‌బర్గ్ (Steven Spelling) తీసిన ఈ చిత్రం ప్రపంచవ్యాపితంగా డాలర్ల వర్షాన్ని కురిపించింది. ఈ చిత్రం మా సొరచేపల (sharks) గూర్చి మానవుల్లో ఓ తప్పుడు అభిప్రాయాన్ని కల్గించింది. ఆ కథ మీ అందరికి తెలిసిందే అయినా, మరోసారి చూద్దాం! సరదాలకోసం మానవులు విహారయాత్రలు చేయడం, వేసవి విడిదులంటూ, సముద్రతీరాలంటూ తిరగాడడం తెలిసిందే! దీన్ని మేం తప్పుపడడం లేదుకాని, ఆయా ప్రాంతాల్లోని మానవేతర ఆవాసాల్ని మీ స్వంత జాగీర్లుగా వాడుకొని, పర్యావరణానికి, ఇతర జీవరాశికి విఘాతం కల్గిస్తున్నది కూడా వాస్తవమే! ఈ విషయాల్ని స్వయాన పర్యావరణ అభిమానులు ఎప్పటికప్పుడు బాహ్యప్రపంచానికి చెపుతూనే వున్నారు. పాశ్చాత్య దేశవాసులు సముద్రతీరాల్ని తమ స్వంత ఆవాసాలుగా చేసుకోవడంతో, తీరాలవెంట మా ఉనికికే ప్రమాదంగా మారింది. అలా ఓ సముద్రతీరంలో మా జాతిలోని ఓ తెల్లసొరచేప, విహారానికి వచ్చిన ఓ మహిళను కాకతాళీయంగా ప్రాణరక్షణకై దాడి చేయగా, ఆమె చనిపోయింది. ఇదో పాశవిక హత్యగా భావించి, ఆ సొరచేపను వెంటాడి, వేటాడి చంపడమే జాస్ (Jaws) సినిమా కథాకామీషు. అయితే, ఇది చూడడానికి వినడానికి భాగానే వున్నా, ఆ సినిమా తర్వాత వచ్చిన సీక్వెల్, మా సొరచేపలు అత్యంత భయానకరమైనవిగా, మనుషుల్ని వేటాడే జీవులుగా (మేం భూమిపైకి రాకున్నా), క్రూర మృగంగా చిత్రీకరించి, మాపైన దురభిప్రాయాన్ని కల్గించడమే ఓ బాధాకరం. ఈ కల్పితాన్ని 'తప్పుగా' ఏ జంతు ప్రేమికులు, పర్యావరణవేత్తలు ప్రశ్నించక పోవడం మరింత బాధాకరం కాదా...

నిజానికి మేమేకాదు, మీరు క్రూరమృగాలుగా (beast & monster etc.) ముద్రవేసిన పులులు, సింహాలు, ఇతర అడవి జంతువులు, విషసర్పాలు, తదితర ఏ జంతువులు మీ మానవులకన్నా క్రూరమైనవి కాదనేది అనేక సందర్భాలలో నిరూపించబడినా, మాపైన మీ ప్రభావం అలాగే కొనసాగుతున్నది. ఈ సందర్భంగా మరో ఉదాహరణను కూడా చూద్దాం! 1976లో ఒడియా కథ ఆధారంగా మృణాల్‌సేన్ తీసిన 'మృగయా' చిత్రాన్ని చూద్దాం! 1930 నాటి కథగా, స్థానిక ఆదివాసులకు, భూస్వాములకు మధ్యన దోపిడి, హింసను ప్రతిబింబించే ఈ చిత్రం మానవాళికి జంతువులపై ఎంతటి కపట ప్రేమో తెలుపుతుంది. నాటి బ్రిటీషు దొరలకు స్థానిక ఆదివాసి యువకుడు (మిథున్ చక్రవర్తి) అటవి జంతువుల్ని (పులి) చంపి కానుకగా ఇస్తే, ఆ అధికారి ప్రోత్సహించి అభిమానిస్తాడు. కాని, స్థానిక ఆదివాసుల పట్ల, మహిళల పట్ల, పులిలా వేటసాగించి, అనుభవించే ఓ భూస్వామి కూడా పులిలాంటి వాడని ఆ యువకుడు భావించి ఓ రోజు ఆ భూస్వామిని అంతమొందించి, బ్రిటీషు అధికారికి కానుకగా ఇస్తాడు. దీనికి బ్రిటీషు అధికారి భయకంపితుడై, యువకున్ని ఉరితీయిస్తాడు. నేటి సమాజానికి ఇది సబబే అని తోస్తుంది. న్యాయమే అనిపిస్తుంది. ఎందుకంటే చట్టాలు ఓ వర్గ ప్రయోజనాల్ని కాపాడడానికే కాబట్టి, ఉరే సరైందని భావిస్తారు.

కానీ, ఏ ఒక్కరికి పులిని చంపడం కూడా మనిషిని



వేల్ షార్క్



బ్లూ షార్క్

మట్టుబెట్టినట్లేననే ఆలోచనరాదు. నేటికి ప్రపంచ వ్యాపితంగా జంతువుల్ని వేటాడినందుకు (సరదాకు/వీరోచితానికి) ఒక్కరంటే ఒక్కరికి ఉరిశిక్ష కాదుగదా, కనీస జైలుశిక్ష పడలేదు. కండలు వీరుడు సల్మాన్‌ఖాన్ లేడిపిల్లల్ని వేటాడి చంపినా, ఆయన కండలు మరింతగానే పెరిగాయి. ఇప్పుడేవో చట్టాలున్నాయిగాని, అవి ఎంతమేరకు పనిచేస్తున్నాయో జగమెరిగిన సత్యమే!

**మా shark గూర్చిన నిజాలు:**

మా జీవన విధానంపై పరిశోధన చేసిన బెంగళూర్‌కు చెందిన గజ ఈతగాడైన వండిట్ కాలియా మాటల్లోనే వినాలి! ఈయన అండమాన్ నికోబార్ కేంద్రంగా సముద్రలోతుల్ని ఈదడానికి (swim) శిక్షణా శిబిరాన్ని నడుపుతున్నాడు.

"......సొరచేపలు 90 మిలియన్ సం॥ క్రితమే బాగా అభివృద్ధి చెందిన జీవులుగా గుర్తింపు పొందాయి. మానవుడి అభివృద్ధి క్రమం కేవలం రెండు లక్షల సంవత్సరాలే! అదీ, ఆధునిక మానవుని పరిణామం 40 వేల సంవత్సరాల కాలమే! ఆహారపు గొలుసులో, భూచరాల్లో సింహంలా పై స్థాయిలో వుండే సొరచేపలు వాస్తవంగా బిడియపు (shy) జీవులు. వాటికన్నా పెద్ద ఆకారం గల జీవులు తారసపడితే అవి తప్పుకొని పక్కకు పోతాయి. చివరికి సముద్రలోతుల్లో ఈదే మానవుల ఈత పరికరాల్ని భారీవిగా భావించి దూరంగా పోతాయి. తెలివిలో, బుద్ధి కుశలతలో డాల్ఫిన్లతో సమానంగా వుండే షార్క్‌లు మానవులకు మించిన మానవీయతను కలిగిన జీవులు. ఇలాంటి సాధుజంతువులను ప్రపంచ వ్యాపితంగా మానవులు సరదాకోసం, ఆహారం కోసం వీటి నుంచి లభించే నూనేకోసం చంపడం జరుగుతూనే వున్నది. అవికాకుండా, ఈ చేపలచే మానవులకు ఏదైనా జరుగుతే, జాస్ సినిమా తిరిగి పునరావృత్తమే అవుతున్నది. దీనితో వీటి సంఖ్య రోజురోజుకు క్షీణిస్తూ వుండగా, వీటి మందకోడి సంతానోత్పత్తి విధానం కూడా వీటి సంఖ్య తగ్గడానికి ప్రధాన కారణం!.."

**మేమెన్ని రకాలో:**

అతి పురాతన జాతిగా, డైనోసార్స్ కాలం నాటివిగా చెప్పబడే మా జాతిలో 500 రకాలకు పైగా వున్నట్లు అంచనా. ప్రపంచ వ్యాపిత సముద్రాల్లో మా జాతులు సుమారు ఒక బిలియన్‌కు పైగా ఉన్నట్లుగా కథనాలు. మీ మానవులు, మా ఆకారాన్ని బట్టి, రంగును బట్టి మాకు పేర్లు పెట్టారు. ఇందులో కొన్ని ముఖ్యమైనవి.

1. గ్రేట్ వైట్ షార్క్స్
2. హామర్‌హెడ్ షార్క్స్
3. టైగర్ షార్క్స్
4. వేల్ షార్క్స్
5. బాస్కింగ్ షార్క్
6. నర్స్ షార్క్
7. బ్లూ షార్క్
8. లియోపార్డ్ షార్క్
9. జీబ్రా షార్క్స్
10. బుల్ షార్క్

వ్యక్తిగతంగా మా జాతి చేపలకు ఎలాంటి బొక్కలు (bones) వుండక, ఒక్కో జాతి సొరచేపకు ఒక్కోతీరు పంటివరుస వుండడం మా ప్రత్యేకత. మా చర్మం గరుకుగా (sandpaper) వుండడం కూడా మాకు ప్రాణ సంకటంగా మారింది. మరో విచిత్రమేంటంటే, మా జీవి రెండు రకాల ప్రత్యుత్పత్తి విధానాన్ని కలిగి వుంటాయి. కొన్ని జాతులు గుడ్లను పెట్టి (oviparous) సంతానోత్పత్తిని జరుపుకుంటే, మరికొన్ని నేరుగా పిల్లల్ని కని (viviparous) వదిలేస్తాయి. 16వ శతాబ్దపు చివరిదాకా, మమ్మల్ని సముద్ర కుక్కలని కూడా అనుకునేవారు.

**వైవిధ్యభరిత ఆకృతి:**

ఇతర జంతువుల్లా మా ఆకృతి ఒకేతీరుగా కాకుండా, విభిన్న ఆకృతుల్ని కలిగివుంటాయి. మా ఆకృతిని బట్టి మాకు మీరు పేర్లు పెట్టారు కూడా! తిమింగలానికి (nobrask) సుమారు 4-10 రెట్ల బరువుతో మాలోని కొన్ని జాతులుండగా, అతిచిన్న సొరచేప లాంత్రెన్ షార్క్ (lantern shark) సుమారు ఏడు అంగుళాలకు మించకపోవడం గమనార్హం.

భూమిపై, సముద్రాల్లో ఉండే అన్ని జంతువులకన్నా, మేమే అత్యంత పెద్ద జంతువులు కావడం మాకు గర్వకారణమే! మాలోని రెండు ప్రధాన రకాల పొడవు, బరువు చూడండి.

**బ్లూషార్క్** – సుమారు 30 మీటర్ల పొడవుతో 80టన్నుల బరువుతో అనగా– 40 ఏనుగులతో, 2700 మంది మనుషుల బరువుతో సమానముగా వుంటుంది.

**వేల్‌షార్క్** – బ్లూషార్క్ కన్నా కొంచెం తక్కువ పరిమాణం కలిగి వుంటుంది.

**లోతట్టు సముద్రాలే మా ఆవాసం:**

మా ఆకృతిని బట్టి మా తిరుగాడే ప్రాంతం వుంటుంది. సుమారు తీరాన్నుంచి 50–60 కి.మీ. లోతుల్లో మేం నడయాడగా, మేం తీరప్రాంత జంతువులుగా భావించి మమ్మల్ని వేటాడం జరుగుతున్నది. చెప్పడానికి మాకు పులులతో సమాన హోదాను ఇచ్చినా, మాకోసం రక్షణ సముద్రం (protected area) లేదు. మా వృంతాల (fins)తో తయారయ్యే సూపుకు విపరీతమైన డిమాండ్ ఉండడంతో, ఒక్క

## సముద్రాల్ని సారవంతం చేసే సముద్ర మొక్కలు

సృష్టిలో ఒక్క మానవుడు తప్ప మిగతా జీవరాశి అంతా సృష్టికి, ప్రకృతికి దోహదకారులే! మానవులు దీన్ని జీర్ణించుకో లేకున్నా ఇది వాస్తవం. సముద్ర ఆల్గే (algae)గా పిలవబడే సముద్ర మొక్కలు (seaweed) అనేక జాతుల్ని కలిగి ఉంటుంది. కేవలం భారతదేశ తీరప్రాంతాల్లో ఈ జాతి సుమారు 600 రకాలున్నట్లుగా అంచనా!

ఈ రకం ఆల్గే సముద్ర జలాలనుంచి పోషకాల్ని గ్రహించి నిలువచేయడంతో భూమిపై అత్యంత పోషక విలువ గల జాతిగా వీటికి పేరుంది. జెల్స్ (gels), అగార్-అగార్ (agar-agar), అల్జినేట్స్(alginates) లాంటి రకాల్ని ఆహారంగా, మందుల తయారీలో, టూత్‌పేస్టుల్లో (carrageenan), పాల పదార్థాల (dairy), ఎరువుల తయారీలలో విరివిగా వాడుతారు. జీవరాశి ఉపయోగించే అన్ని రకాల ఆహార పదార్థాలకన్నా అత్యంత తక్కువ కార్బన్ గల ఆహారం ఈ ఆల్గేలే! దీనికి కారణం సముద్ర జలాల్లోకి చేరిన కార్బన్‌ను సముద్ర అడుగు భాగానికి ఇవి చేర్చుతాయి. సముద్ర జీవులన్నీ దాదాపుగా ఈ ఆల్గేను ఆహారంగా తీసుకుంటాయి. కాబట్టి, సముద్ర జీవుల్లో అతి తక్కువ కార్బన్ వుంటుంది. ఇందులో ప్లాంక్‌టోనిక్ ఆల్గే (planktonic algae) 50 శాతం భూగోళపు ఆక్సిజన్‌ను అందిస్తుంది.



*సముద్రపాచి (seaweed)*

అన్నింటికి మించి మనుషుల్లో, జంతువుల్లో అయోడిని అందించే మంచి ఆహారం! అందుకే, అయోడిన్ లోపం వున్నవాళ్ళు సముద్ర లభ్యత ఆహారాన్ని తినాలని నానుడి. ఎలాంటి పంట విధానం లేకుండా, సముద్రాల్లో పెరిగే ఈ ఆల్గే కూడా, రసాయన కలుషితాలలో, పర్యావరణ కాలుష్యాలతో దెబ్బ తింటున్నట్లు పరిశోధనలు తెలుపు తున్నాయి. ఇది ఇలాగే కొనసాగితే మనుషులకే కాదు, ఇతర జంతువులకు కూడా తీవ్రమైన ఆహారపు కొరత ఏర్పడుతుంది. కనీసం ఇప్పుడన్న ఆలోచిద్దాం!



టైగర్ షార్క్



హామర్ షార్క్



జీబ్రా షార్క్

వృంతం ధర సుమారుగా 57,000 డాలర్లు పలుకుతుంది. అంటే మీకు నమ్మకం కుదరకపోవచ్చు. ఇది అమెరికా, ఇతర పశ్చిమ దేశాల్లో మా సూపు ధర చూస్తే తెలుస్తుంది.

మా చర్మం గరుకుగా వుండడంతో దంతాల (ivory), కర్ర (wood) పాలిషింగ్‌కు sandpaper గా వాడతారు. మా మాంసం రుచికరమే! మా నుంచి లభించే నూనెను తోలు పరిశ్రమలలో వాడుతారు. ఇన్ని రకాల ఉపయోగాలచేత, మేము నిత్యం వేటాడుబడుతున్నాం. అధికారిక లెక్కల ప్రకారమే, సంవత్సరానికి వందమిలియన్ల సొరచేపలు వేటాడబడుతున్నాయట!

ఈ విధంగా నిత్యవేటలో ఇనుప వలల్లో చిక్కుకొని, పెద్ద పెద్ద ఓడల తాకిడికి గురై ప్రపంచ వ్యాపితంగా నిత్యం వేలాదిగా అసువులు కోల్పోవడంతో, మాజాతిని శీఘ్రంగా అంతరించుతున్న, అపాయకర, కొన్ని జాతులనైతే అంతరించిన జాబితాలో (IUCN) చేర్చింది తెలిసిందే. ఆ సంస్థ ప్రచురించే రెడ్‌లిస్టు (Red list) లో మేం పై స్థాయిలో వున్నాం. పరిస్థితి ఇలాగే కొనసాగితే, రాబోయే దశాబ్దకాలంలోనే డైనోసార్స్ పక్కన మేం చేరిపోతాం! ఎంచక్కా మా నమూనాల్ని (models) మీరు మీ పిల్లల పార్కుల్లో ఏర్పాటు చేసి, మా గూర్చిన గొప్పలు చెప్పుకోవచ్చు! చందాలు వసూలు చేసి దందాలు చేసుకోవచ్చు! నిస్సారమైన సముద్రాల్లో ఆవాసాల్ని ఏర్పర్చుకొని మహదానందం పొందవచ్చు!.

ఇంకేంటి... మీమీ ప్రణాళికల్ని సిద్ధం చేసుకొండి!

(హెమ్మింగ్‌వే రాసిన నవల The Old man & the Sea పుల్జిర్, నోబెల్ బహుతి పొందింది. ఇందులో షార్క్‌లను వేటాడే విధానం, శాంటియాగో (హీరో) వీటిని ఎలా చంపుతాడో తెలుస్తుంది.)

*(వచ్చే సంచికలో మరికొన్ని సముద్ర జంతువుల గూర్చి చూద్దాం!)*

**– డా॥ లచ్చయ్య గాండ్ల,**

m : 9440116162

e : drglachaiah@gmail.com

# ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా – కొన్ని స్థల నామాలు

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాను ఎదులాపురం, ఎడ్లపురం'గా పిలిచే వారట. తొలి తెలుగు యాత్రా చరిత్ర రాసిన ఏనుగుల వీరస్వామి తన కాశీ యాత్ర చరిత్రలో ఎదులాబాద్ గానే ప్రస్తావించాడు. ఈ ప్రాంతాన్ని పరిపాలించిన బీజాపూర్ సుల్తాన్ మహమ్మద్ ఆదిల్ షా పేరు మీదుగా ఆదిల్ షా బాద్ గా ఏర్పడి క్రమంగా ఆదిలాబాద్‌గా పరిణామం చెందిందని చారిత్రక కథన మున్నది. 2011 జనాభా లెక్కల ప్రకారం అయిదు రెవిన్యూ డివిజన్‌లుగా, యాభై రెండు మండలాలుగా, మొత్తం 1725 రెవిన్యూ గ్రామాలున్నవి. 2016లో జిల్లాల పునర్విభజన జరిగినప్పుడు. ఆదిలాబాద్, మంచిర్యాల, నిర్మల్, కుమ్రంభీం ఆసిఫాబాద్ అను నాలుగు జిల్లాలుగా ఏర్పడింది. ఆదివాసులు ఆరాధ్య దైవం కుమ్రంభీం జన్మించిన ప్రాంతం కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా. గోండులకు రాజధానిగా ఉండేది. నిర్మల్ ప్రాంతం నిమ్మ నాయుడు పరిపాలనా ప్రభావంతో నిర్మల్ అను పేరు స్థిరపడింది. పొనికి చెక్కలతో తయారుచేసే కొయ్య బొమ్మలకు ప్రసిద్ధి. మంచిర్యాల అను పేరును చారిత్రకంగా మంచిరేవుల అని కూడా పిలుస్తారు.



ఈ ప్రాంతాన్ని మౌర్యులు, శుంగులు, శాతవాహనులు, వాకాటకులు, విష్ణుకుండినులు, బాదామీ చాళుక్యులు, రాష్ట్రకూటులు, వేములవాడ చాళుక్యులు, కళ్యాణి చాళుక్యులు, కాకతీయులు, దేవగిరి యాదవ రాజులు, గోండురాజులు, నిజాంషాహీ, హైమద్ షాహీ, కుతుబ్ షాహీ, అసఫ్ జాహీలు పరిపాలించారు. పచ్చదనానికి ప్రతీకగా కొండలు, కోనలు నిత్యం కొత్త శోభతో అలరారుతూ గిరిజన జీవన సంస్కృతిని ప్రతిబింబిస్తాయి. గోదావరి,ప్రాణహిత, వార్ధా, పెన్ గంగ,కడెం,స్వర్ణ, పెద్దవాగు, సాత్నాల, వట్టివాగు వంటి నదీనదములు ప్రకృతి రమణీయతను పెంచుతాయి. చెన్నూరు,నిర్మల్ కోదూరు,ఉట్నూరు, భైంసా, కుబీర్, కర్నమామిడి,సిర్పూర్, తాండూర్, ఆసిఫాబాద్ ప్రాంతాలలో స్థల,గిరి దుర్గాలున్నవి. బాసర సరస్వతి ఆలయం, కేస్లాపూర్ నాగోబా గుడి, జైనథ్ లక్ష్మీనారాయణ ఆలయం, వాంకిడి శివకేశవాలయం, నిర్మల్, పొన్కల్ సూర్జాపూర్, గంగాపూర్ వంటి అనేక ప్రాంతాలలో వివిధ ఆలయాలున్నవి.

**ఎల్.మడుగు:** ఆదిలాబాద్ జిల్లా శివ్వారం గ్రామ శివారులో గుహలో తొలిచిన లంజగుళ్ళు కనిపిస్తాయి. ఈ గుళ్ళకు అభిముఖంగా గోదావరి కుడి ఒడ్డున ఖానాపూర్ శివారులో కొన్ని శిల్పాలు కనపడతాయి. ఆ గుళ్ళ కింద విశాలమైన ఎల్. మడుగు (లంజమడుగు) ఏర్పడింది. "వజ్రాయన బౌద్ధంలో భిక్షుకులు ఆచరించిన తాంత్రిక అభ్యాసంలో స్త్రీలను చేర్చుకోవడం వలన, మైథున తంత్రాల వల్ల బౌద్ధాన్ని ఆనాటి సమాజం బూతు పదాలతో అభిశంసించింది. నాటి బౌద్ధుల ఆరాధనాస్థలాలను లంజగుళ్ళు అని, ఆ ప్రదేశపు నీటిమడుగును ఎల్.మడుగు (లంజమడుగు)"అని పిలిచారని (ప్రముఖ చరిత్రకారులు శ్రీరామోజు హరగోపాల్ గారు తెలిపారు)

**కుంటాల:** నేరడిగొండ మండలం కేంద్రానికి 12 కిలోమీటర్ల దూరంలో ఉన్నది. తెలంగాణ రాష్ట్రంలో అతి ఎత్తైన జలపాతమిది. ఉత్తర సహ్యాద్రి పర్వతశ్రేణుల్లో ఎత్తైన కొండల నడుమ కడెం నదిపై ఉన్నది. పూర్వం శకుంతలా, దుష్యంతుల కథలోని శకుంతల ఇక్కడ నివాసం ఉండటం వలన ఈ ప్రాంతాన్ని కుంతల' అని పిలిచేవారట. పరిణామ క్రమంలో కుంటాల మారిందన్న స్థల పురాణమున్నది.


**కేస్లాపూర్:** ఇంద్రవెల్లి మండలం లోనిది. ఈ గ్రామంలో గోండు గిరిజన తెగవారు ప్రతి సంవత్సరం పుష్య మాసంలో బహుళ అమావాస్య రోజున నాగోబా జాతర జరుపుకుంటారు. 1940లో ప్రొఫెసర్ హైమన్ డార్ఫ్ అనే గిరిజన స్కాలర్ నాగోబా జాతర సందర్భంగా గోండు దర్బార్ నిర్వహించడానికి కలెక్టర్ ని ఆహ్వానించి గిరిజన సమస్యలను విన్నవించుకునే సంప్రదాయాన్ని ప్రారంభించాడు.

**గాడిదగుండం:** నేరడిగొండలోని దట్టమైన అడవుల మధ్యలో ఉన్న జలపాతమిది. దీనికి మొక్కుడుగుండం, ముక్కడి గుండం అనే పేర్లు కూడా ఉన్నాయి. గాడిలో నుంచి దుంకుతుంది కాబట్టి గాడిదగుండం అని అంటారు.

**జలపాతాలు:** ఇచ్చోడ బజార్హత్నూర్ దారి మధ్యలో కడెం నది దగ్గర మూడు జలపాతాలు ఉన్నవి. అవి మొదటిది కనకాయి జలపాతం. స్థానిక ప్రజలు ఈ జలపాతాన్ని కనకాయి గుండంగా పిలుస్తారు. రెండవది గొలుసుల జలపాతం. ఇది గొలుసుల ఆకారంలోనే ఉంటుంది. దక్షిణాన సాకేరి గ్రామం నుంచి వస్తున్న వాగు కడెం నదిలో కలిసే చోట ఈ జలపాతం ఏర్పడింది. మూడవది చీకటి గుండం. చీకట్లో ఏమీ కనబడనట్లే ఈ జలపాతం కూడా కనబడదట. నిర్మల్ నుండి ముప్పై ఏడు కిలోమీటర్ల దూరంలో స్ఫటికమంత స్వచ్ఛంగా పారే పొచ్చెర జలపాతం ఇరవై అడుగుల ఎత్తుమీది నుండి పారుతుంది.

**బాసర:** ఇక్కడ సరస్వతీ దేవాలయం ప్రధానమైనది.





భాషలకతీతంగా, రాష్ట్రాలకతీతంగా వెలసిన పుణ్య క్షేత్రం. జ్ఞానానికి, కీర్తికి ప్రతీక అయిన బాసర సరస్వతీ దేవిని జ్ఞాన సరస్వతీ దేవిగా భక్తితో పిలుచుకుంటారు. ఇక్కడ వ్యాసుడు నివసించిన కారణంగా వ్యాసపురం ఏర్పడి, అనంతరం వాసర'గా మారిందని శాసనస్త ఆధారమున్నది. క్రీస్తుశకం పదో శతాబ్దం నాటి పశ్చిమ చాళుక్యులకు సమకాలీకమైన శాసనంలో "స్వస్తిశ్రీ వ్యాసాపురద మహారాజా" అని రాసి ఉంది. వ్యాసపుర బాసరగా మారి ఉండవచ్చు ఈ క్షేత్రం వ్యాసుని గాథను బట్టి, ఇక్కడి గోదావరి తీరాన 3000 సంవత్సరాల క్రితవే వెలిసిన గ్రామంగా స్పష్టమవుతున్నది. (పూత గోదావరి పుష్కర విశిష్టతబీ డా.సంగనభట్ల నరసయ్య, పుట.44) "బాసర నిజానికి ఒక ఊరు కాదు ఐదు గ్రామాల సముదాయం. అవి బాసర, రేణుకాపురం, మహదాపురం, రత్నాపురం, మయిలాపురం. ప్రస్తుతం బాసర, మయిలాపురం మాత్రమే ఉన్నాయి. మిగిలినవి రెవెన్యూ రికార్డుల్లో మాత్రవే ఉన్నాయి. బాసరలో జ్ఞాన సరస్వతిని వ్యాసుడు ప్రతిష్టించినట్లు చెప్పబడుతున్నది. కానీ ఈ ప్రాంతాన్ని ఒకప్పుడు పాలించిన కురిక్యాల చోళ రాజైన రెండవ బిజ్జల దేవుడే ఇక్కడ ఆలయాలు నిర్మించాడని చరిత్రకారుల అభిప్రాయం. తాను జైనుడు. అతని బావ వీరశైవ ప్రవక్త బసవేశ్వరుడు. వారి కాలంలో వీరశైవ ప్రాబల్యం వల్ల జరిగిన జైనం, శైవాల సంఘర్షణలకు దర్పణంగా ఉంది బాసర. బాసరలోని నల్ల హనుమాన్ గుడి జైన శాసనంలో జైన గురువుకు ధారాపూర్వకంగా దానమిచ్చినట్లుగా పేర్కొనబడింది. జైన బసదుల నుంచే బాసర పేరు వచ్చింది బసదే కాలక్రమాన బాసరగా మారిపోయింది." (తెలంగాణ చరిత్ర తవ్వల్లో, శ్రీరామోజు హరగోపాల్, పుట.171-174)

**సిర్పూర్:** దేశంలోనే మొట్ట మొదటి గోండు రాజ్య సంస్థానంగా వెలిసిన ప్రాంతమిది. తెలంగాణ కాశ్మీర్ గా కూడా పిలుస్తారు. దీనిని పూర్వం సూర్యాపురం'గా కూడా పిలిచేవారట.

**ముగింపు:** జిల్లాలోని అనేక స్థల నామాలలో అదెగావ్, డాంగర్గావ్, తక్లి, తోంతాల, దహెగావ్, పిప్పల్ గావ్, బత్తి సావర్ గావ్, బేల్గావ్, బోరెగావ్, లేఖర్వాడి, వాడగావ్, వాంకిడి, సింగన్గావ్, సుంకిడి, వంటి గ్రామ నామాలు మరాఠీ సంస్కృతిని చూపెడుతున్నవి. ధర్మపురి, దుర్గాపూర్, రాంలింగంపేట్, నారాయణపూర్ (తెలంగాణ ప్రాంత సంస్కృతి)రాంపూర్, లచ్చింపూర్(గిరిజన సంస్కృతి) చించోళి (కన్నడ) నిజాంపూర్, సయ్యద్ పూర్ (ఉర్దూ) వంటి అనేక రూపాలున్నవి. జిల్లాకు ఉత్తరం వైపు హిందీ భాషా సాంస్కృతి కనపడుతుండగా, పశ్చిమం వైపు మరాఠా సంస్కృతి అధికంగా ఉంటుంది. ఆయా నామాలలో చెన్నూరు-చెన్నుపురం (పంచకోశ ఉత్తర వాహిని) భైంసా-మహిషా, రాయపట్నం-కప్ప రాయపట్నం, సోన్-స్వర్ణ అనే ప్రత్యేక రూపాలు కనబడుతవి.

-డా. మండల స్వామి
m : 9177607603
e : mandala.smy@gmail.com



# ఆయిల్ ఫామ్ పై సందేహాలు - సమాధానాలు

తెలంగాణ రాష్ట్రంలో ఆయిల్ పామ్ తోటలను ఎక్కువ ఎకరాలలో రైతులు సాగు చేయాలని, ఆయిల్ పామ్ సాగు రైతులకు ఎంతో లాభదాయకమని జాతీయ ఆయిల్ పామ్ పరిశోధన సంస్థ శాస్త్రవేత్త రామచంద్రుడు తెలిపారు. సిద్దిపేట జిల్లాలో వ్యవసాయ, ఉద్యాన శాఖ, ఆయిల్ ఫెడ్ ఆధ్వర్యంలో ఆయిల్ పామ్ రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ములుగులో ఏర్పాటు చేసిన ఆయిల్ పామ్ నర్సరీని సందర్శించారు. **రైతుల పలు సందేహాలకు సమాధానాలు** ఇచ్చారు.



**అబ్లషన్ (పూలగుత్తులను తొలగించుట) ఎప్పటివరకు కొనసాగించాలి?**

పుష్పగుచ్చాలు మొక్క వయస్సు 12-14 నెలలు నుండి మొదలైన పూలగుత్తుల లేత మొగ్గ దశలోనే తుంచి వేయాలి. దీనిని అబ్లేషన్ అంటారు. పూలగుత్తులు లేత దశలో చేతితో లేదా ఒక ప్రత్యేకమైన పరికరం ఉంటుంది. దీనిని అబ్లేషన్ పరికరం (త్రిశూలం ఆకారంలో) అంటారు. ఈ పరికరంతో తీయవచ్చు. 30 నెలల వయస్సు నిండేవరకు కొనసాగించాలి. అబ్లేషన్ వల్ల ఆకు ఉత్పత్తి, చెట్టు కైవారం, ఎత్తు, లావు మరియు విస్తారమైన వేరు వ్యవస్థ చెట్టు అన్ని పరిస్థితులలో తట్టుకునే శక్తిని ఇస్తుంది.

**ఆయిల్‌పామ్‌లో సాగునీటి యాజమాన్య పద్ధతులను వివరించండి?**

ఆయిల్‌పామ్ పంట ఎక్కువ దిగుబడిని ఇచ్చుటకు సమృద్ధిగా సాగునీరు అవసరం. నీటికొరత ఆకుల ఉత్పత్తి తగ్గిపోవుటకు, పెరుగుదల సన్నగిల్లటకు, ఎక్కువ మగ గెలలు రావటానికి, తద్వారా దిగుబడి తగ్గిపోవటానికి కారణం అవుతుంది. బిందుసేద్య పద్ధతిలో ఒక్కొక్క పాదులో కనీసం (04) బిందు పరికరాలను, తుంపర సేద్యమైనట్లయితే (02) తుంపర పరికరాల్ని మొక్కకి ఇరువైపుల వచ్చేటట్లు అమర్చుకోవలి. మొక్కకి సహజంగా 200-250 లీటర్లు / రోజుకి, వేసవిలో 300-350 లీటర్లు నీరు అందించాలి. అంటే రోజు కనీసం 2-3 గంటలు డ్రిప్ నడిపించాలి.

**మొవ్వు కుళ్ళు తెగులు ఎలా గుర్తించాలి. నివారణ తెలపగలరు?**

మొవ్వు ఆకు మొదలులోని కణజాలం పూర్తిగా కుళ్ళడం వలన మొవ్వు ఆకును లాగినప్పుడు సులభంగా ఊడి వస్తుంది. కుళ్ళిన మొవ్వు నుండి దుర్వాసన వస్తుంది. ఆకులు మొవ్వు భాగం పై నుండి క్రిందకు ఎండిపోతాయి. దీని నివారణకు తుంపర పరికరాలను దూరంగా అమర్చుకోవాలి. బావిస్టిన్ 1.5 గ్రామ్/లీ నీటికి గాని లాండా 1 గ్రా/లీటరు నీటికి కలిపి మొవ్వు భాగంలో పోసుకోవాలి.

**ఎలుకల నివారణ పద్ధతులను తెలుపగలరు?**

జింక్ ఫాస్పైడ్, అల్యూమినియం ఫాస్పైడ్ బిళ్లలను ఎలుక కన్నములలో వేసి తడిమట్టితో కన్నాలను మూసి వేయాలి. వివిధ రకాలైన ఎలుక బోనులను ఉపయోగించవచ్చు.

**కలుపు మొక్కలను ఏ విధంగా నిర్మూలించాలి?**

చేతితో లేదా సిఫారసు చేసిన కలుపు మందులతో గాని క్రమంగా కలుపు మొక్కలను నిర్మూలించాలి. బ్రస్‌కట్టర్ ద్వారా, మల్చింగ్ విధానంతో అంతరసేద్యం ద్వారా కలుపుని నివారించుకోవాలి.

**ఆయిల్‌పామ్ తోటలో దున్నే విధానంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు తెలుపగలరు?**

ఆయిల్ పామ్ పంటలో అంతర పంటలు చేపట్టే విధానంలో ఆకువిస్తరణ బయట భాగంలోనే దున్నటం చేపట్టాలి. ఎట్టి పరిస్థితుల్లో పాదు లోన భాగంలో దున్నటం చేపట్టరాదు. పాదు





అంతర భాగంలో దున్నటం చేయటం వల్ల వేరు వ్యవస్థ దెబ్బతిని ఎదుగుదలపై ప్రభావం చూపుతుంది.

**తెల్లదోమ నివారణను వివరించగలరు?**

ఒక మిల్లి లీటరు వేప నూనె (10,000 పిపిఎం) మరియు 04 గ్రా. రిన్ సర్ఫ్ పొడిని ఒక లీటరు నీటికి కలిపి తెల్లదోమ ఆశించిన 'ఆకుల క్రింద భాగం' బాగా తడిచేలా వారం వ్యవధిలో రెండుసార్లు పిచికారి చేయాలి.

**ఆకులు క్రింది భాగం నుండి పైకి ఎండిపోతున్నాయి. దీనికి నివారణ తెలుపగలరు?**

నీటి ముప్పునకు గురికానీయవద్దు. ఆరంభ దశలో వున్నప్పుడు బావిస్టిన్ 20 గ్రా. 100 ఎం.ఎల్ నీటికి కలిపి కుళ్లిన కణాన్ని తొలగించి పూతగాపూసి మొక్కను రక్షించవచ్చు.



**పాదులు చేయు పద్ధతిని వివరించండి?**

మొదటి సంవత్సరము చెట్టు చుట్టూ 1 మీ. వ్యాసార్థతంతో పాదులను చెయ్యాలి. 2 సం॥ వయస్సులో 2 మీ. 3 సం॥ తరువాత 3 మీ. కి పెంచాలి.

**అంతరపంటలుగా ఏ పంటలు వేసుకోవచ్చు?**

ఏకవార్షిక పంటలను పండించవచ్చు. వరిని అంతర పంటగా వేయరాదు. కూరగాయలు, పత్తి, మొక్కజొన్న, పెసలు, మినుము, వేరుశనగ, బొబ్బర్లు వంటివి అంతరపంటలు వేసుకోవచ్చు. ఇవి మొదటి 3 సం॥ కాలములో ఆదాయం పొందవచ్చు.

**ఆయిల్‌పామ్ పంట నుండి ఎంత దిగుబడి ఆశించవచ్చు?**

మంచి యాజమాన్య పద్ధతులు పాటిస్తే 4-6 సం॥ తోటలో 20-24 గెలలు (బరువు 3-15 కిలోలు) వరకు వస్తుంది. ముదురు తోటల్లో గెలల సగటు బరువు 20-35 కిలోలు. 5-9 సం॥ తోటల్లో దిగుబడి 22-20 టన్నులు / హెక్టారుకు. 10 సం॥ పైబడిన తోటల్లో 25-30 ట/హె. వరకు దిగుబడి వస్తుంది.

**పచ్చిరొట్ట ఎరువలను గురించి తెలపగలరు?**

ఒకటి నుంచి మూడు సంవత్సరాల వయస్సుగల ఆయిల్‌పామ్ మొక్కల పాదులలో మూడు అడుగల దూరంలో, చుట్టూ రెండు వరసలు జనుము వేసి పూతదశ వరకు పెంచిన తరువాత చిన్న చిన్న ముక్కలుగా చేసి పాదులలో వేయాలి. వేసవి సమీపిస్తున్నందున 0-3 సం॥ వయస్సు తోట నిర్వాహకులు పచ్చిరొట్టె ఎరువులు వేసుకోవాలి. ఇలా చేయడం వలన వడగాలులకు తట్టుకొని పాదు పరిధిలో తేమశాతం పెరుగుతుంది.

**నల్లకొమ్ము పురుగు యాజమాన్యం గురించి తెలుపగలరు?**

ఆకుల చివర 'వి' ఆకారపు ఖాళీలు ఏర్పడుతాయి. ఆకుల మొదళ్ళమీద శాశ్వత రంధ్రాలు ఏర్పడి నమిలిన పిప్పి బయటికి కనబడుతూ ఉంటుంది. మొవ్వు భాగంలోని ఆకులు ఈ పురుగు బారిన పడినప్పుడు కురచగా, విరిగినవిగా మెళికలు తిరిగి కనిపిస్తే కొమ్ముపురుగు ఉధృతి ఉందని గుర్తించవచ్చు. దీని నివారణకు రంధ్రాలు ఉన్న చిన్న పాలిథీన్ సంచిలో 20 గ్రా. ఫోరేట్ గుళికలను వేసి మొవ్వులో పెట్టడం వలన వాసనకు దూరంగా పోతాయి. పులిసిన ఆముదపు పిండి లేదా లింగాకర్షక ఎరల ద్వారా పురుగులను నిర్మూలించవచ్చు.

ఈ కార్యక్రమంలో ఆయిల్ ఫెడ్ జనరల్ మేనేజర్ సుధాకర్‌రెడ్డి, ఎల్ల సోమిరెడ్డి, జిల్లా ఉద్యానశాఖ అధికారి సునీత, అధికారులు శంకర్, భాస్కర్‌రెడ్డి, వర్షరాంరెడ్డి, బాలాజీ, రైతులు రాఘవాపురం రాంగోపాల్, ప్రజ్ఞాపూర్ మణికొండ వేదకుమార్, శ్రీకాంత్‌రెడ్డి, సోమిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

– బాలారణ్య
ప్రజ్ఞాపూర్, గజ్వేల్



# రాగుల్లో పోషక విలువలు

చిరుధాన్యాల్లో పోషక విలువలు అధికంగానే ఉంటాయి. మరీ ముఖ్యంగా వీటిల్లో ఉండే విటమిన్ బీ-17 క్యాన్సర్ వంటి వ్యాధులను నిరోధిస్తుంది. అలాగే, పీచు పదార్థాలు అధిక మోతాదులో ఉండటం మూలంగా వీటిని తింటే ఊబకాయం తగ్గుతుంది. వీటిల్లో గ్లైసిమిక్ ఇండెక్స్ 55 శాతం కన్నా తక్కువగానే ఉంటుంది. కాల్షియం అధిక మోతాదులో ఉంటుంది. కాబట్టి చిరు ధాన్యాలను ఆహారంగా తీసుకోవడం వల్ల చక్కెర సంబంధిత వ్యాధులు, మోకాళ్ల నొప్పులు వంటివి రాకుండా ఉంటాయి.



అలాగే, మన శరీరానికి మరిన్ని ప్రయోజనాలు కల్పిస్తాయి. కాబట్టి చిరు ధాన్యాలకు మర్కెట్‌లో డిమాండ్ అధికంగానే ఉంటుంది. వీటిని సాగు చేసిన రైతులకు మంచి ఆదాయం వస్తుంది. ప్రస్తుతం చిరుధాన్యాలైన రాగులు సైతం అధిక పోషకాలు కలిగి ఉండటంతో వాణిజ్య పరంగా మార్కెట్‌లో వీటికి అధిక డిమాండ్ ఉంది. అలాంటి రాగులను ఎలా సాగు చేయాలో ఇప్పుడు తెలుసుకుందాం..

**రాగులను సాగు చేయు విధానం:**

రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ రాగులను సాగు చేస్తున్నారు. రాగులు దాదాపు అన్ని రకాల నేలల్లో సాగు చేయవచ్చు. అయితే, తేలిక రకం ఇసుక నేలలతో పాటు బరువు నేలల్లో రాగుల దిగుబడి మంచిగా వస్తుంది. అధికంగా నీరు నిల్వ ఉండే నేలల్లో రాగుల సాగుకు అనుకూలంగా ఉండవు. నేలను రెండు మూడు సార్లు దున్నుకోవాలి. ఒక ఎకరం పొలంలో 4 టన్నుల వరకు పశు వుల ఎరువులు వేసుకుంటే పంట మంచిగా వస్తుంది. మెత్తగా దున్నిన నారుమడి భూమిలో విత్తనాన్ని సమానంగా చల్లుకోవాలి.

ఆ తర్వాత చదును చేసే వాటితో నేలను చదును చేయాలి. ఇలా చేయడం వల్ల మొలక శాతం పెరుగుతుంది. మొక్కలు పెరగడానికి నీరు అందించాలి. ఎకరాకు నాలుగు కిలోల విత్తనం సరిపోతుంది. ఆ తర్వాత మనం సాగు చేస్తున్న రకాలకు అనుగుణంగా 20-30 రోజుల వ్యవధిలో పొలంలో నాటుకోవాలి. వరుసల మధ్య 10 నుంచి 15 సెంటీమీటర్ల దూరం ఉండాలి. నారు నాటే ముందు కలుపు మందులను పొలంలో పిచికారీ చేసుకుంటే కలుపు రాకుండా ఉంటుంది. దీంతో దిగుబడి పెరుగుతుంది. పంట పెరుగుదలకు అనుగుణంగా నత్రజని, డీఏపీ ఎరువులను వాడుకోవాలి. విత్తన రకాలను బట్టి కాలం సాధారణంగా 100 నుంచి 120 రోజుల వరకు ఉంటుంది.

– ఎస్. ధనుంజయ
దేవరకొండ

# నిత్య వసంతం




పిల్లలకు అత్యంత ఆనందానిచ్చేది ఆట బొమ్మలు.,కథల పుస్తకాలే. పాఠ్య పుస్తకాలు అందించే జ్ఞానానికి సమాంతరంగా మరెంతో లోకజ్ఞానాన్ని అందించేది బాల సాహిత్యమే. భాషకు సంబంధించిన ప్రాథమిక పరిజ్ఞానాన్ని అందించేవి కథలే. కొత్త కొత్త పదాలను పరిచయం చేసేది కథల పుస్తకాలే. పుస్తకాలు పిల్లల ఆలోచనా నైపుణ్యాలను పెంచుతాయి. వారి ఊహలకు ప్రాణం పోస్తాయి. వారిలో సృజనాత్మకతను పెంచుతాయి.

పిల్లలలో నైతికతను, సక్రమమైన ప్రవర్తనను, మంచి చెడుల అవగాహనను పెంచే బాధ్యతను ఉమ్మడి కుటుంబాల్లో నాయనమ్మలు, అమ్మమ్మలు చెప్పే కథలు నెరవేర్చేవి. మారిన పరిస్థితులలో ఆ బాధ్యతను బాల సాహిత్యమే నెరవేర్చగలదు.

ఈ మే నెలలో బాలచెలిమి పర్యావరణ కథల పోటీలు – 2023 నిర్వహించింది. తక్కువ సమయంలోనే, వేసవి సెలవులు అయినప్పటికీ విద్యార్థుల నుంచి మంచి స్పందన లభించింది. మొత్తం 51 కథలు వచ్చాయి. కథలన్నీ చాలా బావున్నాయి. బాల సాహిత్య నిపుణులు ఈ కథలను చదివి, చర్చించి ప్రచురణకు 24 కథలు ఎంపిక చేశారు. ఈ కథల పోటీలు నిర్వహించి మరియు పుస్తక రూపాన్నిచ్చింది బాలచెలిమి. – **వేదకుమార్ మణికొండ**

పచ్చని పొలాలతో అందమైన సెలయేళ్ళతో ప్రకృతి ఒడిలో ఆడుకుంటునట్లుగా ఉన్న పచ్చని పల్లెటూరు మా రామాపురం. ఈ గ్రామంలో మంగమ్మ అనే పెద్దమ్మ ఉండేది. ఆమెకి ముగ్గురు కొడుకులు వారికి ఒక పెద్ద పండ్ల తోట ఉంది.

ఆ తోటలో మంగమ్మ, ముగ్గురు కొడుకులు కలిసి రకరకాల పండ్లను (నిమ్మ, దానిమ్మ, జామ, బొప్పాయి, మామిడి) పండించేవారు.

చక్కగా పండ్లు బుట్టలు బుట్టలుగా వచ్చేవి. చెట్లు కాపుకు వచ్చాయో లేదో మందలు మందలుగా కోతులు వచ్చి తోటలోని పండ్లను తిన్న కాడికి తిని, విసిరేసి, కొమ్మలు విరిసి ఆగమాగం చేసాయి. తోటంతా చిందరవందర అయింది. మంగమ్మ చాలా బాధ పడింది. ఇదేందిరా దేవుడా పంట కోతకు వచ్చే సమయానికి ఈ కోతుల బెడద ఏంది. ప్రతి ఏడూ ఇదో బాధ అయి పోయింది. అని మంగమ్మ చాలా విచారించింది. తన ఒక్కదాని తోట మాత్రమే కాదు. ఊర్లో ఇలా ఎందరికో నష్టం జరుగుతుంది.




పాపం! అవి మాత్రం ఏం చేస్తాయి వాటికి కూడా ఆకలి వేస్తుంది. అడవులు లేవాయే కడుపు కాలి ఊర్లో తోటల మీద పడ్డాయి. కోతులు వచ్చాయంటే బాంబులు వేసి బెదర కొట్టడం, డప్పుల మోత మోగించడం కాదు. వాటి ఆకలి కూడా తీరే మార్గం మనమే చూడాలి అనుకుంది.

అడవులు నరికి వేయడంతో జరిగిన అనర్థం ఇది అనుకొని బాధ పడింది.

జరిగిన నష్టానికి వేదన కాదు కదా పరిష్కారం. ఇప్పుడేం చేయాలి. అని ఒక్క క్షణం ఆలోచించింది తన 70 ఏళ్ల అనుభవాన్ని మదించి ఓ అద్భుతమైన ఆలోచన చేసింది.

పండ్ల గింజలని తోటంతా తిరిగి రోజులు రోజులు తీసి బాగా ఎండ బెట్టింది. అందరికి అదే సలహా ఇచ్చింది. సంచుల నిండా పండ్ల గింజలు నింపింది. ఎండాకాలంలో చక్కగా పండ్ల గింజల్ని సిద్ధం చేసుకుంది. ఓ రోజు ఊరి వాళ్ళందరినీ పిలిచి ఎవరికి ఏ గింజలు కావాలంటే అవి ఇచ్చింది. అట్లా ఆ నోట ఈ నోట అందరికి తెలిసింది. చుట్టు పక్కల గ్రామాల రైతులు కూడా వాటిని తీసుకోవడానికి వచ్చేవారు. రోహిణి కార్తీ తర్వాత గింజల్ని నాటారు. ప్రకృతి కూడా కరుణించింది. ఆ ఏడు వానలు కూడా బాగా పడ్డాయి. చక్కగా చెట్లు పెరిగాయి, ఎటు చూసినా పండ్ల చెట్లే. చుట్టు పక్కల ఊర్లన్నీ ఊరికి వెలుపల అడవి దగ్గర అంతా పండ్ల చెట్ల మయం అయింది. అంతే కోతులు ఊర్లను వదిలి నెమ్మది నెమ్మదిగా అడవి బాట పట్టాయి. "వానలు కురవాలి కోతులు పోవాలి" అన్న పెద్దల ఆకాంక్షను ఒక సామాన్యురాలి సంకల్పం నెర వేర్చింది. అవును మరి మనసుంటే మార్గం ఉంటుంది.

– **సునీత,** ఫోన్ : 7702169200

VOL **12**వ వసంతంలో

**139** ISSUES నూట ముప్పై తొమ్మిదో సంచిక

పూర్తి చేసుకున్న దక్కన్ ల్యాండ్





దక్కన్ ల్యాండ్

## పన్నెండు వసంతాల ప్రస్థానం...

తెలంగాణ ఉద్యమ కాలంలో ఆవిర్భవించిన 'దక్కన్‌ల్యాండ్' మాసపత్రిక 2024 మార్చి సంచికతో 139 నెలలు పూర్తి చేసుకుంది. ఈ కాల వ్యవధిలో తెలంగాణ భావజాలాన్ని వ్యాప్తి చేసి, పునర్నిర్మాణ అవసరాన్ని చాటి చెప్పేందుకు 'దక్కన్‌ల్యాండ్' ఇప్పటి వరకు వెలువడిన సంచికలను (2012, 2013, 2014, 2015, 2016, 2017, 2018, 2019, 2020, 2021, 2022, 2023) సంకలనాలుగా (12 నెలలకు ఒక సంకలనంగా) రూపొందించి పాఠకుల కోరిక మేరకు అందిస్తున్నాం. భవిష్యత్తులో కూడా వచ్చే సంచికలను సంకలనాలుగా తీసుకు వస్తామని తెలియ జేస్తున్నాం. ఆసక్తి కలవారు ఒక్కో సంకలనాన్ని రూ.400-లకు పొందవచ్చు (పార్శిల్ ఛార్జీలు అదనం).

**సంకలనాలు పొందేందుకు మా చిరునామా:**

ఎడిటర్, 'దక్కన్‌ల్యాండ్'
3-6-712/2, స్ట్రీట్ నెం. 12,
హిమాయత్‌నగర్,
హైదరాబాదు-500029, తెలంగాణ
మొబైల్: 9030626288
Email: desk.deccan@gmail.com
Website: www.deccanland.com

**ఆన్‌లైన్ ద్వారా చెల్లింపుకోసం:**

NAME : DECCAN LAND
BANK : KOTAK MAHINDRA BANK
ACCOUNT NO : 7111218829
IFSC CODE : KKBK0000555
BANK CODE : 000555
MICR CODE : 500485007

DECCAN LAND, Telugu Monthly Magazine Date of Publication 26th - February 2024,
ISSN 2581-3188 Postal Dates: 28th & 29th Every Month

RNI Regn. No. APTEL/2012/46784
Postal Regn.No.HCD/1167/2024-2026

Oxford Grammar High School

OGS JUNIORS grow naturally

43rd YEARS OF MERITORIOUS PERFORMANCE



**We make school time the best time for your kids**

At OGS Juniors, all the children are given a warm, safe, and stimulating environment so that they can grow to become individuals while exploring, imagining, creating, and playing.

- Loving atmosphere & play ground
- CCTV surveillance
- Certified teachers & caring staff
- Kids zone & play area
- Interactive & Value based Learning

**CARING TEACHERS & STAFF**
Your child will get the best care and attention

**ECO-FRIENDLY PRACTICES**
We let the children play with nature friendly material

**HUGE PLAYGROUND**
Your child will get lots of fresh air and playtime

**INTERACTIVE LEARNING**
Our trusted method helps your child communicate and learn with ease.

**Street No. 13, Himayathnagar, Hyderabad | Ph : 040 2763 6214, 99590 20512**

Edited, printed, published and owned by Manikonda Vedakumar,
Printed at Deccan Press, 1-9-1126/B, Azamabad, Hyderabad-500020, Telangana,
Published at CHANDRAM, 3-6-712/2, 12th Street, Himayatnagar, Hyderabad-500029, Telangana, Editor Manikonda Vedakumar